సోమవారం
26.10.2026

పేజీలు : 12 వెల : రూ. 5/-

వెలుతురు

తెలుగు దినపత్రిక

సంపుటి : 09
సంచిక : 133

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD

www.velthuru.com
Follow :

వెలుతురు సండే స్పెషల్

పసిడి సెగ..
పెళ్లింట కన్నీటి వ్యథ!

ఆకాశాన్నంటిన బంగారం ధరలతో మధ్యతరగతి కుటుంబాల విలవిల



ఇంట్లో ఆడపిల్ల పెళ్లంటే ఒకప్పుడు సందడి.. సంబురం. ఇప్పుడు అదే పెళ్లి ప్రస్తావన వస్తే మధ్యతరగతి తల్లిదండ్రుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. పెళ్లి మండపం, విందు భోజనాలు, ఇతర ఖర్చుల కంటే ముందుగా బంగారం ధరలే వారిని బెంబేలెత్తిస్తున్నాయి. ఒకప్పుడు పైసా పైసా కూడబెట్టి కుమార్తె పెళ్లికి నాలుగైదు తులాల బంగారం కొనుగోలు చేసిన కుటుంబాలు.. ఇప్పుడు రెండు తులాలు కొనాలన్నా అప్పుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ పెరుగుతున్న పసిడి ధరలు సామాన్యుల కలలను కరిగిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణలోని గ్రామీణ, పట్టణ మధ్యతరగతి

- ఆడపిల్ల పెళ్లంటేనే తల్లిదండ్రుల గుండెల్లో గుబులు
- నాడు రూ.30 వేలున్న తులం.. నేడు అందనంత ఎత్తుకు!
- గతంలో పెట్టిన బంగారం తిరిగి పెట్టలేక బంధువుల మధ్య ఇబ్బందులు
- ముంచుకొస్తున్న పెళ్లిళ్ల సీజన్‌తో సామాన్యుల్లో ఆందోళన

11

కుటుంబాలపై ఈ ప్రభావం తీవ్రంగా పడుతోంది. రాబోయే వారాల్లో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండటంతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది. - వెలుతురు, హైదరాబాద్ స్పెషల్ అక్టోబర్ 25

'వోకల్ ఫర్ లోకల్'తో
ప్రపంచ మార్కెట్లకు భారత ఉత్పత్తులు

పండుగల వేళ స్వదేశీ వస్తువుల కొనుగోలుకు ప్రాధాన్యమివ్వాలి
స్థానిక కళాకారులు, రైతులకు అండగా నిలవాలి
'మన్ కీ బాత్'లో ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 25:

భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో గుర్తింపు తీసుకురావడంలో 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమం కీలక పాత్ర పోషిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. పండుగల వేళ స్వదేశీ వస్తువుల కొనుగోలుకు ప్రాధాన్యమివ్వాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక కళాకారులు, రైతులు, చేతివృత్తులవారు, చిన్న వ్యాపారులకు మద్దతుగా నిలవడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చన్నారు. ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్'లో ప్రధాని పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

బిహార్ మఖానా, కర్ణాటక కందిపప్పు వంటి దేశీయ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లు లభిస్తున్నాయని, ఖాదీకి ఆదరణ పెరుగుతోందని తెలిపారు. మహారాష్ట్ర గిరిజనులు 'శబరి నేచురల్స్' ద్వారా తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్యాకేజింగ్‌కు జపాన్ ప్రతిష్ఠాత్మక 'గుడ్ డిజైన్ అవార్డు' లభించడాన్ని ప్రశంసించారు. సంప్రదాయ నైపుణ్యాలకు ఆధునిక మార్కెటింగ్‌ను జోడిస్తే అంతర్జాతీయ గుర్తింపు సాధ్యమన్నారు.

పంజాబ్‌లో 'నవ్-త్రింజన్' పేరిట చేపట్టిన సేంద్రియ పత్తి సాగును అభినందించారు. ఉత్తరాఖండ్‌లో ప్రజల భాగస్వామ్యంతో హేవల్ నది పునరుజ్జీవం పొందడాన్ని ఆదర్శంగా పేర్కొన్నారు. దీపావళి, ఛఠ్ పండుగల నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. 'మన్ కీ బాత్' ప్రారంభమై 12 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలే తనకు మార్గదర్శకులని, ఈ కార్యక్రమం తనకు ఓ తీర్థయాత్రతో సమానమని మోడీ అభివర్ణించారు.

రైస్ మిల్లర్ల అక్రమాలపై
సీఐడీ కొరడా
రూ.96 కోట్ల నష్టం.. 16 మంది అరెస్ట్

- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో సోదాలు.. రికార్డుల పరిశీలన
- సీఎంఆర్ బియ్యం పక్కదారి పట్టించారన్న ఆరోపణలు
- అక్రమాల్లో ఇతరుల పాత్రపైనా దర్యాప్తు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

తెలంగాణలో ప్రభుత్వ ధాన్యం, బియ్యం అక్రమాలపై నేర పరిశోధన విభాగం (సీఐడీ) కొరడా ఝుళిపించింది. రైతుల నుంచి ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ విధానంలో మిల్లర్లకు అప్పగించిన అనంతరం, ఆ ధాన్యం, బియ్యం నిల్వల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 16 మంది రైస్ మిల్లర్లను అరెస్ట్ చేసినట్లు ఆదివారం వెలువడిన వార్తా కథనాలు వెల్లడించాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.96 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సమాచారం. మరికొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

లెక్కల్లో తేడాలు.. అక్రమాలపై ఆరా

ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. అయితే, కొందరు మిల్లర్లు ఈ విధానాన్ని దుర్వినియోగం చేసి ప్రభుత్వానికి అందించాల్సిన

- మిగతా 2 లో..

ఓటును, దేశాన్ని కాపాడుకుందాం

- నవంబర్ 1న రాంలీలా మైదాన్లో భారీ ర్యాలీకి రాహుల్ గాంధీ పిలుపు
- ఢిల్లీలోనే ఉండాలని పార్టీ ఎంపీలకు మల్లికార్జున ఖర్గే ఆదేశం

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 25:

ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపు, ఓట్ల చోరీ ఆరోపణలపై నిరసనగా నవంబర్ 1న ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రకటించారు. 'సేవ్ ది ఓట్ సేవ్ ది కంట్రీ' పేరుతో జన మార్చ్, భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, వ్యాపారులు సహా ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

'ఓటర్ల జాబితాల నుంచి పేర్లను తొలగిస్తున్నారు. నిబంధనలను, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు. అక్రమాలపై ప్రశ్నలు లేవనెత్తిన వారిపై లాఠీలతో దాడులు చేశారు. దీనిని ఏ పరిస్థితుల్లోనూ ప్రజలు మౌనంగా సహించరు. నవంబర్ 1న ఢిల్లీకి పదండి. ఓటును, దేశాన్ని కాపాడుకుందాం. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు పౌరులు ఉద్యమంలో భాగస్వాములు కావాలి.ఓటు మీది. పోరాటమూ మీదే' అంటూ రాంలీలా మైదాన్, ఢిల్లీ అని పోస్టో రాసుకొచ్చారు. అలాగే గమనిక అని తమ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పిస్తున్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు వ్యంగ్యంగా కృతజ్ఞతలు తెలిపారు. ర్యాలీకి ముందు

- మిగతా 2 లో..

మోదీపై ఖర్గే వ్యాఖ్యలు
దిగజారుడుతనానికి నిదర్శనం

దేశ ప్రజలకు ఖర్గే బేషరతుగా క్షమాపణ చెప్పాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఖర్గే వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలకు చెప్పుకోవడానికి ఏమీ లేని కారణంగానే కాంగ్రెస్ పార్టీ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ వ్యక్తిగత జీవితం, కుటుంబాన్ని

- మిగతా 2 లో..

ప్రయాణికులకు ఆర్టీసీ ధమాకా ఆఫర్

- సరికొత్త పథకానికి టీజీఎస్ ఆర్టీసీ శ్రీకారం
- హైదరాబాద్‌లో ఇక మరింత ఈజీ
- రూ.600కే వారం రోజుల పాటు క్యూర్ పరిధిలో అన్ని బసుల్లో అపరిమిత ప్రయాణం

12

రాష్ట్రానికి తుపాను హెచ్చరికలు

27 నుంచి 29 వరకు పలు జిల్లాల్లో భారీ వర్షాలు
వాతావరణ శాఖ చల్లని కబురు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

ఎల్‌నినో ప్రభావం కారణంగా అధిక ఉష్ణోగ్రత, ఉక్కపోతతో సతమతమవుతున్న సందర్భంలో వాతావరణ శాఖ చల్లని కబురందించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కొద్దిరోజుల్లో తుపానుగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించింది. ఈ నెల 28 నాటికి వాయుగుండం తుపానుగా మారి ఆంధ్రప్రదేశ్ తీరానికి సమీపంలోకి చేరుకుంటుందని,ఈ ప్రభావంతో రాష్ట్రంలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దీంతో ఈ మూడు జిల్లాలకు ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది.

రాష్ట్రంలో మూడు రోజుల పాటు వానలు

ఈ తుపాను ప్రభావంతో

- మిగతా 2 లో..

కొరియా పెట్టుబడులకు తెలంగాణలో విస్తృత అవకాశాలు

- సాంస్కృతిక, ఆర్థిక బంధాలకు తెలంగాణ సర్కారు ప్రాధాన్యం
- ఐదేళ్లలో పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- కె హార్మనీ ఫెస్టా - కొరియా సాంస్కృతిక దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

సిలిండర్ ధర రూ.8వేలు

- పాకిస్థాన్‌లో గ్యాస్ సంక్షోభం
- ఇరాన్ సరిహద్దులు మూసేయడంతో ఇబ్బందులు

ఇస్లామాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

దాయాది దేశం పాకిస్తాన్ మరో సంక్షోభంతో సతమతం అవుతోంది. ఆ దేశంలో వంటగ్యాస్ కొరత తీవ్రమైంది. ఇరాన్‌తో కీలక సరిహద్దు మార్గాలను మూసేయడంతో దేశంలో లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో 12 కిలోల గ్యాస్ సిలిండర్ ధర కొన్ని ప్రాంతాల్లో రూ. 8200కు చేరింది. (భారత కరెన్సీలో ఇది రూ. 2700 సుమారుగా) చలికాలం సమీపిస్తుండటంతో ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో సామాన్య ప్రజలపై తీవ్ర ప్రభావం పడబోతోంది.

సరిహద్దు మూసివేత

2026 అక్టోబర్ 17న పాకిస్తాన్-ఇరాన్ మధ్య ఉన్న గబ్ద్-రిమ్దాన్, తాఫ్తాన్ సరిహద్దు మార్గాలను మూసివేశారు. బలూచిస్తాన్‌లో

- మిగతా 2 లో..

కొరియా పెట్టుబడులకు తెలంగాణలో విస్తృత అవకాశాలు

కొరియాతో సాంస్కృతిక, ఆర్థిక బంధాలకు తెలంగాణ సర్కారు ప్రాధాన్యం

- ఐదేళ్లలో పర్యాటక రంగానికి రూ.15 వేల కోట్ల పెట్టుబడుల లక్ష్యం
- ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, ఔషధ రంగాల్లో పెట్టుబడులకు ఆహ్వానం
- కె హార్మనీ ఫెస్టా - కొరియా సాంస్కృతిక దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

కొరియా సంస్థల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు రాష్ట్రంలో ఉద్యోగాల కల్పన, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, యువత నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఆధునిక తయారీ, లైఫ్ సైన్సెస్, పునరుత్పాదక ఇంధనం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కొరియా సంస్థలతో కలిసి పనిచేసేందుకు తెలంగాణలో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం నిర్వహించిన కె హార్మనీ ఫెస్టా-కొరియా కల్చర్ డే 2026 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు.

2024 ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణ కొరియాలో చేపట్టిన పర్యటన సందర్భంగా జరిగిన పెట్టుబడుల చర్చలు రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక భాగస్వామ్యానికి పునాది వేశాయని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లి పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కొరియా ఆర్థిక ప్రగతి నుంచి తెలంగాణ నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, విద్య, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతికతపై నిరంతర పెట్టుబడులు అభివృద్ధికి దోహదపడతాయని చెప్పారు.

పరిశ్రమలతో పాటు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, చిన్న పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. పర్యాటక రంగంలోనూ కొరియా పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-2030 ద్వారా రూ.15,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం, అదనంగా మూడు లక్షల ఉపాధి అవకాశాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. పర్యాటక మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగం, చలనచిత్ర పర్యాటకం, వెల్‌నెస్ టూరిజం, సాంస్కృతిక అనుభవాల అభివృద్ధిలో కొరియా సంస్థల భాగస్వామ్యాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

భారత్-కొరియా మధ్య సాంస్కృతిక బంధం

కొరియా సంస్కృతి, కళలు, సంగీతం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ వేడుక రెండు దేశాల ప్రజల మధ్య స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

యుద్ధం, పేదరికం వంటి సవాళ్లను అధిగమించి కొరియా ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగిందని కొనియాడారు. సాంకేతికత, తయారీ, విద్య, ఆవిష్కరణల్లో ఆ దేశం సాధించిన విజయాలు ప్రశంసనీయమన్నారు. కొరియన్ సంగీతం, సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాలు ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకర్షిస్తున్నాయని, సాంస్కృతిక ప్రభావం కూడా ఒక దేశ అంతర్జాతీయ గుర్తింపును పెంపొందిస్తుందని పేర్కొన్నారు. భారత్, కొరియా ప్రజల మధ్య విద్య, కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలు, పెద్దల పట్ల గౌరవం వంటి అంశాల్లో సారూప్యతలు ఉన్నాయని తెలిపారు. ప్రాచీన భారతదేశం నుంచి కొరియాకు వెళ్లినట్లు విశ్వసించే రాణి హియో హ్వాంగ్-ఓక్ గాథ రెండు దేశాల మధ్య చారిత్రక స్నేహానికి ప్రతీకగా నిలిచిందన్నారు.

తెలంగాణ వారసత్వానికి అంతర్జాతీయ గుర్తింపు

విభిన్న సంస్కృతులు, భాషలు, సంప్రదాయాల కలయికకు హైదరాబాద్ శతాబ్దాలుగా కేంద్రంగా నిలిచిందని చెప్పారు. బతుకమ్మ, బోనాలు, తెలుగు సాంస్కృతిక వారసత్వం, చారిత్రక కట్టడాలు తెలంగాణ ప్రత్యేకతలని వివరించారు. చార్మినార్, గోల్కొండ కోట, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన రామప్ప దేవాలయం సహా రాష్ట్రంలో అనేక పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని పేర్కొన్నారు. నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలు భారత్, తూర్పు ఆసియా దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయగలవని అన్నారు. కొరియా పర్యాటకులు తెలంగాణను సందర్శించాలని, ఇరు ప్రాంతాల యువత చదువు, పరిశోధన, ఉద్యోగాలు, సృజనాత్మక రంగాల్లో పరస్పరం అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య ఒప్పందాలు ముఖ్యమైనప్పటికీ, ప్రజల మధ్య ఆప్యాయత, పరస్పర అవగాహనే సంబంధాలకు శాశ్వత పునాది అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ కొరియా మిత్రులకు మరో ఇల్లు వంటిదని అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు భారతదేశంలోని రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబారి హెచ్.ఈ. లీ సియుంగ్-హో స్వాగతం పలికారు.

ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటాం

భారత్ చేరుకోలేని టార్గెట్ ఏదీ లేదని రుజువైంది

వాయుసేన చీఫ్ ఏపీ సింగ్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 25:

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన 'ఆపరేషన్ సిందూర్' గురించి ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా వెస్ట్రన్ ఫ్రంట్ (పశ్చిమ సరిహద్దు)లో 1,200 కి.మీల వెడల్పు, 200 కి.మీల లోతు వరకు ఐఏఎఫ్ జరిపిన కచ్చితమైన, ప్రణాళికబద్ధమైన దాడులు తమ పరిధికి మించిన లక్ష్యం ఏదీ లేదని నిరూపించాయని అన్నారు. ఐఏఎఫ్ అనుసరిస్తున్న సామర్థ్య కేంద్రీకృత విధానానికి ఆపరేషన్ సిందూర్ ఒక నిదర్శనమని కొనియాడారు. దేశ రక్షణ రంగంలో వ్యూహాత్మక నిరోధకంగా, తక్షణమే స్పందించే అగ్రగామిగా వైమానిక దళం అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని ఈ ఆపరేషన్ మరోసారి నిరూపించిందని తెలిపారు. ప్రముఖ వార్తా సంస్థ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పలు విషయాలను షేర్ చేసుకున్నారు.

స్వదేశీ ఆయుధాల పనితీరుపై ప్రశంసలు

ఆపరేషన్ సిందూర్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఆయుధాల పనితీరును కూడా ఏపీ సింగ్ ప్రముఖంగా ప్రస్తావించారు. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన అనేక ఆయుధాలు అసాధారణంగా పనిచేసి, శత్రువును తీవ్రంగా దెబ్బతీశాయని పేర్కొన్నారు. శత్రువు వ్యూహాలు మార్చినప్పుడు మనం ఎల్లప్పుడూ బహుళ ఎంపికలను, పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. భారత వైమానిక దళం ఎంచుకున్న మార్గం సరైనదేనని ఆపరేషన్ సిందూర్ నిరూపించిందన్నారు. అందుకే భవిష్యత్తులో మరింత దృఢ సంకల్పంతో ఈ మార్గంలోనే కొనసాగుతామని వివరించారు. ఐఏఎఫ్ దేశ అవసరాలకు అనుగుణంగా మరింత వేగంగా, కచ్చితత్వంతో ముందుకు సాగుతోందన్నారు.

"టీజీ-ఐపాస్"పై సైబర్ దాడి

- సర్వర్‌ను హ్యాక్ చేసి డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేసిన నేరగాళ్లు
- రాన్సమ్‌వేర్ దాడిగా నిర్ధారణ.. కేసు నమోదు చేసిన సైబర్ బ్యూరో
- పరిశ్రమల శాఖ ఫిర్యాదుతో ఐటీ చట్టం కింద దర్యాప్తు ప్రారంభం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన కీలకమైన టీజీ-ఐపాస్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగింది. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులను సులభతరం చేసే ఈ 'గవర్న్‌మెంట్ టు బిజినెస్' (జీ2బీ) ప్లాట్‌ఫారమ్ సర్వర్‌ను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేయడంతో పోర్టల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ఘటనపై 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో' (టీజీసీఎస్‌బీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది.

అక్టోబరు 22న రాత్రి 11:36 గంటలకు ఈ సైబర్ దాడి జరిగినట్లు అధికారులు గుర్తించారు. పోర్టల్ అప్లికేషన్ పనిచేయకపోవడంతో టెక్నికల్ బృందం వెంటనే రంగంలోకి దిగింది. క్లౌడ్4సీ అనే సంస్థ సహకారంతో సర్వర్‌ను రీస్టార్ట్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. లోతుగా పరిశీలించగా.. ఎస్‌క్యూఎల్ సర్వర్ ఏజెంట్ సర్వీస్ ఆగిపోయినట్లు తేలింది. పునరుద్ధరణ ప్రయత్నాలు విఫలమవడంతో ఇది సాధారణ సాంకేతిక సమస్య కాదని, హ్యాకింగ్ జరిగిందని నిర్ధారణకు వచ్చారు. సర్వర్‌లో మెషిన్ ఐడెంటిఫయర్‌తో కూడిన ఒక రాన్సమ్‌నోట్ కనిపించింది. హ్యాకర్లు తమ ఈ-మెయిల్ అడ్రస్‌ను కూడా అందులో ఉంచారు. డేటాను తొలగించకుండా, డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి నిలిపివేయడంతో దీనిని రాన్సమ్‌వేర్ దాడిగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సంగాసురేశ్ శనివారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు స్వీకరించిన టీజీసీఎస్‌బీ అధికారులు, ఐటీ చట్టంలోని సెక్షన్ 43 (కంప్యూటర్ వ్యవస్థలకు నష్టం), సెక్షన్ 66 (సైబర్ నేరాలు) కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుతం టీజీ-ఐపాస్ సేవలు అందుబాటులో లేవు. హ్యాకర్లు డేటాను కాపీ చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు

ఓటును, దేశాన్ని కాపాడుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

మరో ఏడు రోజులపాటు ఇదే ఉత్సాహంతో ప్రచారం కొనసాగించాలని వ్యాఖ్యానించారు.

మూడు రోజులపాటు ఢిల్లీలోనే ఎంపీలు

ఇదిలా ఉండగా, ర్యాలీ నేపథ్యంలో పార్టీ ఎంపీలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక సూచనలు చేశారు. అక్టోబర్ 30,31, నవంబర్ 1 తేదీల్లో ఎంపీలంతా ఢిల్లీలో అందుబాటులో ఉండాలని కోరారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ఎంపీలు పాల్గొనేలా కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల అక్రమాలు, ఓట్ల తొలగింపును నిరసిస్తూ అక్టోబర్ 30న ఢిల్లీలోని అశోక్ హోటల్ వేదికగా విపక్షాలు మాక్ పార్లమెంట్ నిర్వహించనున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సీఈసీ తీరును ఎండగడుతూ ప్రతీకాత్మకంగా ఆయనపై ఈ వేదికగా ప్రజా అభిశంసన చేపట్టనున్నారు. ఇండియా కూటమికి చెందిన ఎంపీలు, అగ్రనేతలంతా హాజరయ్యే ఈ సమావేశంలో సీఈసీకి వ్యతిరేకంగా ఒక బహిరంగ ప్రజా తీర్పును కూడా వెల్లడించనున్నారు. ఈ మాక్ పార్లమెంట్ ముగిసిన అనంతరం నవంబర్ 1న ఓట్‌చోరీకి వ్యతిరేకంగా పదిలక్షల మందితో రాంలీలా మైదానానికి ఢిల్లీ చలో మార్చ్ నిర్వహించాలని కాంగ్రెస్ తలపెట్టింది.

విద్య, సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

- పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ప్రజా ప్రభుత్వం లక్ష్యం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్
- రూ.200 కోట్లతో జగిత్యాల జిల్లా తాటిపల్లి లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం
- 25 ఎకరాల్లో 2,500 మంది విద్యార్థులకు ఆధునిక వసతులతో విద్య

జగిత్యాల, వెలుతురు అక్టోబర్ 25:

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించి, వారి జీవితాల్లో సమూల మార్పులు తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఆదివారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తన రాజకీయ ప్రస్థానం విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైందని తెలిపారు. పేద ప్రజలకు అందించగలిగే అత్యంత విలువైన సంపద విద్యేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన కులగణనలోనూ విద్య ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్న విషయం స్పష్టమైందని తెలిపారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాలలో ఇటీవల కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాటిపల్లిలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్మపురి బస్ డిపోను కోరిన వెంటనే మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ద్వారా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తాటిపల్లిలో 25ఎకరాల విస్తీర్ణంలో సుమారు 2,600 మంది విద్యార్థులకు ఉపయోగపడేలా ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కాలానికి అనుగుణంగా విద్యావ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకువస్తూ ముఖ్యమంత్రి స్వయంగా విద్యారంగ అభివృద్ధిపై పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ తాటిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 2,600 మంది విద్యార్థులకు విద్యనందించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, జగిత్యాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసన్నాంబ, మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, మార్కెట్ కమిటీ చైర్మన్లు,నారాయణ రెడ్డి , సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ ధర రూ.8వేలు

(మొదటిపేజీ తరువాయి)

తిరుగుబాటు నేపథ్యంలో అక్కడి ప్రభుత్వం అక్రమ రవాణా నియంత్రణ కోసం సరిహద్దుల్ని మూసేసింది. అమెరికా ఒత్తిడి, ఆంక్షల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నారనే ఊహాగానాలు ఉన్నాయి. సరిహద్దు మూసేయడంతో ఎల్పీజీ రవాణా దెబ్బతింది. వందలాది ట్యాంకర్లు సరిహద్దులకు ఇరువైపుల నిలిచిపోయాయి. 4500 మెట్రిక్ టన్నులకు పైగా గ్యాస్ ఇరాన్ వైపు నిలిచిపోయినట్లు సమాచారం.

రూ. 4500 నుంచి రూ. 8200కు..

సరిహద్దు మూసేయడంతో గతంలో 12 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ. 4500 ఉండగా, ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో రూ. 7000 నుంచి రూ. 8000 వరకు పెరిగింది. లాహోర్‌లో సుమారు రూ. 7500 ఉంటే, స్కార్డు లో ఇది రూ. 8200కు చేరింది. పాకిస్తాన్ తన గ్యాస్ దిగుమతుల్లో 70 శాతం ఇరాన్‌పైనే ఆధారపడుతోంది. రాబోయే చలికాలం కావడంతో గ్యాస్ డిమాండ్ మరింత పెరుగుతోంది. దీంతో గ్యాస్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

రైస్ మిల్లర్ల అక్రమాలపై సీఐడీ కొరడా

(మొదటిపేజీ తరువాయి)

ధాన్యం, బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు అందించాల్సిన సన్న బియ్యానికి బదులుగా తక్కువ ధరకు లభించే దొడ్డు బియ్యాన్ని సరఫరా చేశారన్న ఆరోపణలూ ఉన్నాయి.

సీఎంఆర్ బియ్యం నిల్వలు, మిల్లింగ్ వివరాలు, ప్రభుత్వానికి తిరిగి అప్పగించిన బియ్యం పరిమాణంలో వ్యత్యాసాలు గుర్తించిన పౌరసరఫరాల శాఖ అధికారులు అంతర్గత విచారణ చేపట్టినట్లు సమాచారం. క్షేత్రస్థాయి పరిశీలనలో వెల్లడైన అంశాల ఆధారంగా సంబంధిత వివరాలను సీఐడీకి అందించడంతో దర్యాప్తు ముమ్మరమైంది. నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్, రంగారెడ్డి, ములుగు, మెదక్ జిల్లాలతో పాటు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో మిల్లులు, కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించినట్లు వార్తా కథనాలు పేర్కొన్నాయి.

రికార్డుల స్వాధీనం.. మరింత లోతుగా విచారణ

సోదాల సందర్భంగా ధాన్యం, బియ్యం నిల్వలకు సంబంధించిన లెక్కలు, రికార్డులు, సరఫరా వివరాలను అధికారులు పరిశీలించినట్లు సమాచారం. నిల్వలకు, పత్రాల్లో నమోదైన వివరాలకు మధ్య తేడాలు ఉన్నాయన్న అనుమానాల నేపథ్యంలో కీలక ఆధారాల సేకరణపై దృష్టి సారించారు. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 16 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో మిల్లర్ల పాత్రతో పాటు వారికి సహకరించినట్లు అనుమానిస్తున్న మధ్యవర్తులు, ఇతరుల ప్రమేయంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి చెందాల్సిన ధాన్యం ఎక్కడికి తరలించారు బియ్యం సరఫరాలో అక్రమాలు ఎలా జరిగాయి నిల్వల లెక్కల్లో వ్యత్యాసాలకు కారణాలేమిటి ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని ఎలా రికవరీ చేయాలి అనే అంశాలపై విచారణ కీలకం కానుంది.

ప్రస్తుత సీఐడీ కేసులోని రూ.96 కోట్ల అంచనా

రాష్ట్రంలో సీఎంఆర్ బకాయిలు, ధాన్యం మళ్లింపు ఆరోపణలపై గతంలోనూ పలు జిల్లాల్లో తనిఖీలు జరిగాయి. ఈ ఏడాది ఆగస్టులో వెలువడిన నివేదికల ప్రకారం, 89 మిల్లుల్లో 3.72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, సుమారు రూ.927.16 కోట్ల విలువైన నిల్వలు లెక్కల్లో కనిపించలేదని అధికారులు అంచనా వేశారు. ఈ విస్తృత వ్యవహారానికి సంబంధించిన వివరాలు ప్రస్తుత సీఐడీ కేసులోని రూ.96 కోట్ల అంచనాతో ఒకటేనా అన్నది మాత్రం స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వ ధాన్యం, బియ్యం అక్రమాలపై కొనసాగుతున్న దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే, నిందితులపై ఆరోపణలు, ప్రభుత్వానికి జరిగిన నష్టం, ఇతరుల ప్రమేయానికి సంబంధించిన తుది వివరాలు దర్యాప్తు పూర్తయ్యాకే స్పష్టమవుతాయి.

రాష్ట్రానికి తుపాను హెచ్చరికలు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో ఈ నెల 27 నుంచి 29 వరకు చాలా జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ఎల్‌నినోతో కొద్ది రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కాగా, ప్రస్తుతం వాతావరణంలో కొద్దికొద్దిగా మార్పు వస్తోంది. శుక్రవారం నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతూ వస్తున్నాయి. పలు జిల్లాల్లో చలిగాలులు వీస్తున్నాయి. వేకువజామున మంచు దుప్పటి పరచుకుంటోంది.

జిల్లాల్లో అతి భారీ వర్షాలు

ఉమ్మడి ఖమ్మం, ములుగు, మహబూబ్‌బాద్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. అలాగే భూపాలపల్లి, వరంగల్, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అతి భారీగా వానలు పడొచ్చని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఇక జనగామ, యాదాద్రి భువనగిరి, హనుమ కొండ, మహబూబ్ నగర్, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని, ఈ ప్రాంతాలకు పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

దూసుకొస్తున్న 'అర్నబ్' తుపాన్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి అర్నబ్ తుపాన్గా మారుతున్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. తుపానుగా మారిన తర్వాత 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం రాత్రికి వాయుగుండంగా బలపడింది. ఇది కాకినాడకు 910 కి.మీ., విశాఖకు 820 కిలోమీటర్లు, బాపట్ల కు 1,100 కి.మీ., మచిలీపట్నానికి 1,020 కి.మీ. దూరంలో కేంద్రీకృతమైంది. తర్వాత పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ ఆదివారానికి మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారనుంది. సోమవారం ఉదయానికి తూర్పు, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడనుంది. మంగళవారం ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం కనిపిస్తోంది. తర్వాత పశ్చిమ, వాయవ్య దిశగా కదులుతూ అతి తీవ్ర తుపానుగా మారొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

దిగజారుడుతనానికి నిదర్శనం

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం దుర్మార్గమని బండి సంజయ్ అన్నారు. చిన్నతనంలో మోదీ ఎదుర్కొన్న పేదరికాన్ని ఎగతాళి చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ, మోదీ తల్లిదండ్రులను సైతం విమర్శలకు లక్ష్యంగా చేసుకోవడం నీచమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశ ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రధాని మోదీ కుటుంబంపై దాడులకు దిగడం సరికాదని బండి సంజయ్ పేర్కొన్నారు. రాజకీయాల్లో విమర్శలు విధానాలు, ప్రజా సమస్యల ఆధారంగా ఉండాలే తప్ప వ్యక్తిగత జీవితం, కుటుంబ సభ్యులను కించపరిచేలా ఉండకూడదని అన్నారు.

ప్రధాని మోదీ కుటుంబంపై చేస్తున్న ఇటువంటి విమర్శలను దేశ ప్రజలు ఎన్నటికీ అంగీకరించరని ఆయన స్పష్టం చేశారు. మల్లికార్జున ఖర్గే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

ధర్మపురి బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

- రూ. 2.57 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక సౌకర్యాల కల్పన
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో రూ. 13 వేల కోట్ల మేర లబ్ధి
- 2027 గోదావరి పుష్కరాల కోసం రూ. 226 కోట్లతో అభివృద్ధి పనులు

వెలుతురు జగిత్యాల ధర్మపురి, అక్టోబర్ 25: ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసేందుకు రూ. 2.57 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఆధునీకరణ పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు.

బస్‌స్టేషన్‌లో ఆధునిక సౌకర్యాలు

ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రాజెక్టులో భాగంగా రెండు ప్లాట్‌ఫారాల విస్తరణ, సీసీ పేవ్‌మెంట్, గ్రానైట్ ఫ్లోరింగ్, భవనానికి ఏసీపీ క్లాడింగ్, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు, రూఫ్ స్లాబ్, సీలింగ్ మరమ్మతులు చేపట్టనున్నారు. అదేవిధంగా వర్షపు నీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి, పెయింటింగ్, పల్లపు ప్రాంతాల్లో కంకర వేయడం, ల్యాండ్‌స్కేపింగ్, విద్యుదీకరణ, పంప్‌సెట్‌తో కూడిన బోర్‌వెల్ ఏర్పాటు చేయనున్నారు.

మహిళలకు ఉచిత ప్రయాణం..
ఆర్టీసీ సేవల విస్తరణ

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఇప్పటివరకు సుమారు 360 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా మహిళలకు దాదాపు రూ. 13 వేల కోట్ల మేర ఆర్థిక ప్రయోజనం చేకూరిందని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు సేవలు విస్తరించడంతోపాటు బాసర, భద్రాచలం, ధర్మపురి, గూడెం, కాళేశ్వరం తదితర పుణ్యక్షేత్రాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేం దుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ధర్మపురి నుంచి ముంబైకి ఏసీ బస్సు నడిపే ప్రతిపాదనను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటుకు చర్యలు

1993లో ప్రారంభమైన ధర్మపురి బస్‌స్టేషన్‌ను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ధర్మపురిలో బస్ డిపో ఏర్పాటు చేయాలన్న స్థానిక ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామని, ఎన్నికలకు ముందే డిపో నిర్మాణానికి శంకుస్థాపన జరిగేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కోరినట్లు వెల్లడించారు.

పుష్కరాల అభివృద్ధికి రూ. 226 కోట్లు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాలు, ఘాట్లు, రహదా రుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ధర్మపురి ఉగ్ర నరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ. 10కోట్లు, పుష్కర ఘాట్లు, బైపాస్ రహదారులు తదితర అభివృద్ధి పనులకు సుమారు రూ. 226 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, బస్‌స్టేషన్ ఆధునీకరణతో వారికి మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటు లోకి వస్తాయని పేర్కొన్నారు. ఆలయాలు, ఘాట్లు, రహదారుల అభివృద్ధితో పుష్కరాల సమయంలో భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించవచ్చని తెలిపారు.

నాణ్యతతో పనులు పూర్తి చేయాలి:: కలెక్టర్

జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ బస్‌స్టే షన్ ఆధునీకరణ పనులను నిర్దేశిత ప్రమాణాల ప్రకారం చేపట్టి, నాణ్యత విషయంలో రాజీ పడ కుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వర్షపు నీటి పారు దల వంటి సదుపాయాలు సక్రమంగా అందుబా టులో ఉండేలా పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దినేష్, ఆర్.టి.సి. అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోరుడి ఓటు హక్కును కాపాడే వరకు పోరాడుతాం

-తమిళనాడులో ఓటు బచావో- దేశ్ బచావో కార్యక్రమంలో బల్మూర్ వెంకట్

తమిళనాడు, వెలుతురు అక్టోబర్ 25 : ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడే వరకు పోరాడుతామని తెలంగాణ ప్రభుత్వ విప్, తమిళనాడు ఏఐసీసీ పరిశీలకుడు డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆదివారం తమిళనాడులో పర్యటించిన ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఓటు బచావో--దేశ్ బచావో, సీఈసీ హటావో కార్యక్రమంలో భాగంగా టీఎన్‌సీసీ పరిశీలకుడు కిజ్వనూర్ రాజేంద్రన్, డీసీసీ అధ్యక్షులతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితాల నుంచి ప్రజల పేర్లను తొలగిస్తున్నారని, దీనిపై ప్రశ్నించిన వారిపై కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్టోబర్ 25 నుంచి నవంబర్ 25 వం-కు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల నుంచి తొలగించిన వారి వద్దకు వెళ్లి, వారి ఓట్లు తిరిగి నమోదయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని బల్మూర్ వెంకట్ కోరారు.

ప్రతి గ్రామ అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక
- అమరచింత మండలంలోని 14 గ్రామాలపై మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష

అమరచింత, వెలుతురు అక్టోబర్ 25: మక్తల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా, ప్రతి గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఈ రోజు అమరచింత మండలంలోని 14 గ్రామాల అభివృద్ధిపై కూలంకషంగా చర్చిస్తూ, ఆయా గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ప్రతి గ్రామానికి 20 నుంచి 30 నిమిషాల సమయం కేటాయించి, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, తక్షణమే పరిష్కరించాల్సిన అంశాలు, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై వివరంగా చర్చించారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార మార్గాలు, చేపట్టాల్సిన పనులు, అమలు చేయాల్సిన కార్యాచరణతో మంత్రి స్వయంగా ప్రత్యేక నోట్ రూపొందించి, నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాధారణంగా పట్టణాలు, మండల కేంద్రాల్లోని సమస్యలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నప్పటికీ, మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు కూడా పరిష్కారం కావాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి సమాన ప్రాధాన్యతనిస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ సమీక్షలు దోహదపడనున్నాయని తెలిపారు .గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రాధాన్యత క్రమంలో చర్యలు తీసుకునేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. సమస్యలను గుర్తించడానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి గడువును నిర్ణయించి పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే మక్తల్ నియోజకవర్గం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందనే దృక్పథంతో స్థానిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి గ్రామాల వారీగా సమీక్షలు దోహదపడనున్నాయని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు భార్గవ్ దేశ్‌పాండే రాజీనామా

- కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక
- ఇది ఒరిజినల్ కాంగ్రెస్ కాదు.. టీడీపీ, ఆర్ఎస్ఎస్ కాంగ్రెస్

'లీవ్ కాంగ్రెస్.. సేవ్ తెలంగాణ' అంటూ భార్గవ్ దేశ్‌పాండే విజ్ఞప్తి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25: ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా భార్గవ్ దేశ్‌పాండే తెలంగాణ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. టీడీపీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలాలు కలిగిన నాయకుల చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఉందని ఆరోపించారు. తాను 2006 నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతు న్నానని, అయితే అప్పటి కాంగ్రెస్‌కు, ఇప్పటి కాంగ్రెస్‌కు ఎంతో తేడా ఉందని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు

ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు పూర్తిగా రేవంత్ రెడ్డికి సరెండర్ అయిపోయారని భార్గవ్ దేశ్‌పాండే విమర్శించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ చెప్పే మాటలకు, తెలంగాణలో కొనసాగు తున్న పాలనకు పూర్తి విరుద్ధంగా ఉందని ఆరోపిం చారు. కేవలం రేవంత్ రెడ్డి వల్లే కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చిందన్న వాదన నిజమైతే, గతంలో తెలుగుదేశం పార్టీని ఎందుకు అధికారంలోకి తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి చుట్టూ ఉన్న నలుగురు, ఐదుగురు నాయకులు తప్ప మరెవరూ బాగుపడలేదని విమర్శించారు. ఇది అసలైన కాంగ్రెస్ పార్టీ కాదని, తెలుగుదేశం, ఆర్ఎస్ఎస్ భావజాలంతో నడుస్తున్న కాంగ్రెస్ అని భార్గవ్ దేశ్‌పాండే వ్యాఖ్యానించారు. 'లీవ్ కాంగ్రెస్.. సేవ్ తెలంగాణ' అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అంటే బలాదూర్.. బేకార్ రాష్ట్ర సమితి

- హరీశ్‌రావుపై టీపీసీసీ ఫిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ హాట్ కామెంట్స్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 : బీఆర్ఎస్ అంటే బలాదూర్ రాష్ట్ర సమితి, బేకార్ రాష్ట్ర సమితి, బట్టేబాజ్ రాష్ట్ర సమితి అని టీపీసీసీ ఫిషరీస్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ విమర్శించారు. పదేళ్లపాటు రాష్ట్రాన్ని ఆగం చేసిన నాయకులు ఇప్పుడు నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. హరీశ్‌రావు నిజాలు మాట్లాడరని, అబద్ధాలు చెప్పడంలో తన మామ కేసీఆర్‌ను మించిపోయారని ఆరోపించారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల వైఫల్యానికి కేసీఆర్, హరీశ్‌రావులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కమిషన్ల కోసం కక్కుర్తిపడి మేడిగడ్డను కూల్చేశారని విమర్శించారు. మేడిగడ్డకు వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు హరీశ్ రావును నిలదీయాలని సూచించారు. బీఆర్ఎస్ చేసిన తప్పులను ప్రజలకు చూపించేందుకే ఆ పార్టీ నాయకులను మేడిగడ్డకు వెళ్లనిచ్చామని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు బీఆర్ఎస్‌లో రెండో స్థానం కోసం ప్రయత్నిస్తున్నారని, ఎంత ప్రయత్నించినా ఆ స్థానం దక్కదని సాయికుమార్ అన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావులకు పార్టీలో నాయకత్వ లక్షణాలు లేవా? అని ప్రశ్నించారు. వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి అర్హత లేదా అని నిలదీశారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ చేసిన అక్రమాలు అనేకం ఉన్నాయని ఆరోపించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, వివేకానంద గౌడ్ వంటి నాయకులు అద్దెకు వచ్చిన నాయకులని విమర్శించారు.

1న ఛలో ఢిల్లీ ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు కదం తొక్కాలి

- ఎల్‌నినో తీవ్ర ప్రభావంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- బీఆర్ఎస్ నేతల అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలి
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వెలుతురు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చుంచుపల్లి అక్టోబర్ 25: నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నిరసన కార్య క్రమానికి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా పోరాటం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తలెత్తే పరిస్థితులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచిం చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండ లం విద్యానగర్‌లో డీసీసీ అధ్యక్షురాలు దేవిప్రసన్న అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావం--సన్నద్ధత, ఓట్ బచావో, దేశ్ బచావో కార్యక్రమం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు అప్రమత్తత అవసరం

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, వ్యవసాయం పండుగలా వర్ధిల్లుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉందని మంత్రి పేర్కొన్నారు. అయితే ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే ఏప్రిల్, మే నెలల్లో తీవ్ర వాతావరణ పరిస్థితులు, నీటి ఎద్దడి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు నీటి వినియోగంలో పొదుపు పాటించడంతోపాటు విద్యుత్ వినియోగం విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలి

బీఆర్ఎస్ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను కాంగ్రెస్ శ్రేణులు ఎప్పటికప్పుడు వాస్తవాలతో తిప్పికొట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. వారు పదేపదే చెప్పే అబద్ధాలే నిజమనే భావన ప్రజల్లో ఏర్పడకుండా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకోవాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటరు నమోదు ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి కోరారు. 2023 సెప్టెంబర్ నాటికి పట్టభద్రులైన అర్హులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా చూడాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని, ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా, శక్తివం చన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కు పరిరక్షణ కోసం ఛలో ఢిల్లీ

రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రక్రియ పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను అడ్డం పెట్టుకొని ఓట్ల తొలగింపునకు పాల్పడుతోందని విమర్శించారు. దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లు తొలగించబడ్డాయన్న అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ 'ఓట్ బచావో -- దేశ్ బచావో' నినాదంతో ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తోందన్నారు. దేశ పౌరుల ఓటు హక్కులను కాపాడేందుకు నవం బర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన కార్యక్ర మానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కదంతొక్కి కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, ఏఐసీసీ, టీపీసీసీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి కరపత్రాలను ఆవిష్కరించారు.

ఓఆర్ఆర్‌పై త్వరలో ఏఐ నిఘా కెమెరాలు

- ట్రాఫిక్, వ్యర్థాల నియంత్రణే లక్ష్యంగా ఏర్పాట్లు
- గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఈ ఏఐ కెమెరాల ప్రణాళిక

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25: హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్), సర్వీసు రోడ్ల వెంట తరచూ చెత్తను పారేస్తూ ఉంటారు. దీనిని అరికట్టేందుకు హెచ్ఎండీఏ ఆధ్వర్యంలోని గ్రోత్ కారిడార్ లిమిటెడ్ ఒక ప్రణాళికను రూపొందించింది. నిర్మాణ వ్యర్థాలు, చెత్త వేయకుండా కట్టడి చేసేందుకు ఏఐ - ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా అక్రమంగా వ్యర్థాలను పారబోసే వాహనాలను ఆటోమేటిక్గా గుర్తించి, వాటి లైసెన్స్ ప్లేట్ నంబర్లను నమోదు చేస్తుంది. అలా చెత్త వేసిన వారికి భారీ జరిమానాలు విధించనున్నారు.

అండర్పాస్లే లక్ష్యంగా

అంతేకాకుండా ఓ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తుంది. దీనిద్వారా వ్యర్థాలను వేస్తున్న వాహనాలపై తక్షణ చర్యలు తీసుకొనే వీలుంటుంది. ప్రస్తుతం అండర్పాస్‌ల సమీపంలో జనసంచారం తక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాలలో రాత్రిపూట లారీలు, ట్రక్కులతో వచ్చి తరచూ వ్యర్థాలను పారేస్తున్నారు. గచ్చిబౌలి - నానక్‌రామ్‌గూడ, పెద్దఅంబర్‌పేట్ - బాటసింగారం, పటాన్‌చెరు - శంకర్‌పల్లి, అలాగే మేడ్చల్ - షమీర్‌పేట్ మార్గాలలో ఈ సమస్య అధికంగా ఉంది.

మల్టీ-వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్

ఔటర్ రింగ్ రోడ్డుపై ట్రాఫిక్‌ను నిర్వహించడానికి సైబరాబాద్ పోలీసులు, హెచ్ఎండీఏ సహకారంతో ఏఐ ఆధారిత 'మల్టీ - వయోలేషన్ డిటెక్షన్ సిస్టమ్'ను ప్రవేశపెడుతున్నారు. తరచుగా ప్రమాదాలు, ట్రాఫిక్ ఉల్లంఘనలు జరిగే 14 ప్రాంతాలను కవర్ చేస్తూ, శంషాబాద్ నుంచి మేడ్చల్ వరకు 70 కిలోమీటర్ల మేర ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఉల్లంఘనలను గుర్తించి, పరిష్కరించగల సామర్థ్యం ఈ కెమెరాల ముఖ్య లక్షణం. రియల్ టైంలో ఈ-చలాన్లను జారీ చేయడాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడుతుంది.

నాలుగు కెమెరాలు ఏర్పాటు

ప్రస్తుతం ఈ వ్యవస్థను బంజారా హిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు సైబరాబాద్ కమిషనరేట్‌తో అనుసంధానించారు. ఓ ప్రదేశంలో రోడ్డుకు ఇరువైపులా నాలుగు కెమెరాలను ఏర్పాటు చేస్తారు. ప్రతి కెమెరా 16 రకాల సంఘటనలు లేదా ఉల్లంఘనలను గుర్తించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. అక్రమ వ్యర్థాల డంపింగ్ ఎక్కువగా జరిగే ప్రాంతాలలో, సర్వీస్ రోడ్ల వెంట అలాగే ఇతర వ్యూహాత్మక ప్రదేశాలలో ఇలాంటి కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

ప్రపంచం చూస్తున్న

కొత్త భారతం కెవిన్ పీటర్సన్

నేను తొలిసారి 2003లో భారత్‌కు వచ్చాను. అప్పటికి నరేంద్ర మోదీ గురించి నాకు పెద్దగా తెలియదు. అయితే, అప్పటికే ఆయన రెండేళ్లుగా గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఇప్పుడు ఆయన ప్రభుత్వాధినేతగా 25 ఏళ్లు పూర్తి చేసుకున్నారని తెలిసినప్పుడు ఆ విషయం గుర్తుకొచ్చింది. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలోనైనా ఇంత సుదీర్ఘకాలం కొనసాగడం అసాధారణం. క్రికెట్ పరిభాషలో చెప్పాలంటే, ఇది ఒక పూర్తి కెరీర్‌కు మించిన ప్రయాణం. నేను పుట్టి పెరిగిన బ్రిటన్‌లో, 2014లో మోదీ భారత ప్రధానమంత్రి అయినప్పటి నుంచి ఆరుగురు ప్రధానమంత్రులు మారిపోయారు. కాబట్టి, చైతన్యవంతమైన ప్రజాస్వామ్య దేశంలో ఇంతకాలం ఒకే నాయకుడు కొనసాగడం అసాధారణమైన విషయం. నా వయోజన జీవితంలో చాలా భాగం భారత్‌కు రాకపోకలతోనే గడిచింది. ఇక్కడ క్రికెట్ ఆడాను, దేశమంతా పర్యటించాను, అసాధారణ ప్రతిభావంతులైన ఎంతోమందిని కలిశాను, ప్రకృతి ఒడిలోని అటవీ ప్రాంతాల్లో సమయం గడిపాను, ఇక్కడ ఎంతోమంది స్నేహితులను సంపాదించుకున్నాను. ఈ దేశానికి చెందినవాడిని కాకపోయినా, భారత్‌లో వచ్చిన మార్పులను దగ్గరగా గమనించాను. నేడు నన్ను అన్నింటికంటే ఎక్కువగా ఆకట్టుకుంటున్నది ఏదైనా ఒక రహదారి, భవనం లేదా విధానం కాదు. దేశమంతటా స్పష్టంగా కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం.

అది అతిశయంతో కూడిన గర్వం కాదు. తమ భవిష్యత్తును తామే తీర్చిదిద్దుకోగలమన్న సంతోషకరమైన నమ్మకం. నేను తొలిసారి భారత్‌కు వచ్చినప్పుడు, ఇది అపారమైన ప్రతిభ కలిగిన భారీ దేశమని నాకు తెలుసు. అయితే, తమలోని సామర్థ్యాన్ని పూర్తిగా గుర్తించలేకపోతున్నారేమో అనిపించే ఒక రకమైన సంకోచం కూడా కనిపించేది. ఇప్పుడు పరిస్థితి మారింది. భారతీయులు 'మనం ఇది సాధించగలం' అని మరింత ధైర్యంగా చెబుతున్నారు. పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నారు. పోటీలో మరింత గట్టిగా నిలుస్తున్నారు. అహంకారం లేకుండానే తమ సత్తా చాటుతున్నారు. తమ నుంచి, తమ దేశం నుంచి మరింత ఎక్కువగా ఆశిస్తున్నారు. క్రీడారంగంలో ఈ మార్పును నేను స్పష్టంగా చూశాను. భారత క్రికెట్‌నే ఉదాహరణగా తీసుకుందాం. నేను తొలిసారి భారత్‌కు వచ్చినప్పుడు అద్భుతమైన ఆటగాళ్లు, క్రికెట్‌పై అపారమైన అభిమానం ఉండేవి. అయితే, భారత్ సాధించిన విజయాల్లో అత్యంత ప్రతిభావంతులైన కొద్దిమంది దిగ్గజాల పాత్ర చాలా కీలకంగా ఉండేది. ఇప్పుడు భారత జట్లలో ప్రతిభావంతులైన ఆటగాళ్ల సంఖ్య, ప్రత్యామ్నాయాల బలం అసాధారణంగా పెరిగాయి. ప్రధాన జట్టులో చోటు దక్కని ఆటగాళ్లతో కూడిన మరో జట్టు కూడా ప్రపంచంలోని అత్యుత్తమ జట్లను ఓడించగలదు. యువ ఆటగాళ్లు అత్యున్నత స్థాయిలో ఆడేందుకు తమకు పూర్తి అర్హత ఉందన్న నమ్మకంతో వస్తున్నారు. శారీరక దారుఢ్యం, సన్నద్ధత, వృత్తిపరమైన నిబద్ధత విషయంలో ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయి. పురుషుల జట్టు ఎప్పుడూ ప్రత్యర్థులకు గట్టి సవాలుగా నిలిచింది. అయితే, భారత మహిళా క్రికెట్ ఇంతగా అభివృద్ధి చెందడం ప్రత్యేకంగా సంతోషాన్నిస్తోంది. గత ఏడాది మహిళల ప్రపంచకప్‌లో భారత్ సాధించిన విజయం ఈ ఎదుగుదలకు మరో నిదర్శనం. క్రికెట్ ప్రపంచంలో భారత్ ఒక అగ్రశక్తి. అలాంటి దేశంలో మహిళా క్రికెట్ అభివృద్ధి చెంది విజయాలు సాధిస్తే, ఆ ప్రభావం భారత్‌కే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెట్‌కు మరింత గుర్తింపు లభిస్తుంది. అథ్లెటిక్స్, షూటింగ్, రెజ్లింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, హాకీ, టెన్నిస్ వంటి క్రీడల్లో భారత అథ్లెట్లు ప్రపంచవ్యాప్తంగా తమ సత్తా చాటుతుండటాన్ని కూడా నేను గమనిస్తున్నాను. గతంలో పెద్దగా పరిచయం లేని క్రీడల్లోనూ భారతీయులు పతకాలు సాధిస్తున్నారు, ఫైనల్స్‌కు చేరుతున్నారు. వివిధ క్రీడల్లో ఇటీవల భారత్ ప్రదర్శించిన ప్రతిభ, దేశంలో క్రీడారంగం ఎంత విస్తృతంగా అభివృద్ధి చెందిందో తెలియజేస్తోంది. ఇవన్నీ యాదృచ్ఛికంగా జరిగేవి కావు. మెరుగైన సౌకర్యాలు, పటిష్ఠమైన వ్యవస్థలు, అత్యున్నత స్థాయిలో పోటీపడగలమనే నమ్మకాన్ని యువతలో పెంపొందించే వాతావరణం అవసరం. భారత్‌లో క్రీడా సంస్కృతి స్పష్టంగా రూపుదిద్దుకుంటోంది. క్రీడలపై మోదీకి ఉన్న వ్యక్తిగత ఆసక్తి కూడా ఈ పురోగతికి ఊతమిచ్చిందనడంలో సందేహం లేదు. ఈ మార్పుల ప్రభావం క్రీడల్లోనే కాదు, సాధారణ జీవితంలోనూ



కనిపిస్తోంది. ఫిట్ ఇండియా అంటూ మోదీ ఇచ్చిన పిలుపు దేశవ్యాప్తంగా స్పష్టమైన మార్పుకు ప్రోత్సాహాన్నిచ్చింది. ప్రజల్లో అవగాహన పెరగడానికి దోహదపడింది. నేటి యువ భారతీయులు మారథాన్‌లలో పాల్గొంటున్నారు, కొత్త తరహా వ్యాయామాలను అలవాటు చేసుకుంటున్నారు. ఒక తరం క్రితం అసాధారణంగా అనిపించే సవాళ్లను ఇప్పుడు స్వీకరిస్తున్నారు. మోదీ స్వయంగా యోగా సాధన చేస్తారని తెలిసినప్పుడు కూడా నేను ఎంతో ఆసక్తికి లోనయ్యాను. ఆయనను కలిశాను, ఆయనలోని ఉత్సాహాన్ని చూశాను. అయితే, యోగా కూడా ఆయన దినచర్యలో భాగమని తెలుసుకున్నప్పుడు నాకు చిరునవ్వొచ్చింది. ఇది భారతీయ సంప్రదాయానికి ప్రతీకే అయినా, ఆధునిక జీవనశైలికి కూడా చక్కగా సరిపో తుంది. యోగా ప్రపంచవ్యాప్తంగా ఇంతగా ప్రాచుర్యం పొందడంలో ఆశ్చర్యమే ముంది? 2014లో ఐక్యరాజ్యసమితిలో మోదీ తొలిసారిగా ప్రతిపాదించిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నేడు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. భారత్ మానసికంగా మాత్రమే కాదు, భౌతికంగానూ మారిపోయింది. దేశంలో పర్యటించిన ప్రతి సారీ ఈ మార్పు నాకు కనిపిస్తుంది. విమానాశ్రయాలు మారాయి. రహదారులు, మెట్రో రైలు వ్యవస్థలు మారాయి. హోటళ్లు, అక్కడి ప్రమాణాలు కూడా ఎంతో మెరుగయ్యా యి. గతంలో స్వదేశంలోని స్నేహితులు భారత్‌లోని వేడి వాతావరణం, జనసమ్మర్థం, ఆహారం గురించి అడిగేవారు. ఇప్పుడు వారు భారత్ ఎగుమతి చేసిన కొవిడ్–19 టీకాలు, భారతీయ స్టార్టప్‌లు, చంద్రుడిపై దిగిన ఘనత, ముఖ్యంగా డిజిటల్ చెల్లింపుల గురించి మాట్లాడుతున్నారు. ఇక్కడ ప్రజలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్న తీరు అద్భుతం. వీధుల్లో బండ్లపై వస్తువులు విక్రయించే వ్యాపారులు సైతం క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు రహిత చెల్లింపులు స్వీకరిస్తున్నారు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి పరిణా మాలు భవిష్యత్తులో సాధ్యమయ్యే విషయాలుగా అనిపించవచ్చు. కానీ, భారత్‌లో ఇవి ఇప్పటికే నిత్యజీవితంలో భాగమ య్యాయి. భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవడంలోనూ భారత్ ఇప్పుడు ఎంతో ధీమాగా ఉంది. ముఖ్యంగా గుజరాత్ గురించి చెప్పుకోవాలి. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం, అత్యంత ఎత్తైన విగ్రహం ఆ రాష్ట్రంలోనే ఉన్నాయి. ఇంత భారీ నిర్మాణాలు చేపట్టాలంటే చిన్నగా ఆలోచిస్తే సరిపోదు. మోదీ రాజకీయాల గురించి ఎవరి అభిప్రాయాలు వారికి ఉండవచ్చు. అయితే, భారీ స్థాయిలో ఆలోచించడం, అవకాశాలను అందిపుచ్చుకోవడం ఆయనలో సహజంగా కనిపించే లక్షణాలు. ప్రపంచంలో తన స్థానాన్ని గురించి భారత్ మాట్లాడుతున్న తీరులోనూ ఇదే లక్షణం కనిపిస్తోంది. నాయకత్వం వహించాలని, పోటీపడాలని, నిర్మించాలని, నూతన ఆవిష్కరణలు చేయాలని, ప్రపంచ వేదికపై తన గొంతును బలంగా వినిపించాలని భారత్ కోరుకుంటోంది.

ప్రకృతి అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం...

నేను కజిరంగాలో సమయం గడిపాను. ఖడ్గమృగాల సంరక్షణపై నాకు ఎంతో ఆసక్తి ఉంది. భారత వన్యప్రాణులను రక్షించేందుకు జరుగుతున్న కృషిని స్వయంగా చూశాను. అది నన్ను ఎంతో ఆకట్టుకుంది. ఖడ్గమృగాలు, పులుల సంరక్షణలో భారత్ కీలక పురోగతి సాధించింది. ఆ తర్వాత చిరుతలను తిరిగి భారత్‌కు తీసుకొచ్చే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రాజెక్టు దేశవ్యాప్తంగా ప్రజల్లో ఆసక్తిని రేకెత్తించింది. గుజరాత్‌లో అరుదుగా కనిపించే ఆసియా సింహాల సంరక్షణకు జరుగుతున్న ప్రయత్నాల గురించి కూడా తెలుసుకున్నాను. మోదీని కలిసినప్పుడు వన్యప్రాణులపై ఆయనకున్న ఆసక్తి స్పష్టంగా కనిపించింది. చిరుతలను భారత్‌కు తీసుకొచ్చి విడుదల చేయడం గురించి మేమిద్దరం ఎంతో ఉత్సాహంగా మాట్లాడుకున్నాం. ఆ కార్యక్రమం పట్ల ఆయన ఎంత ఆనందంగా ఉన్నారో నేను గమనించాను. పెద్ద పిల్లి జాతి జంతువుల సంరక్షణ కోసం అంతర్జాతీయ బిగ్ క్యాట్ అలయన్స్ ఏర్పాటులోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఈ జంతువుల సంరక్షణ కోసం వివిధ దేశాలను ఒకే వేదికపైకి తీసుకురావడంలో భారత్ నాయకత్వం వహిస్తోంది. నేటి భారత్‌లో నన్ను విశేషంగా ఆకట్టుకునే అంశం ఇదే. వేగంగా ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధిని సాధించేందుకు కృషి చేస్తున్న అదే దేశం, జంతువులను రక్షించడానికి, తన సహజ వారసత్వాన్ని కాపాడుకోవడానికి కూడా ఎంతో ప్రాధాన్యమిస్తోంది. 2022లో మోదీ నుంచి ఒక అద్భుతమైన లేఖ అందుకున్న తర్వాత, నేను ఒక పోస్టు రాశాను. 2003లో తొలిసారి భారత్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రతి పర్యటనతో ఈ దేశంపై నా ప్రేమ మరింత పెరుగుతోందని అందులో పేర్కొన్నాను. భారత్‌లో మీకు అన్నింటికంటే ఎక్కువగా నచ్చేది ఏమిటని ఎవరైనా అడిగితే, నా సమాధానం సులభం: ప్రజలు అని కూడా చెప్పాను. ఇప్పటికీ నేను మళ్లీ మళ్లీ భారత్‌కు రావడానికి ప్రధాన కారణం ఇక్కడి ప్రజలే. భారతీయుల్లో నాకు అత్యంత నచ్చే అంశాల్లో ఒకటి, ఆధునికంగా మారడం అంటే తమ భారతీయతను కోల్పోవడం కాదని వారు నిరూపించడం. ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవస్థల పక్కనే పురాతన దేవాలయాలు, సంప్రదాయాలు సజావుగా కొనసాగడాన్ని నేను చూస్తున్నాను. యువ భారతీయులు భవిష్యత్తు వైపు అడుగులు వేస్తూనే కుటుంబం, విశ్వాసం, పండుగలు, ప్రకృతితో తమ అనుబంధాన్ని బలంగా కొనసాగిస్తున్నారు. సంప్రదాయం, ఆధునికత రెండింటినీ సమన్వయం చేయాలన్న మోదీ దృక్పథం కూడా ఇందుకు కొంతవరకు దోహదపడి ఉంటుందనడంలో సందేహం లేదు. 25 ఏళ్లు పూర్తి చేసుకోవడం అసాధారణమైన మైలురాయి. ఈ ప్రయాణం సందర్భంగా మోదీకి నా అభినందనలు తెలియజేస్తున్నాను. ఆయనకు మంచి ఆరోగ్యం, మరిన్ని సంవత్సరాల పాటు ప్రజాసేవ చేసే అవకాశం లభించాలని ఆకాంక్షిస్తున్నాను. అలాగే, భారత్ మరింత ఉజ్వలమైన అధ్యాయంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఆ దేశానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. నేను యువ క్రికెటర్‌గా తొలిసారి భారత్‌కు వచ్చాను. రెండు దశాబ్దాలకు పైగా గడిచినా, ప్రతిసారీ తిరిగి వచ్చినప్పుడు ఏదో ఒక కొత్త విషయాన్ని తెలుసుకుంటూనే ఉన్నాను. నేడు నేను చూస్తున్న భారత్‌కు తాను ఎక్కడికి వెళ్లాలనుకుంటుందో స్పష్టంగా తెలుసు. ఆ లక్ష్యాన్ని చేరుకోగలమన్న నమ్మకం కూడా ఉంది. ఈ ప్రయాణాన్ని ప్రత్యక్షంగా చూడటం ఎంతో అద్భుతమైన అనుభూతి కానుంది.

-రచయిత
ఇంగ్లండ్ మాజీ క్రికెట్ జట్టు కెప్టెన్

పెన్షన్ అనుభవిస్తూ..

బక్కజీవుల భరోసాపై ఉపన్యాసాలా?

ప్రజల కష్టాలను అర్థం చేసుకోవడం వేరు.. ఆ కష్టాలకు మూలమైన వ్యవస్థను ప్రశ్నించడం వేరు. పేదల జీవితాలపై ఉపన్యాసాలు ఇవ్వడం వేరు.. పేదలను పేదలుగా మార్చుతున్న దోపిడీ వ్యవస్థపై పోరాడటం వేరు. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను గుర్తించలేని మేధావితనం సమాజానికి ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవడానికి లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ ఆర్థిక విశ్లేషణలను పరిశీలిస్తే సరిపోతుంది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెన్షన్లు, పాత పెన్షన్ విధానం వంటి అంశాలపై ఆయన చేస్తున్న వాదనలు పైకి ఆర్థిక క్రమశిక్షణ గురించి మాట్లాడుతున్నట్లుగా కనిపించినా, వాటి వెనుక శ్రమజీవుల సామాజిక భద్రతను ప్రశ్నించే, ఉద్యోగుల హక్కులను ప్రజలకు భారంగా చిత్రీకరించే ప్రమాదకరమైన ఆలోచనా ధోరణి కనిపిస్తోంది. ఈ వాదనలను ప్రచురించే పత్రికా వేదికలు కూడా వాటిని విమర్శనాత్మకంగా పరిశీలించకుండా ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేలా ముందుకు తెస్తే, అసలు చర్చ జరగాల్సిన అంశం మరుగునపడిపోతుంది. ముఖ్యంగా పెట్టుబడిదారీ ప్రయోజనాలకు అనుకూలంగా ఉండే ఆర్థిక విధానాలను ప్రజాహిత సంస్కరణలుగా చిత్రీకరించే ప్రయత్నాలను ప్రశ్నించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ ఎందుకు ఇవ్వాలి? ఆటో డ్రైవర్లకు ఎందుకు ఇవ్వకూడదు? రోజువారీ కూలీలకు లేని సౌకర్యాలు ఉద్యోగులకు మాత్రమే ఎందుకు ఉండాలి? అనే ప్రశ్నలు వినడానికి చాలా సహేతుకంగా అనిపించవచ్చు. కానీ ఈ ప్రశ్నల వెనుక ఉన్న అసలు ఉద్దేశాన్ని పరిశీలించాలి. ఆటో డ్రైవర్‌కు సామాజిక భద్రత లేదని ప్రభుత్వ ఉద్యోగికి ఉన్న భద్రతను తొలగించాలా? వ్యవసాయ కూలీకి పెన్షన్ లేదని ఉపాధ్యాయుడి పెన్షన్‌ను రద్దు చేయాలా? అసంఘటిత రంగ కార్మికుడికి కనీస వేతనం అందడం లేదని సంఘటిత రంగ ఉద్యోగి వేతనాన్ని కూడా తగ్గించాలా? ఇదేనా సమానత్వం? ఇదేనా సామాజిక న్యాయం? ఒక వర్గానికి హక్కులు లేకపోవడం మరో వర్గానికి ఉన్న హక్కులను లాక్కోవడానికి ఎలా న్యాయంగా మారుతుంది? నిజమైన ప్రజాస్వామ్య దృక్పథం ఉన్నవారు ఒకరికి ఉన్న హక్కును మరొకరికి నిరాకరించరు. అందరికీ ఆ హక్కు అందేలా వ్యవస్థను మార్చాలని పోరాడతారు. దళితులు, బహుజనులు, బీసీలు, కార్మికులు, రైతులు, అసంఘటిత రంగ శ్రమజీవులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఏమిటి? వారి శ్రమకు తగిన ప్రతిఫలం దక్కకపోవడం, కనీస వేతనాలు అమలు కాకపోవడం, ఉద్యోగ భద్రత లేకపోవడం, అనారోగ్యం వచ్చినా ఆదాయం నిలిచిపోవడం, వృద్ధాప్యంలో కుటుంబంపై ఆధారపడాల్సి రావడం. ఈ సమస్యలకు పరిష్కారం చూపాల్సిన మేధావులు, పాలకులు, విధాన నిర్ణేతలు.. ఉన్న కొద్దిపాటి భద్రతను కూడా తొలగించాలనే వాదనలకు దిగితే దాని వల్ల ప్రయోజనం ఎవరికి? ఇప్పటికే అసంఘటిత రంగ కార్మికులు కనీస హక్కుల కోసం పోరాడుతుంటే, సంఘటిత రంగ ఉద్యోగుల హక్కులను కూడా వివాదాస్పదం చేయడం వల్ల కార్మికులందరి బేరసారాల శక్తి బలహీనపడుతుంది. ఒక వర్గాన్ని మరొక వర్గానికి శత్రువుగా చూపించడం ద్వారా అసలు సమస్యను పక్కదారి పట్టించవచ్చు. కానీ పేదరికానికి మూలమైన ఆర్థిక అసమానతలు మాత్రం తొలగిపోవు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆకాశం నుంచి ఊడిపడిన ప్రత్యేక హక్కుల వర్గం కాదు. వారిలో అత్యధికులు తమ జీవితంలో మూడు, నాలుగు దశాబ్దాలను ప్రభుత్వ సేవకు అంకితం చేస్తారు. ఉపాధ్యాయుడు పల్లెల్లో పిల్లలకు విద్య అందిస్తాడు. వైద్య సిబ్బంది ప్రజల ప్రాణాలను కాపాడేందుకు పనిచేస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తారు. వివిధ శాఖల సిబ్బంది ప్రభుత్వ వ్యవస్థ నడవడానికి తమ శ్రమను ధారపోస్తారు. వారి సేవలకు ప్రతిఫలంగా వేతనం పొందడం, పదవీ విరమణ తర్వాత గౌరవప్రదంగా జీవించేందుకు సామాజిక భద్రత కోరడం నేరమా? ఉద్యోగంలో ఉన్నప్పుడు వేతనం చెల్లించిన ప్రభుత్వం, ఉద్యోగి పదవీ విరమణ తర్వాత తన బాధ్యతను పూర్తిగా విస్మరించవచ్చా? ఉద్యోగి వృద్ధాప్యంలో ఆర్థిక అభద్రతతో బతకాల్సిందేనని చెప్పడమే ఆర్థిక క్రమశిక్షణ అయితే, ఆ క్రమశిక్షణలో మానవత్వానికి చోటెక్కడుంది? ఇక్కడే పాత పెన్షన్ విధానం, కొత్త పెన్షన్ విధానం గురించి సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది. పాత పెన్షన్ విధానం ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం నిర్దిష్ట నిబంధనల ప్రకారం పెన్షన్ భద్రతను కల్పిస్తుంది. కొత్త పెన్షన్ విధానంలో ఉద్యోగి పదవీ విరమణ ప్రయోజనాలు విరాళాలు, పెట్టుబడుల రాబడులు వంటి అంశాలతో ముడిపడి ఉంటాయి. ఈ రెండు విధానాలకు సంబంధించిన ఆర్థిక భారం, దీర్ఘకాలిక స్థిరత్వం, ఉద్యోగుల ప్రయోజనాలు, ప్రభుత్వ బాధ్యతలు వంటి అంశాలను ఆధారాలతో చర్చించవచ్చు. ప్రభుత్వాలు తమ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తగిన విధానాలను రూపొందించవచ్చు. కానీ ఆర్థిక స్థిరత్వం పేరుతో ఉద్యోగుల ఆందోళనలను కొట్టిపారేయడం, వారి భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టడం పరిష్కారం కాదు. పెన్షన్ విధానంలో మార్పులు అవసరమని ఎవరైనా భావిస్తే, ప్రత్యామ్నాయంగా ఉద్యోగులకు ఏ విధమైన హామీ ఇస్తారు? ద్రవ్యోల్బణం పెరుగుతున్నప్పుడు వారి ఆదాయం ఎలా కాపాడబడుతుంది? వృద్ధాప్యంలో వైద్య ఖర్చులను ఎవరు భరిస్తారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పకుండా పెన్షన్ భారమంటూ ఉపన్యాసాలు ఇవ్వడం సులభమే. అయితే అసలు ప్రశ్న ఉద్యోగుల పెన్షన్ల దగ్గరే ఎందుకు ఆగిపోవాలి? దేశ సంపదలో సింహభాగం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతున్నప్పుడు, భారీ కార్పొరేట్ సంస్థలకు పన్ను రాయితీలు కల్పిస్తున్నప్పుడు, బ్యాంకుల మొండి బకాయిల పరిష్కారంలో పెద్ద మొత్తాలను రద్దులు లేదా మాఫీల రూపంలో పరిగణిస్తున్నప్పుడు, ప్రభుత్వాల ఆదాయ విధానాలు ఎవరికి అనుకూలంగా పనిచేస్తున్నాయో ఎందుకు ప్రశ్నించకూడదు? ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా గుర్తించాలి. బ్యాంకు రుణాల రద్దు, రుణాల మాఫీ, పన్ను రాయితీలు అన్నీ ఒకటే కావు, వాటి స్వభావం, లబ్ధిదారులు, ఆర్థిక ప్రభావం వేర్వేరుగా ఉంటాయి. అయినప్పటికీ ప్రజాధనంపై ప్రభావం చూపే ప్రతి నిర్ణయాన్నీ పారదర్శకంగా పరిశీలించాల్సిందే. బడా సంస్థలకు కల్పించే రాయితీలను సమర్థించే వారు, శ్రమజీవుల పెన్షన్ విషయంలో మాత్రం ఖజానాపై భారం అంటూ ఆందోళన వ్యక్తం చేస్తే, వారి ఆర్థిక ప్రమాణాల్లో ఏకరూపత ఉందా లేదా అన్నది ప్రజలు ప్రశ్నించే హక్కు కలిగి ఉన్నారు.

ప్రజాప్రతినిధుల వేతనాలు, భత్యాలు, పదవీ విరమణ ప్రయోజనాలు, ప్రభుత్వ ఖర్చులతో కల్పించే సౌకర్యాలు కూడా ఇదే ప్రమాణంతో పరిశీలించబడాలి. ప్రజాసేవ పేరుతో రాజకీయాల్లోకి వచ్చినవారు ప్రజాధనంతో పొందుతున్న ప్రయోజనాలకు ఎంత పారదర్శకత ఉంది? ప్రభుత్వ ఖర్చులపై ఎంత సామాజిక తనిఖీ జరుగుతోంది? ప్రజలపై పన్నుల భారం పెంచే నిర్ణయాలు తీసుకునే పాలకులు తమకు తాము కల్పించుకునే సౌకర్యాల విషయంలో ఎంత సంయమనం పాటిస్తున్నారు? ఉద్యోగుల పెన్షన్లపై లెక్కలు చూపించే ఆర్థిక విశ్లేషకులు ఈ ప్రశ్నలపైనా అంతే నిష్పక్షపాతంగా మాట్లాడాలి. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగి వృద్ధాప్య భద్రతను ఖజానాకు గుదిబండగా అభివర్ణిస్తూ, మరోవైపు అధికార వ్యవస్థలోని అనవసర వ్యయాలపై మౌనం వహిస్తే, ఆ మౌనం కూడా ఒక రాజకీయ వైఖరిగానే పరిగణించబడుతుంది.

పేదవాడు కొనే నిత్యావసర వస్తువులపై పన్నుల భారం, పెట్రోల్––డీజిల్ ధరల ప్రభావం, విద్యా వైద్య రంగాల్లో పెరుగుతున్న ప్రైవేటీకరణ, నిరుద్యోగం, తగిన వేతనాలు లేని ఉపాధి, వ్యవసాయ సంక్షోభం.. ఇవన్నీ కోట్లాది కుటుంబాల జీవన ప్రమాణాలను నిర్ణయించే అంశాలు. వీటిపై సమగ్ర చర్చ జరగకుండా, సమాజంలోని పరిమిత వనరుల కోసం పేదలను ఉద్యోగులతో, కార్మికులను మధ్యతరగతితో, ఒక వర్గాన్ని మరో వర్గంతో పోటీకి దించడం వల్ల ఎవరికి లాభం? ప్రజల మధ్య అసంతృప్తి పెరుగుతుంది. కానీ ఆర్థిక అసమానతలను సృష్టిస్తున్న నిర్మాణాత్మక కారణాలు మాత్రం చర్చకు రావు. అదే సమయంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించకుండా, వ్యక్తిగత పొదుపు, ఆర్థిక క్రమశిక్షణ, ప్రభుత్వ వ్యయ నియంత్రణ వంటి పదాలతో సమస్త సమస్యలకు పరిష్కారం చూపించగలమనే భ్రమను కల్పిస్తారు. ప్రభుత్వ వ్యయ నియంత్రణ అవసరమే. అయితే అది ఎవరి ప్రయోజనాలను కాపాడుతూ, ఎవరి హక్కులను కత్తిరిస్తూ అమలవుతోందన్నదే అసలు గీటురాయి. దళితులు, బీసీలు, ఇతర వెనుకబడిన వర్గాలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా ఈ వ్యవస్థలో భాగమే. వారి సామాజిక ఎదుగుదలకు విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, రిజర్వేషన్లు, వేతన భద్రత, పదవీ విరమణ ప్రయోజనాలు కీలక పాత్ర పోషించాయి. చారిత్రకంగా అవకాశాలు నిరాకరించబడిన వర్గాలకు ప్రభుత్వ వ్యవస్థలో లభించే స్థిరమైన ఉపాధి కేవలం వ్యక్తిగత ఆదాయానికి సంబంధించిన అంశం కాదు, అది కుటుంబాల విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన, సామాజిక గౌరవంతో ముడిపడి ఉంటుంది. అందుకే ఉద్యోగుల హక్కులపై జరిగే చర్చలో సామాజిక న్యాయం అనే కోణాన్ని విస్మరించలేం. అయితే సంఘటిత రంగ ఉద్యోగుల భద్రతను కాపాడటమే లక్ష్యమైతే సరిపోదు. అసంఘటిత రంగంలోని దళితులు, బీసీలు, మహిళలు, వలస కార్మికులు, రోజువారీ కూలీలకు కూడా కనీస వేతనాలు, ఆరోగ్య రక్షణ, వృద్ధాప్య పెన్షన్, ప్రమాద బీమా, ఉద్యోగ భద్రత అందేలా పోరాడాలి. ఒకరి హక్కును మరొకరికి నిరాకరించడం కాదు, అందరి హక్కులను విస్తరించడమే నిజమైన సమానత్వం.

ఇక్కడ జయప్రకాశ్ నారాయణ వ్యక్తిగత పెన్షన్ ప్రయోజనాల గురించి కూడా ఒక ప్రశ్న ప్రజా చర్చలో ప్రస్తావనకు వస్తోంది. ఆయన రెండు పెన్షన్లు పొందుతున్నారనే ఆరోపణ నిజమైతే, వాటి చట్టబద్ధత, అర్హత, సంబంధిత నిబంధనలు, ఆదాయ వివరాలు వంటి అంశాలు ఆధారాలతో పరిశీలించబడాలి. కేవలం ఆరోపణను వాస్తవంగా ప్రకటించడం సరైన పద్ధతి కాదు. అదే సమయంలో, ఒక ప్రజా వ్యక్తి ఉద్యోగుల పెన్షన్ హక్కులపై నైతిక ఉపన్యాసాలు ఇస్తున్నప్పుడు, ఆయన స్వయంగా పొందుతున్న ప్రయోజనాలపై ప్రశ్నలు తలెత్తితే వాటికి పారదర్శకంగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంటుంది. తనకు వర్తించే నిబంధనలను సమర్థించుకుంటూ, ఇతరుల పెన్షన్ హక్కులను మాత్రం ఆర్థిక భారంగా చిత్రీకరిస్తే, ఆ వాదనలో నైతిక ఏకరూపత ఉందా లేదా అన్నది ప్రజలు అడగడం సహజం. ప్రజాజీవితంలో ఉన్నవారికి ప్రశ్నలు ఎదురవడం తప్పు కాదు, ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం చెప్పకుండా విమర్శకులను పక్కన పెట్టడమే సమస్య.

జయప్రకాశ్ నారాయణ ఒకప్పుడు పరిపాలనా వ్యవస్థలో పనిచేసిన వ్యక్తిగా, ప్రజా విధానాలపై విశ్లేషణ చేసే వ్యక్తిగా తన అభిప్రాయాలను వెల్లడించే హక్కు కలిగి ఉన్నారు. ఆయన వాదనలను విమర్శించే హక్కు కూడా ప్రజలకు ఉంది. వ్యక్తులపై వ్యక్తిగత దూషణలు చేయడం కంటే, వారి వాదనల్లోని వైరుధ్యాలను, ఆర్థిక లెక్కల్లోని లోపాలను, సామాజిక ప్రభావాలను ఆధారాలతో ప్రశ్నించడం మరింత అవసరం. అదే విధంగా, ఆ అభిప్రాయాలను ప్రచురించే పత్రికలు కూడా ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన విభిన్న కోణాలను వెలుగులోకి తీసుకురావాలి. పత్రికా స్వేచ్ఛ అంటే ఒక వాదనను ప్రచురించే హక్కు మాత్రమే కాదు, ప్రజలకు పూర్తి సమాచారం అందేలా ప్రశ్నలకు, ప్రతివాదాలకు, ఆధారాలకు స్థానం కల్పించే బాధ్యత కూడా. రాధాకృష్ణ సంపాదకీయ వేదికలో ఇలాంటి ఆర్థిక వాదనలు ప్రచురితమైనప్పుడు, వాటి సామాజిక పరిణామాలపై విమర్శనాత్మక చర్చకు కూడా సమాన ప్రాధాన్యం లభించాలి.

దేశం ఎదుర్కొంటున్న అసలు సంక్షోభం సంక్షేమం ఉందా లేదా అన్నది మాత్రమే కాదు, సంపద ఎలా సృష్టించబడుతోంది, ఎవరికి చేరుతోంది, దాని భారం ఎవరు మోస్తున్నారు, దాని ప్రయోజనాలు ఎవరికి దక్కుతున్నాయి అన్నదే. శ్రమజీవుల హక్కులను తగ్గించడం ద్వారా మాత్రమే ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందని చెప్పడం ఏకపక్ష వాదన. సమర్థవంతమైన పన్నుల వసూళ్లు, పన్ను ఎగవేతపై కఠిన చర్యలు, ప్రభుత్వ వ్యయాల్లో పారదర్శకత, అనవసర రాయితీల సమీక్ష, అవినీతి నియంత్రణ, నాణ్యమైన ప్రభుత్వ విద్యా వైద్య రంగాల బలోపేతం, ఉపాధి కల్పన, సామాజిక భద్రత విస్తరణ.. ఇవన్నీ కూడా ఆర్థిక విధానంలో భాగం కావాలి. ఉద్యోగుల పెన్షన్ విధానంపై చర్చ జరగాలంటే, ఈ అంశాలన్నింటినీ కలిపి చూడాలి. ఖజానా ఆదాయాన్ని పెంచే మార్గాలను పరిశీలించకుండా, ప్రజలకు అందే ప్రయోజనాలనే తగ్గించడం సులభమైన మార్గం కావచ్చు. కానీ అది న్యాయమైన మార్గమని చెప్పలేం. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ కావాలని కోరడం అంటే ఆటో డ్రైవర్లకు, రైతులకు, కూలీలకు పెన్షన్ అవసరం లేదని చెప్పడం కాదు. ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను కాపాడుతూనే అసంఘటిత రంగ కార్మికులకూ గౌరవప్రదమైన వృద్ధాప్య భద్రత కల్పించాలనేదే ప్రజాస్వామ్య డిమాండ్ కావాలి. ఒకరి భద్రతను మరొకరి అభద్రతతో కొలవడం మానవత్వం కాదు. పేదవాడికి హక్కులు లేవని చెప్పి ఉద్యోగి హక్కును తొలగించడం సామాజిక న్యాయం కాదు. ఉద్యోగికి పెన్షన్ ఉందని కూలీకి పెన్షన్ నిరాకరించడం కూడా సమానత్వం కాదు. అందరికీ సామాజిక భద్రత కల్పించగల ఆర్థిక, రాజకీయ సంకల్పాన్ని ప్రభుత్వాల నుంచి డిమాండ్ చేయడమే నిజమైన ప్రజాహితం.

మేధావితనం అంటే ప్రభుత్వ ఖజానా లెక్కలు చెప్పడమే కాదు, ఆ లెక్కల వెనుక ఉన్న మనుషుల జీవితాలను చూడగలగడం కూడా. ఆర్థిక క్రమశిక్షణ అంటే పేదల సంక్షేమాన్ని కత్తిరించడం మాత్రమే కాదు, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడటం, సంపద పంపిణీలో న్యాయం సాధించడం, సమాజంలోని బలహీన వర్గాలకు భద్రత కల్పించడం కూడా. సంస్కరణ అంటే ప్రజల హక్కులను తగ్గించి వారిని మార్కెట్ దయాదాక్షిణ్యాలకు వదిలేయడం కాదు, మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లోనూ వారి గౌరవప్రదమైన జీవనానికి హామీ ఇవ్వడం. అందుకే పాత పెన్షన్ విధానంపై చర్చను కేవలం ఖజానా భారం అనే ఒక్క కోణంలో కుదించలేం. ఉద్యోగుల పదవీ విరమణ భద్రత, ప్రభుత్వ దీర్ఘకాలిక ఆర్థిక సామర్థ్యం, అసంఘటిత రంగ సామాజిక భద్రత, సంపద పంపిణీలో న్యాయం.. ఇవన్నీ కలిసే ఈ చర్చకు సమగ్రతను ఇస్తాయి.

చివరగా చెప్పాల్సింది ఒక్కటే. పేదలకు భరోసా కావాలి, కార్మికులకు కనీస వేతనాలు కావాలి, రైతులకు గిట్టుబాటు ధరలు కావాలి, నిరుద్యోగులకు ఉపాధి కావాలి, ఉద్యోగులకు గౌరవప్రదమైన పెన్షన్ భద్రత కావాలి. వీటిలో ఏ ఒక్కటి మరొకదానికి శత్రువు కాదు. ప్రజలందరికీ హక్కులు కల్పించాల్సిన బాధ్యతను విస్మరించి, ఒక వర్గానికి ఉన్న ప్రయోజనాలను మరొక వర్గం ముందు తప్పుగా చిత్రీకరించడం వల్ల సమాజంలో న్యాయం స్థాపించబడదు. రెండు చేతులా పెన్షన్లు పొందుతున్నారనే ఆరోపణలపై ఆధారాలతో స్పష్టత ఇవ్వాల్సిన ప్రజా వ్యక్తులు, అదే సమయంలో ఇతరుల పెన్షన్ హక్కులపై ఉపన్యాసాలు ఇస్తే వారి మాటలకు నైతిక విశ్వసనీయత ఎంత ఉందో ప్రజలు ప్రశ్నిస్తారు. ఆ ప్రశ్నకు సమాధానం వ్యక్తిగత దూషణల్లో లేదు, పారదర్శకతలో, ఆధారాల్లో, సమాన ప్రమాణాల్లో ఉంది.

ప్రజల శ్రమతో సంపద సృష్టించబడుతుంది. ఆ సంపదలో న్యాయమైన వాటా ప్రజలకు దక్కాలి. శ్రమించిన మనిషి వృద్ధాప్యంలో గౌరవంగా బతకగలగాలి. కూలీ అయినా, ఆటో డ్రైవర్ అయినా, రైతు అయినా, ఉపాధ్యాయుడు అయినా, ప్రభుత్వ ఉద్యోగి అయినా.. తన జీవితమంతా సమాజానికి సేవ చేసిన వ్యక్తి చివరి దశలో అభద్రతతో బతకాల్సిన పరిస్థితి ఉండకూడదు. ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కాకుండా, ఇప్పటికే ఉన్న భద్రతను తొలగించాలనే దిశగా సాగుతున్న ఆర్థిక వాదనలను ప్రశ్నించాలి. ఎందుకంటే సమాజంలో నిజమైన సమానత్వం అంటే అందరినీ ఒకే స్థాయిలో అభద్రతలోకి నెట్టడం కాదు, అందరికీ గౌరవంగా బతికే హక్కును కల్పించడం. అదే ప్రజాస్వామ్య స్ఫూర్తి.. అదే సామాజిక న్యాయం.. అదే ప్రజల పక్షాన నిలిచే నిజమైన మేధావితనం. మీ ఊపదం పొడవు ఉపన్యాసాలకు తెలంగాణ ప్రజలు ఆంధ్రప్రదేశ్ ప్రజలు నమ్మే స్థితిలో లేరు ఇది తెలుసుకోవాల్సిన అవసరం జయప్రకాశ్ నారాయణ ఉంది. ఇప్పటికే తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు ప్రైవేట్ లిమిటెడ్ పార్టీని ఎప్పుడో ఆంధ్ర.. తెలంగాణలో బహిష్కరించారు అనేది నగ్నసత్యం. అరిగిపోయిన రికార్డు ఎంత తిప్పిన సౌండ్ రాదనేది తెలుసుకోవాల్సిన అవసరం జయప్రకాష్ నారాయణ కు ఉంది.

-మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు.

చెన్నారెడ్డి గూడలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

- మంచాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్

మంచాల వెలుతురు అక్టోబర్ 25:
మంచాల మండలం చెన్నారెడ్డి గూడా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలు అమలో భాగంగా పేద ప్రజలకోసం అమలు అయిన స్మార్ట్ రేషన్ కార్డులను జిపిఓ సుహాసిని ఆధ్వర్యంలో మంచాల వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ జెని గే వెంకటేష్ యాదవ్ గ్రామంలో గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసు కుంటూ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు ఈసందర్భంగా జెనిగే వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ అర్హులై న ప్రతి పేద కుటుంబానికి సన్నబియ్యం అందాలే అనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు అమలు చేసింది అని అన్నారు స్మార్ట్ రేషన్ కార్డులు తీసుకున్న ప్రతిఒక్కరుసన్న బియ్యం పథకాన్ని వినియోగించుకోవాలి ఆధార్ కార్డు ఎలానో స్మార్ట్ రేషన్ కార్డు అలా అత్యవ సరం అని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజలను అన్నివిధాలుగా ఆదుకోవాలని ఉద్దేశంతో స్మార్ట్ రేషన్ కార్డు అమలు చేసింది అనిఅన్నారు పేద ప్రజలను ఆదుకోవడం కాంగ్రెస్ పార్టీ ప్రభు త్వ లక్ష్యం అని అన్నారు ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఉ ద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ అమలు చేస్తూ ప్రజాపాలన కొ నసాగిస్తుంది అని అన్నారు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారి సహకారంతో అ ర్హులైన వారందరికీ ఇందిర ఇండ్లు స్మార్ట్ రేషన్ కార్డులు పింఛన్లు మంజూరు చేయించి ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి అయ్యేలా కృషి చేస్తాం అని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కిషన్ నాయక్ మంచర్ల క్రాంతి కుమార్ రత్నావత్ హర్యనాయక్ కాట్రోత్ మధు నాయక్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నిట్టు బౌరమ్మ ఆంబోత్ కిషన్ కాట్రోత్ హర్య ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రత్నావత్ స్వామి నాయక్ తదితరులు పాల్గొ న్నారు

మాజీ వైస్ చైర్మన్ బానూరి వెంకట రామ్‌రెడ్డి దశదిన కర్మ

- హాజరైన ఎమ్మెల్యే కాలే యాదయ్య, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి
- కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ప్రజాప్రతినిధులు

శంకర్‌పల్లి, వెలుతురు అక్టోబర్ 25 :
శంకర్ పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బారి వెంకట రామ్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి చేవెళ్ల పార్లమెంట్ మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి హాజరయ్యారు. ఈ

సందర్భంగా వెంకట రామ్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గోపాలరెడ్డి,వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మద పతి చంద్రమౌళి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ పార్శి బాలకృష్ణ, కావలి గోపాల్, కౌన్సెలర్ దండు రాజేశ్వర్, నాయకులు రఘునందన్ రెడ్డి, రాజేశ్వర్ గౌడ్, శంకర్పల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొల్లారం ప్రశాంత్, పొద్దుటూరు సర్పంచ్ బండ లక్ష్మీనరసింహ, మున్సిపల్, మండల కాంగ్రెస్ నాయకులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రూ.99 లక్షలతో శిల్ప ఫైన్ వ్యాలీలో సీసీ రోడ్డు

కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) అక్టోబర్ 25:
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని శిల్ప ఫైన్ వ్యాలీలో గత కొన్నేళ్లుగా మౌలిక సదుపాయాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత నెలలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి సహకారంతో స్థానికులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సిఎంసీ ఫండ్స్ ద్వారా 99 లక్షల రూపాయలు తో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం శిల్ప ఫైన్ వ్యాలీలో చేపట్టిన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రారంభించరు. ఈ సందర్భంగా కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక దయవాదులు తెలిపారు.ఈ కార్యక్రమం లో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజాశేఖర్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రావు,మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు

మెరుగైన వైద్యం కోసం ఎల్వోసీ సదుపాయం

కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి అక్టోబర్ 25:
పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆదివారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనారోగ్యంతో ఉన్న ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్య సదుపాయం అందాలనే లక్ష్యంతో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ వెనువెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్వోసీని మంజూరు చేయించి నిరుపేదల ఆరోగ్య రక్షకులుగా నిలిచారని అన్నారు. కావున అర్హులైన ప్రతీ పేదవారు మెరుగైన వైద్యం కోసం ఎల్వోసీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్వో సి లబ్ధిదారుల వివరాలు:125 – గాజుల రామారం డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన మహేందర్ చౌహాన్, తండ్రి జై గోవింద్ (రూ.1,50,000/–) 130 – సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన ఎల్.ఇందిరా తండ్రి సత్య నారాయణ (రూ.2,00,000/–), సుభాష్ నగర్ డివిజన్ రాంరెడ్డి నగర్ కు చెందిన టి.రామచంద్ర రావు, తండ్రి సత్యనారాయణ (3,50,000/–)..సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ నిజాంపేట్ కు చెందిన తల్లారి శిరీష భర్త తల్లారి మల్లేష్ (రూ.2,50,000/–) ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఆగం రాజు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, గుబ్బల లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, ప్రవీణ్, సాంబశివరెడ్డి, ప్రవీణ్, శివా నాయక్, సమ్మయ్య యాదవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డా. సత్యం శ్రీరంగం

26 జిల్లాల ప్రతినిధుల మద్దతుతో నూతన కార్యవర్గం ఏర్పాటు

కూకట్ పల్లి అక్టోబర్ 25 వెలుతురు:
తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో త్రోబాల్ క్రీడ అభివృద్ధి, యువ క్రీడాకారుల ప్రోత్సాహమే లక్ష్యంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎరోస్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో అధ్యక్షుడిగా డా. సత్యం శ్రీరంగం, ప్రధాన కార్యదర్శిగా చిత్ర శనాయి, కోశాధికారిగా భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (టి ఎఫ్ ఐ TF×) పరిశీలకుడిగా అమన్ శర్మ హాజరయ్యారు. ఈ సమావేశానికి మాజీ కేంద్ర మంత్రి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సముద్రాల వేణుగోపాలాచారి, సీనియర్ న్యాయవాది మోక్షజ్ఞ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణలోని 26 జిల్లాలకు చెందిన అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రతినిధులు పాల్గొని నూతన కార్యవర్గానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా ప్రతినిధులు, సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో త్రోబాల్ క్రీడను మరింత అభివృద్ధి చేయడం, యువ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీయడం, రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా అవసరమైన ప్రోత్సాహం అందిం చడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 26 జిల్లాల ప్రతినిధులతో పాటు కృష్ణ రాజ్‌పుత్, శ్రీరామోజు శివకుమార్, ఓదెలు యాదవ్, వడ్డెన్న, రవి, అనిల్, వినీషా, అలేఖ్య పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: పురేందర్ రెడ్డి

కూకట్ పల్లి అక్టోబర్ 25 వెలుతురు:
శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదేశాల మేరకు వివేకానంద నగర్ డివిజన్‌లో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై కాలనీ వాసులకు అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, మంచినీటిని పొదుపుగా వినియోగించాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. అవసరమైన మేరకే నీటిని ఉపయోగిస్తూ, విద్యుత్ వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఆర్. రామచంద్రరావు, కమిటీ సభ్యులు సూర్యనారాయణ, జి. ప్రసాద్, నాగేందర్ రెడ్డి, టైగర్ పురుషోత్తం, వెంకటేశ్వరరావు, శ్రీధర్, లక్ష్మీనారాయణ, కిషోర్, గ్రానైట్ సూర్యనారాయణ, నందు, చైతన్య, నాని తదితరులు పాల్గొన్నారు.

హైతాబాద్‌లో భూ వివాదం..

భూ వివాదం నేపథ్యంలో హైతాబాద్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ హత్యాయత్నానికి దారితీసింది. ఈ ఘటనలో తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు శుక్రవారం షాబాద్ పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 23న షాబాద్ మండలం హైతాబాద్ గ్రామంలోని సర్వే నంబర్ 202 భూమితో పాటు ఇతర భూములకు సంబంధించి దీర్ఘకాలంగా వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గ్రామంలోని మసీదులో చర్చల కోసం రెండు వర్గాలు సమావేశమైన సమయంలో ఘర్షణ చోటుచేసుకుంది. చాంద్ పాషా, ఆయన కుమారులు సోహెల్, ఫైజల్‌పై దాడికి ముందస్తు పథకం ప్రకారం నిందితులు రెండు కార్లు, ఓ మోటార్ సైకిల్‌పై ఆయుధాలతో వచ్చారని, ఘర్షణలో ముజఫర్ ఉద్దీన్ ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసినట్లు తెలిపారు.

కృష్ణా జలాల తరలింపులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కృషి కీలకం

మునుగోడు, అక్టోబర్ 25 (వెలుతురు):

కృష్ణా జలాలను మునుగోడు ప్రాంతానికి తరలించే విషయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కృషి కీలకమని మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మందుల బీరప్ప అన్నారు. ఏదుల నుంచి డిండి, శివన్నగూడెం ప్రాజెక్టులకు కృష్ణా జలాలను తరలించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు.
దాదాపు మూడేళ్లుగా ఎమ్మెల్యే ప్రాజెక్టుల పనులపై అధికారులు, ఇంజినీర్లతో పలుమార్లు చర్చించి, ప్రాంత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు.కృష్ణా జలాలు అందుబాటులోకి వస్తే ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తాగునీటి సమస్య తీరడంతోపాటు,బీడు భూములు పచ్చని పంట పొలాలుగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.గంగను భూమిపైకి తీసుకొచ్చిన భగీరథుడి తరహాలో కృష్ణమ్మను మునుగోడుకు తీసుకురావడానికి ప్రభుత్వం ముందడుగు వేసేలా చేసినందుకు నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రానున్న మున్సిపల్ ఎన్నికలకు జనసేన శ్రేణులు సిద్ధం కావాలి

ప్రజల్లో ఉంటూ స్థానిక సమస్యలపై పోరాడాలి

రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్

కూకట్ పల్లి అక్టోబర్ 25 వెలుతురు
: తెలంగాణ రాష్ట్రంలో రానున్న మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బలంగా పోటీ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. కూకట్‌పల్లిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్‌కే సాగర్, పార్టీ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, పార్టీ బలోపేతం, వార్డులు, డివిజన్ల స్థాయిలో కమిటీల నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు రానున్న ఎన్నికల్లో సముచిత గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు నిరంతరం ప్రజలతో మమేకమవుతూ, స్థానిక సమస్యలపై పోరాడి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వార్డులు, డివిజన్ల స్థాయిలో కమిటీలను బలోపేతం చేసి, సమన్వయంతో ఎన్నికల ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్‌కే సాగర్ మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాల పట్ల ఆకర్షితులై ప్రజలు, నాయకులు జనసేన వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ప్రతి నాయకుడు తన డివిజన్‌లో పార్టీ బలాన్ని పెంచుకోవడంతోపాటు ప్రజల సమస్యలపై అవగాహన పెంచుకుని, వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కీలక నాయకులు జనసేనలో చేరుతున్నారని తెలిపారు. స్థానికంగా పార్టీని బలోపేతం చేసేందుకు డివిజన్ నాయకులు కృషి చేయాలని, ప్రజల్లో ఆదరణ పొందిన వారికి రానున్న ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థులుగా అవకాశం కల్పించే అంశానికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. కష్టపడే నాయకులకు పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని, కొత్త నాయకులను ఆహ్వానిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకుడు మచ్చా సుధాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై పార్టీ శ్రేణులు అవగాహన పెంచుకోవాలని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేలా కేడర్‌ను సిద్ధం చేయాలని అన్నారు. రిజర్వేషన్ల కోసం ఎదురుచూడకుండా తమ డివిజన్లతోపాటు పక్క డివిజన్లలోనూ పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రామకృష్ణ, రాధారం రాజలింగం, దామోదర్ రెడ్డి, కావ్యతో పాటు జీహెచ్‌ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ పరిధులకు చెందిన జనసేన నాయకులు, వీర మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలాజీనగర్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం

అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: కాంగ్రెస్ నాయకులు

కూకట్ పల్లి అక్టోబర్ 25 వెలుతురు:
బాలాజీ నగర్ డివిజన్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి––మహబూబ్‌నగర్––హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ సత్యం శ్రీరంగం, సీనియర్ నాయకుడు సాధు ప్రతాప్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన బి. సంజీవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో విద్యావంతుల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ గౌడ్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల జశ్వంత్ రావు (దేశాల్), క్రిస్టియన్ మైనారిటీ కోఆర్డినేటర్ మేకల మైఖేల్, ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేసిన విట్టల్ రెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికి ఇండ్లు కేటాయించాలి

ఇందిరమ్మ కమిటీలను రద్దుచేసి, లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలకే అప్పగించాలి-సిపిఎం

మోత్కూర్, అక్టోబర్ 25,వెలుతురు న్యూస్ :
ఇందిరమ్మ ఇండ్ల కేటాంపులో అక్రమాలకు, రాజకీయ వివక్షకు తావులేకుండా గ్రామసభల ద్వారా అర్హులైన పేదలందరికి ఇండ్లు కేటాయించాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రోజున మోత్కూర్ లో ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇందిరమ్మ కమిటీలను రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు చేస్తామని చెప్పిన ప్రభుత్వం, కమిటీలలో కాంగ్రెస్ నాయకులకే ప్రాదాన్యాత ఇచ్చిందని ఆరోపించారు. ఈ కమిటీలకు చట్టభద్ధత లేకపోయినా కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన జాబితా అదారంగానే అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇండ్ల జాభితాలో పేరు ఉంటుందని చెప్పడం అప్రజాస్వామికమని ఇలాంటి చర్యలు సరికాదని అర్హులైన పేదలందరికి పార్టీలకు అతీతంగా ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ప్రభుత్వం వినియోగిస్తున్నది ప్రజల సొమ్మేనని, కాంగ్రెస్ సొంత నిధులు కాదని గుర్తు చేశారు. ఫేస్ 1, ఫేస్ 2, ఫేస్ 3, జాబితాల పేరుతో అనర్హులకు ఇండ్లు కేటాయిస్తున్నారని, అధికారులు స్వతంత్రంగా అర్హులైన పేదలను గుర్తించి ఎంపిక చెయ్యాలని కోరారు. గత ప్రభుత్వ రాజకీయ వివక్షతను, వైఫల్యాలను ప్రశ్నించిన కాంగ్రెస్ తమ పాలనలో కూడ అదే విధానాలను అవలంభిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోలేక పోతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో రాజకీయ పార్టీల జోక్యం లేకుండా అర్హులైన పేదలకు న్యాయం చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, ఉన్నారు.

జాతీయ మాలమహానాడు మండల అధ్యక్షుడిగా బొల్లు సైదులు

మునుగోడు, అక్టోబర్ 25 (వెలుతురు):

జాతీయ మాలమహానాడు మునుగోడు మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని రావిగూడెం కు చెందిన బొల్లు సైదులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని సత్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మాలమహానాడు మండల సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. జాతీయ మాలమహానాడు స్టీరింగ్ కమిటీ సభ్యుడు గోలి సైదులు నూతన అధ్యక్షుడికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాలలకు న్యాయం జరిగేలా రోస్టర్ విధానాన్ని సవరించాలని,చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేసి మాలలకు రెండు పాయింట్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన అధ్యక్షుడు బొల్లు సైదులు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షులుగా అన్నిమల్ల నాగరాజు, గుల్లి శంకర్, ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి దుర్గాప్రసాద్, కోశాధికారిగా మహేశ్వరం అరవింద్, ప్రచార కార్యదర్శులుగా చింతపల్లి సాగర్, పిట్టల శ్రవణ్, సహాయ కార్యదర్శులుగా గోలి నాగేందర్,గోలి హుస్సేన్ తదితరులను ఎన్నుకున్నారు. మాజీ మండల అధ్యక్షుడు చలిచీమల యాదగిరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొగరి విజయ్,రాష్ట్ర కార్యదర్శి తెలగమల్ల యాదగిరి,అద్దంకి రామలింగయ్య,గోలి చెన్నకేశవులు ముచ్చపోతుల నరసింహ,ఇండ్ల నాగరాజు,గాదరి శరణార్థి,ఈద శరత్ బాబు,ఈధ రాములు, పెరుమాళ్ళ ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి రూ.10 వేల ఆర్థిక సాయం

మునుగోడు, అక్టోబర్ 25(వెలుతురు)

:మండలంలోని కచలాపురం గ్రామానికి చెందిన గురిజ మహేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. బాధితుడి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి తన వంతు సాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మొత్తాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, కచలాపురం సర్పంచ్ ఏర్పుల మోహన్ బాబు చేతుల మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు అందించారు.ఆర్థిక సహాయం అందించిన కుంభం శ్రీనివాస్ రెడ్డికి బాధితుడి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కచలాపురం మాజీ ఉపసర్పంచ్ కంచరకుంట్ల రవీందర్ రెడ్డి,చీకటిమామిడి మాజీ ఉపసర్పంచ్ పొలగోని ప్రకాష్, పండుగ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ డంప్ యార్డ్ తరలింపు కోసం రాజీలేని పోరాటం

జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా నరకయాతన అనుభవిస్తున్న లక్షలాది మంది ప్రజల సమస్యను పరిష్కరించే వరకు రాజీపడే ప్రసక్తే లేదని, రేపటి నుంచే బాధిత ప్రజలతో కలిసి పాదయాత్రకు శ్రీకారం చుడుతున్నామని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు అంశంపై బేగంపేట్ లోని టూరిజం ప్లాజాలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ మొత్తం ఆదాయంలో 70 శాతం ఆదాయం వచ్చేది ఈ ప్రాంతం నుంచేనని నాకు తెలుసు. గట్లాంటి ఈ నగరంలో ఇయ్యాల లక్షల మంది ప్రజలు కాలుష్యంతో బతుకు ఈడుస్తా ఉన్నారు. దీనికి పరిష్కారం కావాలని చెప్పి నేను పార్లమెంట్‌లో మాట్లాడినా. పార్లమెంట్‌లో మాట్లాడడమే కాకుండా గతంలో మంత్రి కేటీఆర్ దగ్గరికి కూడా పోయి చెప్పినా. ఇన్ని లక్షల కోట్ల బడ్జెట్ పెడుతున్న ఈ కాలంలో జవహర్ నగర్ కంపునకు శాశ్వత పరిష్కారం చూపాలంటే.. సమగ్రమైన ప్రణాళికలతో రండి అని చెప్పి, నన్ను ఢిల్లీలో ఎట్లా చేస్తున్నారో చూసి రమ్మన్నారు. ఢిల్లీకి పోయి కోట్ల కొద్దీ టన్నుల వేస్ట్‌ను వాళ్లు జీరో ఎట్లా చేస్తున్నారో చూసినం. కానీ వాళ్లు స్పష్టంగా ఒక మాట చెప్పిండ్రు.. చెత్తను జీరో చేస్తున్నాం కానీ, గత 10-20 ఏండ్ల నుంచి అక్కడ ఏ భూగర్భ జలాలైతే పాయిజన్ అయినాయో వాటిని పూర్తిగా శుద్ధి చేయాలంటే చాలా సమయం పడుతుందని చెప్పిండ్రు. ఇవాళ జవహర్ నగర్‌లో ఉన్న రెండు మూడు కోట్ల టన్నుల చెత్తను రాత్రికి రాత్రే తీసేసినా.. వెంటనే లక్ష్మీ నారాయణ చెరువో, చీరాల చెరువో బాగుపడవు, దానికి టైం పడుతుంది. అందుకే సీఎం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఒక నిర్ణయం తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

లక్షలాది మంది ప్రజల భాగస్వామ్యంతో, ప్రజాక్షేత్రంలోనే ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని, సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించి, అవసరమైతే రూ.2000 నుంచి రూ.3000 కోట్లు కేంద్ర నిధులు తీసుకొచ్చే బాధ్యత నేను తీసుకుంటానని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాలను పక్కనబెట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రముఖ పర్యావరణ వేత్త పురుషోత్తం రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కాలుష్యం అనేది కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతమైన ప్రజా సమస్య అని, గాలి-నీరు కలుషితమైతే సమాజంలో ప్రతి ఒక్కరూ బాధితులు కావాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల కోసం ఎన్ని ఆస్తులు, ఫ్లాట్లు, ఫామ్‌హౌస్‌లు సమకూర్చుకున్నా.. వారికి పీల్చేందుకు స్వచ్ఛమైన గాలి, తాగేందుకు స్వచ్ఛమైన నీరు అందించలేకపోతే వాటన్నింటికీ విలువే ఉండదన్నారు.

ఈ సమావేశంలో మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఎన్విరాన్మెంటలిస్టులు దొంతి నరసింహ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ మేయర్ బండ కార్తీక్ రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎన్ఎఫ్సీ మాజీ డిజిఎం హనుమంత రెడ్డి, ఎస్బీహెచ్ ఫార్మర్ బోర్డ్ డైరెక్టర్ పంపాలా నరసింహ, ఎంఆర్పీఎస్ ప్రతినిధి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎదులాబాద్ నుంచి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మింగరాజు, రజక సంఘం అధ్యక్షుడు వెంకటేష్, యాంటీ డంప్యార్డ్ జేఏసీ కన్వీనర్ డాక్టర్ శంకర నారాయణ, కో కన్వీనర్లు మారం సమ్మిరెడ్డి, ఏనుగు సంజీవరెడ్డి, దమ్మైగూడ నుంచి ఓరుగంటి కృష్ణ కిషోర్, ఎదులాబాద్ మాజీ సర్పంచ్, మూసి పరిరక్షణ సమితి అధ్యక్షుడు బట్టి శంకర్, రైన్ వాటర్ హార్వెస్ట్ ఎక్స్పర్ట్ సుభాష్ రెడ్డి, ఈ డాంప్ యార్డుకి వ్యతిరేకంగా పోరాడుతున్న బీజేపీ నాయకులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, తిరుమల రెడ్డి, విక్రమ్ రెడ్డి, కోర్టులో వాదిస్తున్న అడ్వకేట్ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో 'భద్రగిరి శతకం' పుస్తకావిష్కరణ

తుంగతుర్తి మండలానికి చెందిన ప్రముఖ పద్యకవి డా. యర్ర హరికిషన్ (ఎర్రన) రచించిన 'భద్రగిరి శతకం' పుస్తకాన్ని ఆదివారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆవిష్కరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొల్లు దామోదర్‌రావు, భక్త రామదాసు పదవ తరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ శతకంలో భద్రాచల క్షేత్ర మహాత్మ్యం, ఆలయ నిర్మాణ విశేషాలు, సీతారాముల వనవాస ఘట్టాలు, భక్త రామదాసు చరిత్ర, ఆలయ పూజా కైంకర్యాలు, కల్యాణోత్సవ వైభవం తదితర అంశాలను కవి సరళమైన పద్యశైలిలో వివరించారు. పండితులు, సామాన్య భక్తులకు సులభంగా అర్థమయ్యేలా భక్తిభావంతో రచించిన ఈ శతకం విశేషంగా ఆకట్టుకుంటోంది. అనంతరం ఆలయ అధికారులు కవి ఎర్రనకు స్వామివారి దర్శనం కల్పించి, ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రవణ్‌కుమార్, అర్చకులు సాయిబాబా, గడ్డం కృష్ణారెడ్డి, ఈవోఆర్బీ సాయిబాబా, సహాయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

రెడిమిక్స్ ప్లాంట్ పనులను వెంటనే ఆపేయాలి

చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో జాతీయ రహదారి-65 పక్కన చేపడుతున్న రెడిమిక్స్ ప్లాంట్ (=వీజ) నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె ప్రకృతి వనం, గ్రామ దేవత మారెమ్మ ఆలయం, ఇళ్ల స్థలాలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాలకు సమీపంలో రెడిమిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేయడం వల్ల దుమ్ము, ధూళితో పాటు వాయు, శబ్ద కాలుష్యం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. జనావాసాలకు అత్యంత సమీపంలో ప్లాంట్ నిర్మాణం చేపట్టడం సరికాదని, వెంటనే పనులను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్లాంట్ ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే ప్రమేయం ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అరూరి శ్రీశైలం, మండల పార్టీ కార్యదర్శి మల్లారెడ్డి, నాయకులు కొలను వెంకటేష్, బొంతల రామకృష్ణారెడ్డి, కోయగూర నర్సింహ, జింకల ప్రభాకర్, నాతి శ్రీనివాస్, పైళ్ల రఘుమారెడ్డి, బైకాని నరసింహ, చిర్రగోని సురేష్, సూర్యప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు అరూరి రవి, మంకాల కుమార్, ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, లోడె చిరంజీవి, యువజన నాయకులు ఎస్కే జహంగీర్, బొడ్డుపల్లి శ్రీనివాస్, దేవిరెడ్డి సందీప్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

మంథని గ్రామీణం: పెద్దపెల్లి జిల్లా మంథనిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పెద్దపల్లి-కాటారం ప్రధాన రహదారిపై మంథని పాత పెట్రోల్ బంక్ వద్ద లారీ ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. మృతుడిని చింతల నవీన్ (22)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో యువకుడి శరీరం నుజ్జునుజ్జు అయింది. నవీన్ స్థానికంగా పండ్ల దుకాణంలో ఉపాధి పొందుతున్నాడు. మహదేవ్‌పూర్ నుంచి నిజామాబాద్‌కు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో వెళ్లడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లో 150 కేసులు నమోదు

భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజుపేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 42 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, నంబర్ ప్లేట్లు లేని 8 వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 150 కేసులు నమోదు చేసి రూ.36,390 జరిమానా విధించారు. కమ్యూనిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా డీఎస్పీ అరుణ్ కుమార్ కాలనీవాసులతో మాట్లాడుతూ, గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి సేవించే వారిని గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు తరలించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. కాలనీలలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రాజు, వెంకటప్పయ్య, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంత బాధ్యత రాహిత్య పాలన ప్రపంచంలో ఎక్కడా లేదు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి

మోత్కూర్, అక్టోబర్ 25,వెలుతురు న్యూస్ :

ప్రజలు కరువును మర్చిపోవడానికి మహిళలతో నిరుద్యోగులతో నాటికలు వేయమనడం అనేది విడ్డూరం అని ఒక ముఖ్యమంత్రి స్థాయిలో బాధ్యతారహితంగా మాట్లాడడం సబబు కాదని, ప్రజలు నాటికలు చూస్తే కరువు పోతదా, కడుపు నిండుతదా అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి అన్నారు .ఆదివారం నాడు ఆయన పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రజలకు భరోసా ఇచ్చే నాయకుడే ప్రజలను బయపెడుతూ బాధ్యత లేకుండా మాట్లాడితే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించు కున్నది తెలంగాణకు న్యాయం చేయడానికా లేక ఆంధ్రకు పరోక్షంగా సహాయం చేయడానికా అన్నారు. చేతిగుర్తుకు ఓటేస్తే చేతులెత్తేసిన ముఖ్యమంత్రి చేతగాకపోతే రాజీనామా చెయ్ గాని నీళ్లురావు, కరెంట్ రాదు, పంటలేయకండి అన్న దద్దమ్మ మాటలు మాట్లాడి ప్రజలను భయాందోళనలకు గురిచేయ్యొద్దన్నారు. కరువొస్తే ఆదుకోవడానికి కట్టిన కాళేశ్వరం నీళ్లను. శ్రీశైలంనీళ్లను వాడుకోచేతగాక నీ ఆంధ్రబాబుకు వదిలిపెట్టి తెలంగాణ ప్రాంతాన్ని ఎండబెట్టిన విషయం కళ్లముందు కనిపిస్తుంటే సిగ్గులేనిమాటలు మాట్లాడడానికి ముఖ్యమంత్రికి మంత్రులకు నోరేలా వచ్చిందన్నారు. మూడేళ్లకాలంలో ముచ్చట్లు తప్పా చేసినఒక్కమంచిపని లేదన్నారు. గోదావరి. కృష్ణా నదుల్లో పారుతున్న నీటిని మనమే వాడుకుంటే రెండేళ్లు కాలంపోయిన తెలంగాణకు కరువురాకుండ ఉండేదన్నారు. ముమ్మాటికీ ఈ కరువు కాంగ్రెస్ అసమర్థత వల్లే వచ్చిందని. ఇగనైనా కళ్ళు తెరిచి నీళ్లు కరెంట్ విషయంలో రైతులకు అన్యాయం చెయ్యొద్దని అన్నారు.

మృతి చెందిన విశ్రాంత ఉద్యోగి

పరామర్శించిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి.

మోత్కూర్, అక్టోబర్ 25,వెలుతురు న్యూస్ :

మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామానికి చెందిన విశ్రాంత రైతు సేవా సహకార సంఘం ఉద్యోగి మామిడి నరహరి (72) ఆదివారం నాడు మరణించారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి దహన సంస్కారాల నిమిత్తం 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. వారి వెంట మాజీ సర్పంచ్ ఎలుగు శోభ సోమయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బండి వెంకటేష్ , మాజీ రైతు కోఆర్డినేటర్ ఎలుగు సత్తయ్య, వార్డు మెంబర్ బొడ్డు మహేష్, కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మోత్కూర్, అక్టోబర్ 25,వెలుతురు న్యూస్ :

ఉమ్మడి నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరాటే పోటీలను నల్లగొండలోని ఎం వి ఎన్ భవన్లో నిర్వహించారు. ఈ పోటీలకు మోత్కూరు స్టాండర్డ్ షిటూరియో ఇంటర్నేషనల్ కరాటే డు విద్యార్థులు పాల్గొని మెడల్స్ సాధించి, రాష్ట్ర స్థాయికి ఎన్నికైనట్లు సీనియర్ కరాటే మాస్టర్ అన్నెపు వెంకట్ తెలిపారు. 17 సంవత్సరాల లోపు బాలికలలో 60 కేజీల స్పారింగ్ విభాగంలో డి. సహస్ర గోల్డ్ మెడల్ ,44 కేజీల విభాగంలో కనుకు నిది చందన సిల్వర్ మెడల్,ఓపెన్ వెయిట్ లో వి. హాసిని బ్రాంజ్ మెడల్ సాధించారు. 14 సంవత్సరాలు లోపు 30 కేజీల స్పారింగ్ విభాగంలో కనుకు శివకృష్ణ గోల్డ్ మెడల్, 35 కేజీల విభాగంలో పి. అద్విక్ బ్రాంజ్ మెడల్,ఓపెన్ వెయిట్ లో బి.రేణు శ్రీ బ్రాంజ్ మెడల్ సాధించారు .గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులను కరాటే గ్రాండ్ మాస్టర్ పీ. బాలరాజు, యాదాద్రి భువనగిరి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ దశరథరెడ్డి అభినందించారు .ఈ కార్యక్రమంలో గుండాల కేజీబీవీ ఎస్ఓ వి. విజయలక్ష్మి ,కరాటే మాస్టర్స్ కనుకు రాజు,పోచం మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

మునుగోడు,అక్టోబర్ 25 (వెలుతురు):

మండలంలోని గుండ్లోరిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వర్కాల సైదులు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. వారం రోజుల క్రితం గుండ్లోరిగూడెం అడ్డరోడ్డు వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడిన ఆయన నల్గొండలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు .విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు ఆ మొత్తాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన చైర్మన్‌కు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు,జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జంగిలి నాగరాజు,గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు బొల్లం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని హర్యానా మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దత్తాత్రేయ గర్భాలయంలో కొలువైన స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం రంగమండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, ఆలయ ఉప కార్యనిర్వాహణాధికారి స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.

మహనీయుల ఆశయాలను కొనసాగిద్దాం

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 25: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, చంబల్ గాంధీగా పేరుగాంచిన డాక్టర్ ఎస్.ఎన్. సుబ్బారావు (భాయిజీ) గారి ఐదవ వర్ధంతి (పుణ్యతిథి) సందర్భంగా కరీంనగర్ నగరపాలక సంస్థ తీగలగుట్టపల్లి లోని మేయర్ క్యాంప్ కార్యాలయం లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. అక్టోబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ.. డాక్టర్ ఎస్.ఎన్. సుబ్బారావు తన జీవితమంతా దేశసేవకు, యువతలో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం పెంపొందించడానికి అంకితం చేసిన మహనీయులని కొనియాడారు. కేవలం 13 ఏళ్ల వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన, స్వాతంత్ర్యం అనంతరం గాంధేయ సిద్ధాంతాల స్ఫూర్తితో సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. చంబల్ లోయల్లో బందిపోట్లుగా జీవించిన వారిని అహింసా మార్గంలోకి తీసుకువచ్చి, జనజీవన ప్రవంతిలో కలిసేలా కృషి చేసిన గొప్ప మానవతావాది భాయిజీ అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ సేవా ఆశ్రమాన్ని స్థాపించి, వారికి పునరావాసం కల్పించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆచార్య వినోబా భావే, జయప్రకాశ్ నారాయణ్ వంటి ప్రముఖుల స్ఫూర్తితో పనిచేస్తూ శాంతి, అహింస, మానవతా విలువలను సమాజంలో పెంపొందించేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. యువతే దేశానికి వెన్నెముక అనే నమ్మకంతో నేషనల్ యూత్ ప్రాజెక్ట్ (ఎన్‌వైపీ)ను స్థాపించి, గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిల వరకు యువజన శిబిరాలను నిర్వహించారని మేయర్ పేర్కొన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రత, మతసామరస్యాన్ని కాపాడటంతో పాటు ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల సమయంలో సేవా కార్యక్రమాల ద్వారా యువతలో సామాజిక బాధ్యతను పెంపొందించారని అన్నారు. పద్మశ్రీ, పద్మవిభూషణ్ వంటి పురస్కారాలను స్వీకరించకుండా తన నిరాడంబర జీవితానికి, సేవా మార్గానికి ప్రాధాన్యతనిచ్చిన త్యాగశీలి భాయిజీ అని కొనియాడారు. జీవితాంతం బ్రహ్మచారిగా ఉంటూ 94 ఏళ్ల వయసులో భారతమాత సేవలోనే తన జీవితాన్ని ముగించిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భాయిజీ మార్గదర్శకత్వంలో తాను కూడా దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను అలవర్చుకున్నానని, ప్రజాసేవలో ముందుకు సాగేందుకు ఆయన ఆశీస్సులు, స్ఫూర్తి తనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని మేయర్ తెలిపారు. భాయిజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని, ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం నేషనల్ యూత్ ప్రాజెక్ట్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్వైపీ కే. యాదవ రాజు అధ్యక్షతన నిర్వహించబడింది. అక్టోబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా ఆంగ్లభాష రిసోర్స్ పర్సన్ గడ్డం జగదీష్, మై భారత్ కరీంనగర్ మాజీ ప్రోగ్రామ్ కన్వీనర్ రవీందర్, గాజ శివరాం, ఎన్నం ప్రకాష్, గాండ్ల నరేష్, వడ్డేపల్లి రాజు, కొలగాని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జై గురు దత్త.. దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

స్వర్గీయ హరే రామకృష్ణ జ్ఞాపకార్థం అభిషేకం, అన్నప్రసాద వితరణ

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 25: అశ్వయుజ మాస పౌర్ణమి సందర్భంగా జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రంజోల్‌లో ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వర్గీయ హరే రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జహీరాబాద్, రంజోల్, పస్తాపూర్ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ ఆలయంలో ప్రతి నెలా పౌర్ణమి సందర్భంగా స్వామివారికి అభిషేకం నిర్వహించడంతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. భక్తి, సేవాభావంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తున్నాయి.

కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డి లోని సుందరయ్య భవన్ లో సీఐటీయు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ. 42 వేలకు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుదించి నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చిందని, వీటివల్ల కార్మిక వర్గానికి పోరాడే హక్కు లేకుండా పోతుందన్నారు.

అందుకే డిసెంబర్ మొదటి వారంలో లేబర్ కోడ్స్ రద్దు కోసం దేశవ్యాప్తంగా కార్మిక వర్గం మోడీకి గుణపాఠం చెప్పడానికి చలో ఢిల్లీ వెళ్తున్నామని లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.42 వేలకు పెంచాలని, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు కోసం సోమవారం జరిగే చలో హైదరాబాద్ ఇందిరా పార్క్ మహాధర్నాను జిల్లాలోని స్కీం వర్కర్లు అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, నాయకులు వెంకటేష్, లక్ష్మణ్, యాదయ్య, సదానందం, సువర్ణ, మంజుల, శశికళ, వన్నెష్, దశరథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల ఆకలి తీర్చడమే అమ్మవారికి చేసే సేవ!

తుల్జాపూర్ పాదయాత్రికులకు 29 ఏళ్లుగా అన్నదానం..

జహీరాబాద్ ఎక్స్ ఆర్మీ, స్థానికుల సేవాభావం

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 25: భక్తితో అమ్మవారి దర్శనం కోసం పాదయాత్రగా సాగుతున్న యాత్రికులకు అన్నదానం చేయడం అమ్మవారికి సేవ చేసినంత పుణ్యకార్యమని భక్తులు భావిస్తారు. ఈ స్ఫూర్తితో జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ఎక్స్ ఆర్మీ సిబ్బంది, స్థానికుల సహకారంతో గత 29 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తమ సేవాభావాన్ని చాటుకుంటున్నారు. మహారాష్ట్రలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్ శ్రీ తుల్జా భవానీ అమ్మవారి దర్శనం కోసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతం నుంచి భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఎండను సైతం లెక్కచేయకుండా

భక్తిశ్రద్ధలతో ముందుకు సాగుతున్న యాత్రికులకు అన్నదాతలు అండగా నిలుస్తున్నారు. పాదయాత్రలో అలసిపోయిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తూ వారి ఆకలిని తీరుస్తున్నారు. సుదీర్ఘ ప్రయాణంలో భక్తులకు ఆహారం అందించడం ద్వారా మానవసేవే మాధవసేవ అనే భావనను చాటుతున్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా భక్తులకు భోజనం వడ్డించడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సేవాగుణాన్ని చాటిచెబుతున్నారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ తహసీల్దార్ మయామణ్ణి ప్రారంభించారు. గత 29 సంవత్సరాలుగా నిరంతరాయంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎక్స్ ఆర్మీ సిబ్బంది, స్థానికుల సేవలను పలువురు అభినందిస్తున్నారు. భక్తులకు అన్నం పెట్టడం ద్వారా అమ్మవారి ఆశీస్సులు లభిస్తాయని విశ్వసిస్తూ ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు ఆదివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాటాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య, ఆధునిక వసతులు కల్పించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిసు _న్నట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి కనీసం 10 పాఠశాలల్లో తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుం టున్నా మన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోం దన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాజకీయాలకు అతీతంగా నీటి సంరక్షణపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణాన్ని 18 నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యారంగ మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు మెరుగైన భోజనం, వసతులు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో నీటి నిల్వలు పెంచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. ప్రభు త్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ 25 ఎకరాల్లో సుమారు 2,600 మంది విద్యా ర్థులకు ఉపయోగపడేలా ఆధునిక వస తులతో పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

రాజన్న ఆలయ అభివృద్ధి, వేములవాడ పట్టణ అభివృద్ధి తమకు రెండు కళ్లలాంటివని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న భక్తులతో పాటు పట్టణ ప్రజల రవాణా కష్టాలను తీర్చడమే లక్ష్యంగా చేపట్టిన 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. ఆదివారం మహంకాళి ఆలయం నుంచి రాజన్న ఆలయం ముందు భాగం వరకు కొనసాగుతున్న రహదారి విస్తరణ పనులను మున్సిపల్ పాలకవర్గం, సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆది శ్రీనివాస్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధితో పాటు పట్టణ అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వేములవాడను ఆధ్యాత్మిక కేంద్రంగా, టెంపుల్ సిటీగా తీర్చిదిద్దడమే

లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఇప్పటివరకు రాజన్న ఆలయ అభివృద్ధి కోసం సుమారు రూ.250 కోట్లకు పైగా నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. ఆలయ అభివృద్ధి పనులు సుమారు 55 శాతం, అన్నదాన సత్రం నిర్మాణ పనులు 50 శాతం వరకు పూర్తయ్యాయని వివరించారు. అదనంగా రూ.99.40 కోట్ల నిధులు మంజూరు కావడంతో మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు

వేములవాడ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న 80 అడుగుల రహదారి విస్తరణ పనులు తుది దశకు చేరుకున్నాయని ఆది శ్రీనివాస్ వెల్లడించారు. రహదారి నిర్మాణానికి సుమారు రూ.6.5 కోట్లతో పాటు విద్యుత్ స్తంభాలు, లైటింగ్ ఏర్పాట్ల కోసం నిధులు కేటాయించినట్లు తెలిపారు. రహదారి విస్తరణకు సంబంధించి రూ.47 కోట్లతో జీవో తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పండుగలు విశ్వవ్యాప్తం

ఎంపీ రఘునందన్ రావు

కుల, మత, పార్టీలకు అతీతంగా అందరినీ ఒకే చోట చేర్చాలనే ఉద్దేశంతో 25 సంవత్సరాల క్రితం మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ప్రారంభించిన అలయ్ బలయ్ కార్యక్రమాన్ని సిద్దిపేటలోనూ కొనసాగించడం గర్వకారణం అని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో బీజేపీ సీనియర్ నాయకులు ధూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన దేశం గొప్ప సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన దేశం అని, ఏ దేశం వెళ్లిన హిందువుల పండుగలు గొప్పగా జరుపుతున్నారని, మన పండుగలు విశ్వవ్యాప్తమయ్యాయని అన్నారు.

అమెరికాలోనూ అయ్యప్ప భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని, అక్కడ కూడా అయ్యప్ప దేవాలయాలను నిర్మిస్తున్నారని అన్నారు. బతుకమ్మ, దసరా, వినాయక చవితి వంటి వేడుకలను ప్రపంచంలోని ముస్లిం అరబ్ దేశాలలో సైతం నిర్వహిస్తున్నారని అది హిందువులుగా మనకెంతో గర్వకారణం అన్నారు. అందరూ ఒకే దగ్గర కలవాలని ఉద్దేశంతో దూది శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఏడు ఎనిమిది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గర్వకారణం అన్నారు. ముందు ముందు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్, అంబటి బాలేష్ గౌడ్, కలాల్ శ్రీనివాస్, సిపిఐ నాయకుడు మంద పవన్, కాంగ్రెస్ నాయకులు బొమ్మల యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు జైపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాసంగారి వెంకట్, కొత్తపల్లి రాధ వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సాధనతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

సాధనతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ అన్నారు. వివిధ ఉన్నత విద్య పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన బంజారా విద్యార్థుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సన్మానించారు. అనంతరం కార్యక్రమాన్ని నిర్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలుపుతూ పలు అంశాల్లో వారిని మార్గదర్శనం చేశారు. టీబేస్ (తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం) జహీరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో నీట్, ఐఐటీ, ఐఐఐటీ, ఎంఎస్‌లలో ప్రవేశం పొందిన బంజారా విద్యార్థులకు ఆదివారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ డీఎస్పీ సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ?ఈ సందర్భంగా సన్మానం పొందిన వారిలో నీట్ విద్యార్థులు లిఖిత పవార్, సిరి పవార్, వివేక్ రాథోడ్, వైష్ణవి, హర్షవర్ధన్ రాథోడ్; పీజీ లో



ప్రవేశం పొందిన పవార్ వినీత్, పవార్ శ్రీలత, నవీన్ జాధవ్; ఐఐటీలో ప్రవేశం పొందిన దీపిక చవ్వాణ్, ప్రియాంక పవార్; ఐఐఐటీలో ప్రవేశం పొందిన పల్లవి చవ్వాణ్ ఉన్నారు. అదేవిధంగా నీట్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించి మహావీర్ ఆసుపత్రిలో ఎంబీబీఎస్ సీటు పొందిన వంశీ మాధవ్‌ను వివిధ ప్రజా, ఉపాధ్యాయ, ఉద్యోగ, స్వచ్ఛంద సంఘాల నేతలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థి కృషిని, ఆయన తల్లిదండ్రులు వీరాంజలీ దేవి దంపతులు అందించిన ప్రోత్సాహాన్ని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ సీతారామరాజు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థికి ఆశీస్సులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో..? డివిజన్ అధ్యక్షులు రమేష్ బానోత్ అధ్యక్షతన, ప్రధాన కార్యదర్శి జైసింగ్ చవ్వాణ్, గౌరవ అధ్యక్షులు దేవి సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తులసి రామ్ రాథోడ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు కిషన్ రావు పవార్, కౌన్సెలర్ వకీల్ చవ్వాణ్, న్యాల్కల్ ఎంఈఓ మారుతీ రాథోడ్, జీహెచ్‌ఎం నాను సింగ్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ శేషు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం: ఉప్పల శ్రీనివాస్ గుప్తా

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 25:
దేశ వ్యాప్తంగా వాసవి క్లబ్ సేవలు అభినందనీయ మనీ తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తెలిపారు. ఆదివారం హయత్ నగర్ లో నిర్వహించిన అల్లాడిస్ డిస్కాన్ జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు వైశ్య జాతికి చెందిన అనేక సంస్థలు వివిధ రూపాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలను అందుకుంటున్నాయని ఆయన వివరించారు సేవకు ప్రతిరూపంగా వైశ్యులు నిలుస్తారని ఆయన వెల్లడించారు సమాజహితం కోసం వైశ్యులు ముందుంటారని ప్రాంతాలు మతాలు కులాలు పట్టించు కోరని కేవలం సేవా దృక్పథం ఒకటే వారి ముందు ఉంటుందని ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు వివిధ రూపాల్లో వైశ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ సేవలు కూడా ఒకటని ఆయన పేర్కొన్నారు. సమాజాభివృద్ధికి సేవా సంస్థ చేసిన కృషి అభినందనీయమని సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల కండగా నిలవడం గొప్ప విషయం అని తెలిపారు సమాజంలో సేవా భావాలను మరింతగా విస్తరించేందుకు ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా ప్రజోపయోగ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని ఆయన సూచించారు కలసికట్టుగా పని చేద్దాం సేవా కార్యక్రమాల్లో ముందుకు సాగుదాం అనే నినాదంతో సదస్సు

నిర్వహించడం వారి పరిణితికి నిదర్శనమని శ్రీనివాస్ గుప్తా వివరించారు హయత్‌నగర్‌లోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్ సమీప నిధీష్ కన్వెన్షన్‌లో ఈ సదస్సు నిర్వహించారు. సేవా కార్యక్రమాలు, సామాజిక బాధ్యత, ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో చేపడుతున్న కార్యక్రమాలను ప్రోత్సహించడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి అల్లాడి 'స్ డిస్కన్ జిల్లా గవర్నర్, సద్గురు యోగాచార్య డాక్టర్ అల్లాడి పరమేశ్వర్ నాయకత్వం వహించగా, అంతర్జాతీయ అధ్యక్షుడు కేసీజీఫ్ సిద్ధ వెంకట సూర్య ప్రకాశరావు, ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కోశాధికారి కేసీజీఫ్ వి.ఎస్. సెంథిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సదస్సులో బొగ్గారపు దయానంద్ గంప నాగేశ్వర్ రావు , చంద్రమౌళి , కృష్ణ రావు , పలువురు ప్రముఖులు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గుడుంబా తయారీదారుడి అరెస్ట్!

శివంపేట: భీమ్లా తాండాలో గుడుంబా తయారీ, అక్రమ మద్యం విక్రయాలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు కొరడా ఝుళిపించారు. శనివారం రాత్రి నిర్వహించిన దాడుల్లో గుడుంబా తయారీదారుడిని అరెస్ట్ చేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న రెండు బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేశారు. భీమ్లా తాండా గ్రామపంచాయతీ పరిధిలో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 30 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అనధికారికంగా ఐఎంఎల్ మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో అధికారులు రెండు బెల్ట్ షాపుల్లో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి రెండు కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో 4.32 లీటర్ల ఐఎంఎల్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, మెదక్ డివిజన్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా పర్యవేక్షణలో ట్రైనీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జ్ఞానేశ్వర్, ఎస్‌ఐ డి. శరత్ కుమార్, ట్రైనీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సచిరథ, ఎక్సైజ్ సిబ్బంది రవి, హెడ్ కానిస్టేబుల్ స్వామి, కానిస్టేబుళ్లు మహేష్ కుమార్, షాహిద్, రాజశేఖర్ తదితరులు ఈ దాడుల్లో పాల్గొన్నారు. గుడుంబా తయారీ, అక్రమ మద్యం విక్రయాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

హైదరాబాద్‌లో ఘనంగా అలయ్ బలయ్ కార్యక్రమం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 :
హైదరాబాద్ జిల్లా పీఈటీఏ-టీఎస్, హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లాలోని వివిధ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఉన్నతాధికారులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్జేడీ సోమిరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే. శ్రీనివాస్ గౌడ్, పీఈటీఏ-టీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కట్ట శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

సంఘాన్ని అర్థం చేసుకోవాలంటే దగ్గరగా చూడాలి: అన్నదానం సుబ్రహ్మణ్యం

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 25:
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) బర్కత్‌పుర శాఖ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాలు, సంఘ శతాబ్ది వేడుకల్లో భాగంగా నిర్వహించిన పథ సంచలనం, అనంతరం సభ నారాయణగూడలోని కేఎంఐటీ లో జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి సభ్యులు శ్రీ అన్నదానం సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, "సంఘాన్ని అర్థం చేసుకోవాలంటే సంఘాన్ని దగ్గరగా చూడాలి" అని అన్నారు. సంఘ కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా సంఘ లక్ష్యాలు, కార్యపద్ధతి, సమాజం పట్ల సంఘానికి ఉన్న బాధ్యతలను అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. విజయదశమి సందర్భంగా నిర్వహించిన పథ సంచలనంలో స్వయంసేవకులు క్రమశిక్షణతో కదం తొక్కుతూ పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రారంభమైన పథ సంచలనాలు నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి వద్ద కలిశాయి. మార్గమధ్యంలో పలుచోట్ల స్థానికులు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి స్వయంసేవకులకు స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సంఘ ప్రముఖులు పాల్గొని సంఘ కార్యవిస్తరణ, సామాజిక సమైక్యత, దేశాభివృద్ధిలో పౌరుల పాత్ర వంటి అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో స్థానిక సంఘ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు..కార్యక్రమంలో ప్రాంత కార్యకారిణి సభ్యులు శ్రీ అన్నదానం సుబ్రహ్మణ్యం, విభాగ కార్యవాహ శ్రీ రఘునాథ్, కార్యవాహ శ్రీ పురుషోత్తం, జిల్లా సహ సంఘచాలక్ శ్రీ కస్తూరి రంగన్, ప్రాంత కార్యకారిణి సభ్యులు శ్రీ టి.ఎస్.ఆర్. మూర్తి, సహ కార్యవాహలు పరశురాముజీ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

: అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడలోని శ్రీ లక్ష్మీ గణపతి సహిత శ్రీ కాశీ విశ్వేశ్వర శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి స్వామి సమక్షంలో ఆలయ ధర్మకర్త పట్లోళ్ల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేక కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 130 మంది వేద పండితులచే ఐదు లక్షల పుష్పాలతో వందలాది మంది మహిళలు పాల్గొని పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దొమ్మట ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిలు ఎమ్మెల్సీ అంజిరెడ్డి లతోపాటు ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్లు బక్కి వెంకటయ్య ఎర్రోళ్ల శ్రీనివాస్ లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి భావాలు పెంపొందించుకొని మానసిక ప్రశాంతతను పొందుతూ లోక కళ్యాణం కొరకు పాటుపడాలని కోరారు. అదే విధంగా ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహిస్తున్న పట్లోళ్ల భాస్కర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, బీఆర్ సీనియర్ నాయకులు బొల్లారం బాల్ రెడ్డి,గోవర్ధన్ రెడ్డి కుమార్ గౌడ్, మాజీ ఎంపీపీ దేవానంద్ జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, రణం శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి శ్రీకాంత్ గౌడ్, లింగం గౌడ్ మనీ కౌన్సిలర్లు కృష్ణ ఉపేందర్ రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్‌ది అనవసర రాద్ధాంతం..

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ లో మరణించిన వారి నకిలీ ఓట్లు తొలగించవద్దా...?
- ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ నవంబర్ 3న కరీంనగర్లో తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయండి.
- బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం

కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 25:
కేంద్ర ఎన్నికల సంఘం పారదర్శకంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, అనవసర రాద్ధాంతం, గందరగోళం సృష్టించి పనికిమాలిన రాజకీయం చేస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ ఇల్లంతకుంట మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రోజున నిర్వహించిన టిఫిన్ బైటక్ , ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమానికి సాయిని మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా కాంగ్రెస్ తన రాజకీయ ప్రయోజనాల కోసం భారత ఎన్నికల సంఘం, బీజేపీ మోదీ ప్రభుత్వం పై చేస్తున్న అసత్య ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఓటర్ల జాబితాను పూర్తి పారదర్శకంగా, జవాబుదారీతనంతో నకిలీ ఓట్లు తొలగించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే 'ఎస్ ఐ ఆర్' ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎస్ ఐ ఆర్ పై అనవసర రాద్ధాంతం చేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, సిజెపి వైఖరి పట్ల

ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నకిలీ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించవద్దని ఆయన ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఇదేమి ప్రథమం కాదని, భారత ఎన్నికల సంఘం గతంలో 1952, 1957, 1961, 1965-66, 1983-84, 1987-89, 1992-95, 2002-2004 లలో ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియను నిర్వహించిందని గుర్తు చేశారు. సుదీర్ఘ విరామం తరువాత 2025 మరియు 2026 లలో దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఈ సర్వేను నిర్వహిస్తుందన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు ఓటర్లలో గందరగోళం సృష్టించి ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని బలపేతం చేసేందుకు స్పష్టమైన ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు చేపట్టిన ఈ ప్రక్రియను రాజకీయం చేయడం సరికాదన్నారు. బీజేపీ ఓట్ చోరీ చేస్తుందని మాట్లాడుతున్న కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఓట్ చోరీతోనే గెలిచిందా? 50 ఏళ్లు దేశాన్ని పాలించిందా..? అనే విషయాన్ని స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను గందరగోళానికి గురిచేసి రాజకీయ లబ్ధి పొందాలనే ఏకైక ఎజెండాతో కాంగ్రెస్ దేశ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తుందని ఆయన ఆరోపించారు. పూర్తి పారదర్శకతతో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పై కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలంతా గ్రహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కాలంలోఢిల్లీ కేంద్రంగా ఆందోళనలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ, సిజెపిలు ఈ విషయంలో చేస్తున్న తప్పులను, ప్రచారాలను, వైఖరిని విడనాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ అవలంబిస్తున్న వైఖరి ఎండగడుతూ నవంబర్ 3న కరీంనగర్లో భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున యువతను భాగస్వామ్యం చేయడం జరుగుతుందని , ర్యాలీని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు తగిన కృషి చేయాలని పిలుపునిచ్చారు. 3న కరీంనగర్లో జరిగే ర్యాలీకి బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రం మంత్రివర్యులు స్మృతి ఇరానీ హాజరవుతారని తెలిపారు. టిఫిన్ బైటక్ సమావేశం అనంతరం ప్రధాని మోదీ మన్ కీ బాత్ ను స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి సాయిని మల్లేశం వీక్షించారు.

ఓట్ల తొలగింపును అడ్డుకోవాలి: డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

దేశంలో పెద్ద ఎత్తున ఓటు చోరీకి ఎన్నికల కమిషన్ పాల్పడుతుందని ఓటు బచావో దేశ్ బచావో అనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ఏఐసీసీ స్పోక్స్ పర్సన్ శరణ్ పాటిల్ తెలిపారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో డీసీసీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శరణ్ పాటిల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. గతంలో ఎన్నికల కమిషన్ ఇంటింటికి తిరిగి అర్హులైన ఓటర్ల అందరికీ ఓటు హక్కు కల్పించిందని గుర్తు చేశారు.కానీ.. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ కమిషన్ మాటను పట్టించుకోకుండా నరేంద్ర మోడీ, అమిత్ షా మాట వింటూ పెద్ద ఎత్తున ఓట్లు తొలగించారని ఆరోపించారు. బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున అర్హులైన ఓట్లు తొలగించి బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అదే తరహాలో దేశమంతా ఓట్లు తొలగించిందని. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని అందరూ సహకరించాలని కోరారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని బీఎల్ఏలు ఇంటింటికి తిరిగి అర్హులైన ఓటర్లను గుర్తించాలని సూచించారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఆయుధం అని దానిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమితో కలిసి నవంబర్ 1వ తేదీన డిల్లీలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నామని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.
సర్ పేరుతో పెద్ద ఎత్తున అర్హులైన ఓట్లు తొలగించారని ఓట్ల తొలగింపును అడ్డుకోవాలని డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కోటి 35 లక్షల మంది ఓట్లు తొలగించారని ఆరోపించారు. అందులో 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చారని, చిన్న చిన్న కారణాలతో నోటిసులు ఇవ్వడం దారుణమన్నారు. ఓటు రక్షణ కోసం రాహుల్ గాంధీ డిల్లీలో తలపెట్టిన ర్యాలీకి జిల్లా నుంచి పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. సర్ కార్యక్రమంలో 2002 ఓటరు జాబితా ప్రకారం ఓటరు లీస్టు వారి కుటుంబ సభ్యులు ఉంటేనే ఓటు హక్కు ఉంటుందని తెలపడంతో యువ ఓటర్లకు వివరాలు లభించక వారు ఓటు హక్కును కోల్పోతున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. ఓటు చోరీకి పాల్పడుతున్న కేంద్ర ఎన్నికల కమిషనర్ ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటు చోరీని ఆపివేసి దేశాన్ని కాపాడేందుకు రాహుల్ గాంధీ తలపెట్టిన ఢిల్లీకి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మెదక్ క్లస్టర్ ఇంచార్జ్ ప్రీతం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, జార్జ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి:సీఐటీయూ

: విద్యుత్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించి 2026 తక్షణమే అమలు చేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయుఈఈయు-సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నలవాల స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం చేర్యాల పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ఉద్యోగుల సమావేశంలో హుస్నాబాద్ డివిజన్ పరిధిలో పనిచేసే పలువురు విద్యుత్ కార్మికులు, లైన్మెన్లు, అసిస్టెంట్ లైన్మెన్లు, ఆర్టిజన్ కార్మికులు సంఘంలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించి నిర్ణయాలు కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ రంగం ప్రైవేటీకరణ వల్ల సామాన్య ప్రజలకు రైతులకు ఆర్థిక భారం పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటిపల్లి సదాకర్, కాటం మధు, అనిల్, జిల్లా నాయకులు అశోక్, చందు, రాము, సుధాకర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోండి

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ ఎన్‌రోల్‌మెంట్‌పై సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ అవగాహన కల్పించారు. ఆదివారం ఆయన న్యూబో యిన్‌పల్లిలోని జయనగర్, న్యూసిటీ, పవన్‌విహార్, ఆకాష్‌నగర్, వనితా, నూతన్ కాలనీల వాసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన పలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలు సుకున్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరలోనే వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

మాదకద్రవ్యాల రహిత సమాజంతోనే వికసిత్ భారత్

నల్లకుంట: విద్యార్థులను, యువతను లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్ మాఫియా విస్తరిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని భాజపా జాతీయ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మాదకద్రవ్యాల రహిత సమాజంతోనే వికసిత్ భారత్ సాధ్యమవుతుందని అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 'నశా ముక్త్ భారత్ సైక్లింగ్ రైడ్' లో భాగంగా అక్షర స్ఫూర్తి ఆధ్వర్యంలో ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద లక్ష్మణ్ సైకిల్ రైడ్‌ను ప్రారంభించారు. చిక్కడపల్లి ఆర్టీసీ క్రాస్ రోడ్ ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో సైక్లింగ్ చేస్తూ అశోక్ నగర్ చౌరస్తా వరకు కొనసాగించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. 2029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశంగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగి స్తుందన్నారు. అందుకోసం విద్యార్థి యువత ప్రజానీకమంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు రైడర్లతో పాటు విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాకు గర్వకారణం

- జిల్లా సెషన్స్ జడ్జిగా మనీషారెడ్డి
- శంకర్ పల్లి మండలం నుంచి ఎన్నికైన తొలి మహిళా జడ్జిగా రికార్డు

శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 25 : మండల పరిధిలోని మహాలింగాపురం గ్రామానికి చెందిన మనీషారెడ్డి ఇటీవల విడుదలైన జిల్లా సెషన్స్ జడ్జి ఫలితాల్లో ఘన విజయం సాధించి, జడ్జిగా ఎంపికయ్యారు. రంగారెడ్డి జిల్లా నుండి ఈ అత్యున్నత పదవికి ఎంపికైన మొదటి మహిళగా మనీషారెడ్డి నిలవడం పట్ల స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇది శంకర్ పల్లి మండలానికి మరియు జిల్లా మొత్తానికి ఎంతో గర్వకారణమని స్థానికులు కొనియాడారు. మనీషా రెడ్డి జడ్జిగా ఎంపికైన సందర్భంగా ఆదివారం శంకర్ పల్లిలోని వారి నివాసంలో ఆమె భర్త అనంత్ రెడ్డి మిత్ర బృందం ప్రత్యేక్షంగా కలిసి ఘనంగా సత్కరించింది. శాలువాతో సన్మానించి, పుష్పగు చ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మిత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ.. మనీషారెడ్డి గారు ఎంతో కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నారని, ఆమె విజయం ఎంతో మంది మహిళలకు, యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు రఘునందన్ రెడ్డి, రాజశేఖర్, వెంకటేష్, ప్రశాంత్ బాబు, బాలరాజు, వెంకట్ పాల్గొన్నారు.

కృష్ణా జలాల తరలింపులో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి కృషి కీలకం

మునుగోడు, వెలుతురు అక్టోబర్ 25: కృష్ణా జలాలను మునుగోడు ప్రాంతానికి తరలించే విషయంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల రెడ్డి కృషి కీలకమని చెర్కుపల్లి వెంకటయ్య నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారు. ఏదుల నుంచి డిండి, శివన్నగూడెం ప్రాజెక్టు లకు కృష్ణా జలాలను తరలించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం హర్షణీయమన్నారు. దాదాపు మూడేళ్లుగా ఎమ్మెల్యే ప్రాజెక్టుల పనులపై అధికారులు, ఇంజినీర్లతో పలుమార్లు చర్చించి, ప్రాంత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. కృష్ణా జలాలు అందుబాటులోకి వస్తే ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు తాగునీటి సమస్య తీరడంతోపాటు, బీడు భూములు పచ్చని పంట పొలాలుగా మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గంగను భూమిపైకి తీసుకొచ్చిన భగీరథుడి తరహాలో కృష్ణమ్మను మునుగోడుకు తీసుకురావడానికి ప్రభుత్వం ముందడుగు వేసేలా చేసినందుకు నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భాగ్యనగరంలో దుర్గామాత ఊరేగింపుపై

గుడ్డు విసిరిన దుండగులు

పోలీసుల అదుపులో అనుమానితులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 : నగరంలోని మాదన్నపేట ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుర్గా మాత విగ్రహం ఊరేగింపుపై దుండగులు కోడి గుడ్డుతో దాడి చేశారు. దీంతో అక్కడ స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులకు సమాచారం అందగానే ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఊరేగింపు నిర్వాహకులతో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దారు. ఈ దాడికి పాల్పడ్డారనే అనుమానంతో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిస్థితి అదుపులో ఉందని, తప్పుడు ప్రచారం చేయొద్దని పోలీసులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో భిన్నమతాలు, భిన్న ప్రాంతాలకు చెందిన ప్రజలు ఎంతో సామరస్యంతో జీవిస్తుంటారు. అందుకే భాగ్యనగరాన్ని గంగా జమునా తెహజీబ్ అని అంటుంటారు. అలాంటి హైదరాబాద్ నగరంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రతో ఇటీవల కొన్ని ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వినాయక నవరాత్రుల సమయంలో అన్నదానం ప్రాంతంలో కొందరు మహిళలు చేపల వ్యర్థాలు పారబోయగా.. అంతకు ముందు దిల్‌షుఖ్‌నగర్ సంతోషి మాత ఆలయంలోకి ప్రవేశించిన ఓ వ్యక్తి విగ్రహంపై కర్రతో దాడికి యత్నించాడు. మాదన్నపేట ప్రాంతంలో వినాయక నిమజ్జనం సందర్భంగా అన్నదానం నిర్వహిస్తుండగా.. ఆ ప్రాంతంలో ఎముకలు, నాన్‌వెజ్ వ్యర్థాలతో ఉన్న కవర్‌ను పై నుంచి విసిరేశారు. దీంతో హిందూ సంఘాల నేతలు నిరసన చేపట్టారు. తాజాగా శనివారం రాత్రి అదే మాదన్నపేట ప్రాంతంలో దుర్గా మాత విగ్రహం ఊరేగింపు జరుగుతుండగా.. ఊరేగింపుపైకి కోడి గుడ్డు విసిరేశారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ ప్రాంతంలో కాసేపు ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు ఆందోళన చేస్తున్న వారిని సముదాయించడంతోపాటు.. అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. అర్ధరాత్రి 2 గంటల సమయంలో దుర్గా మాత ఊరేగింపుపై కోడి గుడ్డు విసిరినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే చార్మినార్ డీఎస్పీ కిరణ్ ఖరే, అడిషనల్ డీసీపీ మజిద్, ఏసీపీ శ్యామ్ సుందర్, సైదాబాద్ ఏసీపీ వెంకట్ రెడ్డి, మాదన్నపేట ఎస్‌హెచ్‌వో కె.చంద్రశేఖర్ తదితరులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని చక్కదిద్దడం కోసం అక్కడున్న వారితో మాట్లాడిన అధికారులు.. అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. ఇంకా ఎవరికైనా ఈ ఘటనలో ప్రమేయం ఉందేమోనని తెలుసుకోవడం కోసం పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. "సంతోష్ హోటల్ లేన్ దగ్గర దుర్గా మాత విగ్రహం ఊరేగింపుపై గుడ్డు విసిరినట్లు రాత్రి 2 గంటల సమయంలో మాకు సమాచారం వచ్చింది. సీనియర్ అధికారులు ఘటనా స్థలికి చేరుకొని, నిర్వాహకులతో మాట్లాడారు. అనుమానితులను కస్టడీలోకి తీసుకున్నారు. మేం సీసీటీవీ కెమెరాలకు చెక్ చేస్తున్నాం" అని పోలీసు అధికారి ఒకరు మీడియాకు తెలిపారు.

పరిస్థితిని అర్థం చేసుకున్న నిర్వాహకులు ఆందోళనకు దిగకుండా.. ఊరేగింపును కొనసాగించారని ఆ అధికారి చెప్పారు. ఇక్కడ సమస్యలేం లేవు. ఓవరాల్‌గా వాతావరణం పూర్తి ప్రశాంతంగా ఉంది. ఎలాంటి రూమర్లు ప్రచారం చేయొద్దని ప్రజలను కోరుతున్నామని పోలీసులు చెప్పారు. లోతుగా విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. ప్రజలు సంయమనం పాటించాలని.. ధ్రువీకరించని సమాచారం, సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్న తప్పుడు సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

మ్యాట్రిమోనీ పరిచయం.. పెళ్లి పేరుతో మోసం

మహిళ నుంచి రూ.1.5 కోట్లకు పైగా వసూలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 : మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ ద్వారా పరిచయమైన మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం ఏర్పరచుకుని, అనంతరం వ్యక్తిగత ఫొటోలు, వీడియోలతో బెదిరిస్తూ కోటిన్నర రూపాయలకు పైగా వసూలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రదీప్ కొనేటి అనే వ్యక్తిని మేడిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితురాలి నుంచి బ్యాంకు బదిలీలు, యూపీఐ లావాదేవీలు, ఆన్‌లైన్ రుణాలు, సుమారు 170 గ్రాముల బంగారు ఆభరణాల రూపంలో డబ్బులు తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిందితుడిపై గతంలో ఇతర కేసులు కూడా నమోదైనట్లు పోలీసులు తెలిపారు. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ ద్వారా పరిచయం చేసుకుని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ మహిళ నుంచి కోటిన్నర రూపాయలకు పైగా వసూలు చేసిన వ్యక్తిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెళ్లి పేరుతో నమ్మించి శారీరక సంబంధం ఏర్పరచుకోవడంతో పాటు, వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను బయటపెడతానని బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు నిందితుడిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన హైదరాబాద్ శివారు మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పీర్జాదిగూడలో వెలుగుచూసింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీర్జాదిగూడకు చెందిన బాధిత మహిళకు ప్రదీప్ కొనేటి (41) అనే వ్యక్తి ఆగస్టు 2024లో కమ్మ మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ ద్వారా పరిచయమయ్యాడు. కొంతకాలం పరిచయాన్ని కొనసాగిస్తూ.. ఆమెను వివాహం చేసుకుంటానని నమ్మించాడు. వ్యాపారం, ఇతర అవసరాల పేరుతో ఆమె నుంచి డబ్బులు తీసుకున్నాడు. ఈ క్రమంలో ఆమెతో శారీరక సంబంధం ఏర్పరచుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం బాధితురాలితో ఉన్న వ్యక్తిగత సంబంధానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను బయటపెడతానని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. బ్యాంకు బదిలీలు, యూపీఐ లావాదేవీలు, ఆన్‌లైన్ రుణాలతో పాటు సుమారు 170 గ్రాముల బంగారు ఆభరణాల రూపంలో మొత్తం కోటిన్నర రూపాయలకు పైగా తీసుకున్నట్లు ప్రాథమిక వివరాల ద్వారా తెలుస్తోంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఆపై బెదిరింపులకు పాల్పడటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రదీప్ కొనేటిని అరెస్ట్ చేశారు. నిందితుడిపై గతంలో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో హత్య కేసు నమోదైనట్లు, గోల్కొండ, తిరుమలగిరి పోలీస్ స్టేషన్లలో గంజాయికి సంబంధించిన మరో రెండు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇదే తరహాలో మరికొంతమంది మహిళలను కూడా నిందితుడు మోసగించి ఉండవచ్చన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి నుంచి తీసుకున్న డబ్బుల ఆర్థిక లావాదేవీలు, బంగారు ఆభరణాల వివరాలు, ఈ వ్యవహారంలో మరెవరైనా పాల్గొన్నారా అనే అంశాలను పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ల ద్వారా పరిచయాలు ఏర్పరచుకునే సమయంలో వ్యక్తుల వివరాలను ధ్రువీకరించుకోవడం, ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండటం అవసరమని పోలీసులు చెబుతున్నారు. పెళ్లి పేరుతో డబ్బులు అడగడం, వ్యక్తిగత ఫొటోలు లేదా వీడియోలతో బెదిరించడం వంటి పరిణామాలు ఎదురైతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

ఏసీబీ వలలో జలమండలి అధికారి

- కారులో రూ.2.40 లక్షలు
- లెక్కల్లో లేని నగదు పట్టివేత

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 : హైదరాబాద్‌లోని జలమండలి జాయింట్ డైరెక్టర్ ఏ. శ్రీనివాస్ కారులో రూ. 2.40 లక్షల లెక్కల్లో లేని నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అజ్ఞాత సమాచారం ఆధారంగా శనివారం రాత్రి రాజ్‌భవన్ రోడ్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నగదుకు సంబంధించి ఆయన ఇచ్చిన వివరణపై అనుమానాలు వ్యక్తం కావడంతో పంచనామా నిర్వహించి సొమ్మును సీజ్ చేశారు. ఈ వ్యవహారాన్ని ఆదాయపు పన్ను శాఖకు తెలియజేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఏసీబీ అధికారులకు మరో అవినీతి చేప చిక్కింది. ఖైరతాబాద్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డులో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఏ. శ్రీనివాస్ వద్ద లెక్కల్లో లేని నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆయన ప్రయాణిస్తున్న కారులో రూ. 2.40 లక్షల నగదు లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఆ సొమ్ముకు సంబంధించి ఆయన ఇచ్చిన సమాధానా లపై అనుమానాలు వ్యక్తం కావడంతో నగదును సీజ్ చేసి తదుపరి విచారణ చేపట్టారు. అధికారు లు తెలిపిన వివరాల ప్రకారం.. ఏసీబీ సిటీ రేంజ్-2 బృందానికి వచ్చిన అజ్ఞాత సమాచారం ఆధారంగా అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో రాజ్‌భవన్ రోడ్డులోని మెట్రో రెసిడెన్సీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా మారుతి స్విఫ్ట్ కారును నిలిపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ వాహనం జలమండలి జాయింట్ డైరెక్టర్ ఏ. శ్రీనివాస్‌కు చెందినదిగా గుర్తించారు. కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. కారు తనిఖీ చేయగా రూ. 2,40,000 నగదు లభ్యమైంది. ఆ మొత్తానికి సంబంధించి అధికారులు ప్రశ్నించగా.. శ్రీనివాస్ సరైన వివరణ ఇవ్వలేకపోయినట్లు ఏసీబీ వెల్లడిం చింది. ఆయన సమాధానాల్లో పొంతన లేకపోవడం తో నగదు మూలాలపై అనుమానాలు వ్యక్తమయ్యా యి. దీంతో నిబంధనల ప్రకారం పంచనామా నిర్వహించి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై మరింత విచారణ జరిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న నగదుకు సంబంధించిన వివరాలను ఆదాయపు పన్ను శాఖకు కూడా తెలియజేయనున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. నగదు ఎక్కడి నుంచి వచ్చింది ? దానిని ఏ అవసరానికి తీసుకెళ్తున్నారు ? అనే అంశాలపై తదుపరి విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు అవినీతి నిరోధక శాఖ తనిఖీలు కీలకంగా నిలుస్తున్నాయి. ఇటీవల కాలంలో వరుసగా ప్రభుత్వ అధికారుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు నిర్వహిస్తున్నారు. పలువురు అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేయటంతో పాటు రిమాండ్‌కు తరలించారు.

బస్సు ప్రయాణికులకు గుడ్‌న్యూస్..

రూ.600తో వారం రోజులు అన్‌లిమిటెడ్ జర్నీ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 : హైదరాబాద్ నగర ప్రయాణికుల కోసం టీజీఎస్ఆర్టీసీ రూ. 600కే ఏడు రోజుల పాటు అపరిమిత సిటీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏసీ, నాన్ ఏసీ సిటీ బస్సుల్లో ఈ పాస్ వినియోగించుకోవచ్చు. అయితే.. పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు ఇది వర్తించదు. మరోవైపు.. విమానాశ్రయానికి వెళ్లే పుష్పక్ ఏసీ బస్సుల ఛార్జీలను కూడా అక్టోబర్ 7 నుంచి తగ్గించారు. రోజువారీ ప్రయాణికుల ఖర్చులు తగ్గించడంతో పాటు ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడం ఈ నిర్ణయాల లక్ష్యంగా అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో నిత్యం బస్సుల్లో ప్రయాణించే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. నగర ప్రయాణాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు ఖర్చును తగ్గించే లక్ష్యంతో క్యూర్ పరిధిలో రూ. 600కే వారం రోజుల పాటు అపరిమితంగా సిటీ బస్సుల్లో ప్రయాణించే వీక్లీ పాస్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులు, రోజూ వివిధ పనుల కోసం నగరంలో ప్రయాణించే వారికి ఈ పాస్ ఉపయోగపడనుంది. ఆర్టీసీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ వీక్లీ పాస్ కొనుగోలు చేసిన రోజు నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. ఈ పాస్ కలిగిన ప్రయాణికులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఏసీ బస్సులతో సహా అన్ని రకాల సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించవచ్చు. అయితే.. శంషాబాద్ విమానాశ్రయానికి నడిచే పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదు. నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో వీక్లీ పాస్‌లు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. రోజూ పలుమార్లు బస్సులు మారుతూ ప్రయాణించే వారికి ఈ పాస్ ద్వారా ప్రయాణ ఖర్చులను ముందుగానే నిర్ణయించుకునే అవకాశం ఉంటుంది. ఒక్కో ప్రయాణానికి విడిగా టికెట్ తీసుకునే అవసరం తగ్గడంతో పాటు వారంపాటు రవాణా ఖర్చులపై స్పష్టత లభిస్తుంది. ముఖ్యంగా కార్యాలయాలకు వెళ్లేవారు, నగరంలోని వివిధ ప్రాంతాలకు తరచూ వెళ్లాల్సిన వారు తమ ప్రయాణ అవసరాలకు అనుగుణంగా ఈ పాస్‌ను ఉపయోగించుకోవచ్చు. ఇదిలా ఉండగా.. ఇటీవల శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికుల కోసం టీజీఎస్ఆర్టీసీ పుష్పక్ ఏసీ బస్సుల ఛార్జీలను కూడా తగ్గించింది. సవరించిన ధరలు అక్టోబర్ 7 నుంచి అమల్లోకి వచ్చాయి. విమానాశ్రయ ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పుష్పక్ బస్సుల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కొత్త ఛార్జీల ప్రకారం మియాపూర్ ఎక్స్ రోడ్ నుంచి విమానాశ్రయానికి టికెట్ ధర రూ. 350 నుంచి రూ. 250కి తగ్గింది. జేఎన్‌టీయూ నుంచి రూ. 350 ఉన్న ఛార్జీ రూ. 200కు చేరింది. శిల్పారామం, గచ్చిబౌలి నుంచి ఛార్జీ రూ. 300 నుంచి రూ. 150కి తగ్గింది. లింగంపల్లి, ఆల్విన్ ఎక్స్ రోడ్ నుంచి రూ. 350 ఉన్న ధర రూ. 200కు చేరగా, కొత్తగూడ నుంచి రూ. 300 నుంచి రూ. 150కి తగ్గించారు. కొండాపూర్ నుంచి విమానాశ్రయానికి ఛార్జీ రూ. 300 నుంచి రూ. 200కు సవరించారు. నగర సిటీ బస్సులకు వీక్లీ పాస్ సౌకర్యం, విమానాశ్రయ బస్సులకు ఛార్జీల తగ్గింపు వంటి చర్యలతో ప్రజా రవాణా వినియోగం పెరుగుతుందని ఆర్టీసీ భావిస్తోంది. వ్యక్తిగత వాహనాలపై ఆధారపడే ప్రయాణికులు ప్రజా రవాణా వైపు మళ్లితే రహదారులపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గడంతో పాటు ప్రయాణ ఖర్చులను కూడా నియంత్రించుకునే అవకాశం ఉంటుంది.

బషీర్‌బాగ్‌లో రాముడి విగ్రహం తొలగింపు

దసరా రోజున ప్రతిష్ఠించిన హిందూ సంఘాలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 : దసరా రోజున బషీర్‌బాగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహాన్ని తొలగించడంతో తీవ్ర వివాదం నెలకొంది. కూడలి పేరు మార్పుపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. విగ్రహం ఏర్పాటుకు జీహెచ్ఎంసీ, పోలీసుల అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించారు. విగ్రహాన్ని క్రేన్‌తో తొలగించే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు మోహరించారు. తొలగింపునకు గల కారణాలపై అధికారుల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రధాన కూడలిలో శ్రీరాముడి విగ్రహం తొలగింపు తీవ్ర వివాదానికి దారితీసింది. ఇటీవల దసరా పర్వదినం సందర్భంగా హిందూ సంఘాలు ఏర్పాటు చేసిన రాముడి విగ్రహాన్ని శనివారం అధికారులు తొలగించడంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శ్రీరాముడి విగ్రహాన్ని తొలగించిన విషయం తెలిసి హిందూ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరోవైపు.. విగ్రహం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు ఉన్నాయా.. కూడలి పేరును మార్చే ప్రతిపాదన ఏమైనా ఉందా అనే ప్రశ్నలు కూడా ఈ వివాదంలో ముందుకొచ్చాయి. హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాల్లో ఒకటైన బషీర్‌బాగ్ చౌరస్తాలో అమ్మవారి ఆలయం సమీపంలో శ్రీరాముడి విగ్రహాన్ని విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేశారు. భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్ ఈ విగ్రహ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించారు. ఇక నుంచి

బషీర్‌బాగ్ కూడలిని 'శ్రీరామ్ చౌక్'గా పిలవాలని ఆయన హిందువులకు పిలుపునిచ్చారు. అయితే.. బషీర్‌బాగ్ చౌరస్తా పేరును మార్చాలన్న పిలుపుపై మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

కూడలి పేరు మార్పు విషయంలో అధికారికంగా ఏమైనా ప్రతిపాదన ఉందా.. అక్కడ శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతులు తీసుకున్నారా అనే అంశాలపై ఎంబీటీ ప్రశ్నలు లేవనెత్తింది. ఈ నేపథ్యంలోనే బషీర్‌బాగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహాన్ని అధికారులు శనివారం తొలగించారు. క్రేన్ సాయంతో విగ్రహాన్ని అక్కడి నుంచి తీసి.. లారీలోకి ఎక్కించారు. ఈ పరిణామంతో బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద తీవ్ర ఉద్రిక్తత మొదలైంది. విగ్రహం తొలగింపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించడంపై కొందరు హిందూ సంఘాల ప్రతినిధులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విగ్రహాన్ని అక్కడే కొనసాగించాలని.. బషీర్‌బాగ్ కూడలికి 'శ్రీరామ్ చౌక్'గా పేరు పెట్టాలని గతంలో కొందరు సంఘాల నాయకులు కోరినట్లు తెలుస్తోంది. అయితే విగ్రహం తొలగింపునకు సంబంధించి అధికారుల నుంచి స్పష్టమైన కారణాలు వెల్లడించాల్సి ఉంది. మజ్లిస్ బచావో తెహ్రీక్ అధికార ప్రతినిధి అంజద్ ఉల్లా ఖాన్ ఈ వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైదరాబాద్ నగర పోలీసుల అనుమతి లేకుండానే విగ్రహాన్ని ఏర్పాటు చేశారని ఆయన ఆరోపించారు. కూడలి పేరును మార్చాలని పిలుపునిచ్చిన సమయంలో అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. బషీర్‌బాగ్ చౌరస్తా హైదరాబాద్‌లో రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లలో ఒకటి. ఈ నేపథ్యంలో అక్కడ శ్రీరాముడి విగ్రహం ఏర్పాటు.. కూడలి పేరు మార్పు, అనుమతుల అంశాలు తీవ్ర వివాదానికి కారణం అయ్యాయి. ఒకవైపు విగ్రహం తొలగింపుపై హిందూ సంఘాల అభ్యంతరాలు వ్యక్తం అవుతుండగా.. మరోవైపు అనుమతులపై ఎంబీటీ ప్రశ్నలు లేవనెత్తింది. దీంతో అధికారుల వైఖరిపై ఆసక్తి నెలకొంది.

ఆగ్రహజ్వాలల్లో అట్టుడుకుతున్న యూరప్!

- జీవన వ్యయం, చాలీచాలని వేతనాలపై ప్రజాగ్రహం
- ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్ సహా పలు దేశాల్లో వీధి పోరాటాలు
- పోలీసులతో ఘర్షణలు.. వేలాది మంది భద్రతా సిబ్బంది మోహరింపు

బ్రస్సెల్స్, వెలుతురు అక్టోబర్ 25 : యూరప్ వ్యాప్తంగా సామాన్యుల ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. పెరిగిన జీవన వ్యయం, అందుబాటులో లేని నివాస గృహాలు, చాలీచాలని వేతనాలు, క్షీణిస్తున్న ప్రభుత్వ సేవలు, ప్రభుత్వాల విధానాలపై ప్రజల్లో పెల్లుబికిన అసంతృప్తి వరుసగా రెండో వారాంతంలో కూడా అనేక దేశాలను కంపింపజేసింది. ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆల్బేనియా, బెల్జియం వంటి దేశాల్లో లక్షలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. అనేక ప్రాంతాల్లో ఈ ఆందోళనలు శాంతియుతంగా ప్రారంభమైనప్పటికీ, క్రమంగా పోలీసులకు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు, దాడులు, లూటీలు, వీధి పోరాటాలుగా మారడంతో యూరప్ దేశాలు తీవ్ర భద్రతా దళాల దిగ్బంధంలోకి వెళ్ళవలసి వచ్చింది. ఫ్రాన్స్‌లో ఈ అసంతృప్తి అత్యంత తీవ్ర రూపం దాల్చింది. దేశవ్యాప్తంగా సుమారు 4.1 లక్షల నుంచి 8 లక్షల మంది వరకు నిరసనల్లో పాల్గొన్నట్లు అంచనా. ఫ్రెంచ్ రాజధాని ప్యారిస్‌లో వేలాది మంది కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరిన క్రమంలో, ఆందోళనకారులు తాత్కాలిక బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులపైకి రాళ్ళు, ఇతర వస్తువులను విసిరారు. ముసుగులు ధరించిన కొందరు యువకులు కార్ల షోరూమ్‌ల అద్దాలను ధ్వంసం చేయడంతో పోలీసులు లాఠీఛార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను ఉపయోగించవలసి వచ్చింది. మార్సెయిల్, బోర్డో, లియాన్ వంటి నగరాల్లో చెత్తకుండీలకు నిప్పు పెట్టి రాకపోకలను స్తంభింపజేశారు. పరిస్థితి చేయిదాటకుండా 70,000 మంది పోలీసులను మోహరించిన ఫ్రెంచ్ ప్రభుత్వం, దాదాపు 1,000 మందికి పైగా నిరసనకారులను అదుపులోకి తీసుకుంది. ఇటలీలో ప్రధానంగా యువత జీవన వ్యయాలు, పెరిగిన విద్యుత్ ఛార్జీలు, తక్కువ వేతనాలు, ప్రభుత్వం తీసుకుంటున్న వ్యూహాత్మక నిర్ణయాలకు వ్యతిరేకంగా రోడ్లపైకి వచ్చారు. మిలాన్ నగరంలో గతం వారాంతంలో జరిగిన లూటీలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన మంత్రి జార్జియా మెలోని అదనంగా 500 మంది సైనికులను రక్షణగా మోహరించారు. వ్యాపారవేత్తలు, లగ్జరీ షోరూమ్‌లు తమ దుకాణాలను ముందస్తుగా బోర్డులతో మూసివేసుకున్నారు. మిలాన్‌లో ఆందోళనకారులు విద్యుత్ నియంత్రణ సంస్థ ముందు పేడను కుమ్మరించి పెరిగిన కరెంట్ బిల్లుల ప్రతీకలను దహనం చేశారు. రోమ్‌లో విద్యార్థులు కోలోసియంను ఆక్రమించి పాలస్తీనా జండాలు ప్రదర్శించగా, ఉద్రిక్తతల నివారణకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. టురిన్ నగరంలో సైతం పోలీసుల పైకి పొగ బాంబులు, సీసాలు విసిరారు. స్పెయిన్‌లోని బార్సిలోనాలో ఈ ఆందోళనలు వినాశకరంగా మారాయి. ముసుగులు ధరించిన నిరసనకారులు షాపుల షట్టర్లను పగలగొట్టి లూటీలకు పాల్పడ్డారు. నగరంలో 30కి పైగా ప్రదేశాల్లో నిప్పు పెట్టడంతో పోలీసులు వాటర్ క్యానన్ల ద్వారా పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బార్సిలోనాలో అరెస్ట్ అయిన 100 మందిలో నాలుగో వంతు మంది మైనర్లే కావడం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు రాజధాని మాడ్రిడ్‌లో 25,000 మందికి పైగా పెన్షన్ రంగానికి చెందిన సంస్కరణల కోసం శాంతియుతంగా నిరసన తెలిపారు. పోర్చుగల్‌లో పెరిగిన ఇంటి అద్దెలు, ఆస్తుల ధరలకు వ్యతిరేకంగా లిస్బన్ నగరంలో వేలాది మంది ప్రజలు ఇళ్ల అందుబాటు కోసం ఆందోళనలు నిర్వహించారు. ఆల్బేనియా రాజధాని తిరానాలో విద్యార్థులు విద్యా రుసుములు తగ్గించాలని, విద్యారంగానికి నిధులు పెంచాలని, ప్రధాని ఎడి రామా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యా మంత్రిత్వ శాఖ వద్ద భారీ నిరసన చేపట్టారు. భద్రతా దళాలు వాటర్ క్యానన్లను ఉపయోగించి గుంపును చెదరగొట్టాయి. అలాగే బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో కూడా విద్యార్థులు నిర్మించిన బారికేడ్లను తొలగించడానికి పోలీసులు టియర్ గ్యాస్ వాడవలసి వచ్చింది. ఈ వరుస ఆందోళనలు ఐరోపా దేశాల ఆర్థిక సమతుల్యత, పాలనా సామర్థ్యంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వివిధ దేశాల్లోని సమస్యలు వేర్వేరుగా ఉన్నప్పటికీ.. పోర్చుగల్‌లో నివాస గృహాలు, ఆల్బేనియాలో విద్య, ఇటలీ-ఫ్రాన్స్‌లలో జీవన వ్యయాలు ప్రజా వ్యవస్థల పట్ల పెరుగుతున్న అసంతృప్తి మాత్రం సమానంగా ఉంది. కఠినమైన భద్రతా చర్యలు, ఆర్మీ మోహరింపుల ద్వారా శాంతి భద్రతలను కాపాడటానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రజల ప్రాథమిక సమస్యలను పరిష్కరించనంత వరకు ఈ ఆగ్రహజ్వాలలను పూర్తిగా అదుపు చేయడం సవాలుతో కూడుకున్న విషయమే.

ఇరాన్‌పై మళ్లీ దాడులకు ట్రంప్ హెచ్చరిక

- చర్చలకు ఎవరూ దొరకడం లేదు.. ఒప్పందానికి అంగీకరించకపోతే భారీ మూల్యం తప్పదు
- అగ్రనాయకత్వమంతా తుడిచిపెట్టుకుపోయిందని వ్యాఖ్యలు
- యుద్ధం జరిగినా మా వైఖరి మారదు : ఇరాన్ విదేశాంగ మంత్రి

వాషింగ్టన్, వెలుతురు అక్టోబర్ 25 : ఇరాన్‌పై మరోసారి సైనిక చర్య చేపడతామని గత కొంత కాలంగా చెబుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా దాడుల్లో ఇరాన్ అగ్రనాయకత్వమంతా తుడిచిపెట్టుకుపోయిందని, కనీసం చర్చలు జరపడానికి కూడా ఎవరూ దొరకడం లేదని వ్యాఖ్యానించారు. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం నిర్వహించిన ర్యాలీలో ఆయన ఇరాన్‌పై విమర్శలు గుప్పించారు. ఇరాన్ వద్ద యుద్ధ విమానాలు, యుద్ధ నౌకలు లేవని, నాయకత్వం కూడా దెబ్బతిన్నదని ట్రంప్ అన్నారు. అగ్రశ్రేణి నాయకులతోపాటు ద్వితీయ శ్రేణి నేతలు కూడా మృతి చెందారని పేర్కొన్నారు. చర్చలు జరపాలన్నా అవతలి వైపు ఒకరు ఉండాలని, అందుకే దాడులు నిలిపివేశానని వ్యాఖ్యానించారు. శాంతి ఒప్పందానికి అంగీకరించకపోతే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అమెరికాతో యుద్ధం ప్రారంభమైన తొలినాళ్లలోనే ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీతోపాటు పలువురు ప్రముఖ రాజకీయ, సైనిక నాయకులు మృతి చెందినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆ తర్వాత సుప్రీం నేతగా ఎన్నికైన మొజ్తబా ఖమేనీ కూడా తీవ్రంగా గాయపడినట్లు కథనాలు వచ్చాయి. ఆయన పేరుతో ప్రకటనలు వెలువడుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఆయన బాహ్య ప్రపంచానికి కనిపించలేదు. తాత్కాలిక ఒప్పందం నేపథ్యంలో అమెరికా, ఇరాన్ దాడులను నిలిపివేసినప్పటికీ, హర్మూజ్ జలసంధి కేంద్రంగా అప్పుడప్పుడు ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. అమెరికాలో నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఈలోగా ఒప్పందం కుదరకపోతే అమెరికా మరోసారి దాడులకు దిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా వైమానిక, నౌకాదళ బలగాలు పశ్చిమాసియా వైపు కదులుతుండటం గల్ఫ్ దేశాల్లో ఆందోళనకు కారణమవుతోంది.

యుద్ధం జరిగినా.. పాత ఫలితమే: ఇరాన్

అమెరికా దూకుడు చర్యలను నిశితంగా గమనిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. మరోసారి యుద్ధం ప్రారంభమైనా తమ దేశ వైఖరిలో మార్పు ఉండబోదని ఆదివారం స్పష్టం చేశారు. ఇప్పటికే రెండుసార్లు యుద్ధం చేశారని, దాని ఫలితం ఏమిటో చూశారని వ్యాఖ్యానించారు. మరోసారి ప్రయత్నించినా గతంలో వచ్చిన ఫలితాలే పునరావృతమవుతాయని, ఈ విషయం అమెరికాకు కూడా తెలుసని ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో గత కొంతకాలంగా చోటుచేసుకుంటున్న ఘర్షణలు నౌకా రవాణా తీరునే మార్చివేశాయని అరాగ్చీ అన్నారు. ఇకపై హర్మూజ్ నౌకా మార్గం మునుపటిలా ఉండబోదని, దాని నిర్వహణ విధానంలోనూ మార్పులు వస్తాయని పేర్కొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

- నిబంధనలు పాటిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం
- వాహనదారులకు సీపీ వీసీ సజ్జనార్ ఎనిమిది సూచనలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. 'నియమాలు పాటిద్దాం.. ప్రాణాలు కాపాడుకుందాం' అనే నినాదంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు కమిషనర్ ఎనిమిది కీలక సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. కారులో ప్రయాణించేవారు సీటు బెల్టు ధరించాలని, వాహనం నడుపుతూ చరవాణి ఉపయోగించవద్దని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సంకేతాలను పాటించడంతోపాటు అతివేగం, ప్రమాదకర డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. పాదచారులను గౌరవించి వారికి దారి ఇవ్వాలని సూచించారు. మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తోందనే విషయాన్ని గుర్తుంచుకుని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ట్రాఫిక్ నిబంధనలు కేవలం ఆంక్షలు కాదని, ప్రాణాలను కాపాడే మార్గాలని పేర్కొన్నారు. సురక్షిత ప్రయాణమే సంతోషకర జీవితానికి ఆధారమని పోలీసులు ప్రజలకు పిలుపునిచ్చారు.

అంతర్జాతీయ స్థాయిలో దేశ ప్రజాస్వామ్యంపై కుట్ర

- ఫ్రాన్స్ పత్రిక వెల్లడి
- పెద్దిరెడ్డి రవికిరణ్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్ర ప్రదేశ్

ఆంధ్రప్రదేశ్, వెలుతురు అక్టోబర్ 25: భారతదేశంలో సహా ప్రపంచంలోని కొన్ని దేశాలలో అల్లర్లు సృష్టించి తద్వారా ప్రభుత్వాన్ని మార్చాలని వివిధ దేశాల్లో ఉన్న 101 సంస్థలు కుట్ర పన్నుతున్నాయని ఫ్రాన్స్ కి చెందిన ఫాక్స్ న్యూస్ పేర్కొనటం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతోందని ప్రజలు అప్రమత్తం కావాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ అన్నారు. గడిచిన కొన్ని నెలలుగా దేశంలో జరుగుతున్న అల్లర్లపై అధ్యయనం చేసిన మేధావులు దేశంలో ఏ సమస్య ఉన్నా పోరాడేది మాత్రం అవ్వే ముఖాలు....అదే కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులు నక్సలి ఆలోచన ఉన్న కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు బుద్దింకలు కారణం ఏదైనా కావచ్చు నీట్ ప్రశ్న పత్రాల లీకేజీ కావచ్చు లేక కృత్రిమంగా సృష్టించబడ్డ ఓటు చోరీ కావచ్చు...రోడ్డుపై దిగేది మాత్రం వీళ్లే ఎందుకో ఈ కథనం ద్వారా తేటతెల్లం అవుతోందని... ప్రజలు ఈ ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని రవికిరణ్ విజ్ఞప్తి చేశారు. ఫాక్స్ పత్రిక ప్రచురించిన కథను ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ అనే సంస్థ ఫ్రాన్స్ మరియు భారతదేశంలో అల్లర్లు గొడవలు సృష్టిస్తుందని దీని వెనక డబ్బులు అందిస్తోంది నైవేలి రాయి సింగం. ఈయన అమెరికాలో నివసిస్తున్న కమ్యూనిస్టు కోటీశ్వరుడు. ఈయన భారతదేశంలో చైనా అనుకూల భారత దేశ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నందుకు ఇప్పటికే సిబిఐ ఈడి విచారణలో ఉన్నాడు. ఈయన నడిపిస్తున్న ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ ట్విట్టర్ ఖాతా చూస్తే భారత దేశ వ్యతిరేక కథనాలు ప్రచురితం అవుతున్నాయి. బొద్దింకల అల్లర్లు గురించి అబూత కల్పన విషయాలు రాస్తూ భారతదేశం ఏకంగా తమ ఆర్మీని ఢిల్లీ వీధుల్లో దించి ధమరకాండ చేస్తుందని అసత్యాలు రాస్తున్నారు. అంటే ఫ్రాన్స్ పత్రిక ఫాక్స్ రాసినదాల్లో అసత్యాలు లేవు ఆధారాలు కనబడుతున్నాయని గమనించాలి. అంతేకాదు ఈ ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ అన్న సంస్థకి కాంగ్రెస్ పార్టీకి సంబంధాలు కూడా బయటపడ్డాయి. ఈ సంస్థ ప్రతినిధుల్ని సోనియాగాంధీ రాహుల్ గాంధీ 28 ఏప్రిల్ 2025లో తమ సొంత నివాసమైన 10 జన్ పద్ లో కాంగ్రెస్ పార్టీ తన సొంత ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేసింది. అంటే భారతదేశ వ్యతిరేక కార్యకలాపాలని ప్రోత్సహిస్తున్న ఈ సంస్థతో కాంగ్రెస్ పార్టీకి ఉన్న సంబంధం సుస్పష్టం. విచిత్రం ఏంటంటే దేశ వ్యతిరేక కార్యకలాపాలకి పితామహుడుగా ఉన్న జార్జ్ సోరోస్ ఆయన నడిపిస్తున్న సంస్థ ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ సభ్యులతో కూడా రాహుల్ గాంధీకి కాంగ్రెస్ పార్టీకి అత్యంత దగ్గర సంబంధాలు ఉన్నాయి. ఆ ప్రతినిధులు రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జూడో యాత్రలో ప్రత్యక్షంగా పాల్గొటం కూడా దేశ ప్రజలు చూశారు. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు భావాలని ఇస్లామిక్ చాందస భావాలని విస్తరింప చేయాలి దానికోసం అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని దించి తమ కీలుబొమ్మ నాయకుల్ని ఆయా దేశ అధినేతలు చేయాలన్న కుట్ర జరుగుతోంది. ఈ కుట్రలో కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టు పార్టీలు అర్బన్ నక్సలైట్లు కమ్యూనిస్టు విద్యార్థి సంఘాలు వివిధ ఎన్జీవో రూపంలో ఉన్న వ్యక్తులు శక్తులు ఏకమవుతున్నారని చాలా స్పష్టం అవుతోంది. ఈ వ్యక్తులు శక్తులు యొక్క వ్యూహం ఒకటే దేశంలో ఉన్న చిన్న చిన్న సమస్యల్ని పెద్ద చేయాలి దానిపై ప్రజల్ని రెచ్చగొట్టాలి అబద్ధ అసత్య ప్రచారాల్ని సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసి రోడ్లపైన ఏరకంగా ఫ్రాన్స్ జర్మనీ ఇటలీలో అల్లర్లు సృష్టించి విధ్వంసాన్ని చేస్తున్నారు అటువంటి పరిస్థితులు దేశంలో ఢిల్లీ ముంబై చెన్నై కోల్కత్తా వంటి నగరాల్లో చెయ్యాలి తద్వారా ప్రధాని నరేంద్ర మోడీ గారిపై ఒత్తిడి తీసుకొచ్చి రాజీనామా చేయించాలి. ఇదే వీరి కుట్ర. దేశభక్తులైన ప్రజలు జాతీయవాదులు ప్రజాస్వామ్యవాదులు ఈ విషయాన్ని అందరికీ వివరించి ఈ శక్తుల ఉచ్చులో పడకుండా దేశాన్ని కలిసికట్టుగా కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఉక్రెయిన్‌లో ఇంటర్నెట్ వేగంపై ఆంక్షలు నిజమే

ప్రిటోరియా, వెలుతురు అక్టోబర్ 25 : ఇటీవల ఉక్రెయిన్‌లో డ్రోన్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడ్డ విషయంపై స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంచలన విషయం వెల్లడించారు. ఉక్రెయిన్‌లో స్టార్‌లింక్ ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధించిన మాట వాస్తవమేనని ఆయన అంగీకరించారు. ప్రస్తుతం ఆ సమస్య పరిష్కారమైందని ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించినట్లు తెలిపారు. స్టార్‌లింక్‌ను సైనిక కార్యకలాపాల కోసం ఉపయోగించి తమ సేవా నిబంధనలను ఉక్రెయిన్ ఉల్లంఘించిందని మస్క్ ఆరోపించారు. స్టార్‌లింక్ అనేది పౌరుల అవసరాల కోసం ఉద్దేశించిదని, డ్రోన్ దాడులకు వాడకూడదని స్పష్టం చేశారు. అయితే, అమెరికా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే స్టార్‌షీల్డ్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఏ ప్రైవేట్ సంస్థ చేయనంత సాయం ఉక్రెయిన్‌కు స్పేస్‌ఎక్స్ చేసిందని మస్క్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో స్టార్‌లింక్ సేవలను పునరుద్ధరించాలని తాను మస్క్‌ను ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు.

స్టార్‌షీల్డ్ సేవలు సాధారణ స్థితికి : జెలెన్స్కీ

మరోవైపు, ఉక్రెయిన్‌లో స్టార్‌లింక్ ఇంటర్నెట్‌తో పాటు సైనిక అవసరాల కోసం వినియోగించే స్టార్‌షీల్డ్ సేవలు సాధారణ స్థితికి చేరుకున్నాయని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్స్కీ తెలిపారు. ఆంక్షలు విధించక ముందు ఇంటర్నెట్ వేగం ఏ స్థాయిలో ఉండేదో, ఇప్పుడు మళ్లీ అదే వేగంతో సేవలు అందుతున్నాయని వెల్లడించారు. సరిహద్దుల్లోని సైనిక బలగాలకు సరకు రవాణా చేసేందుకు స్టార్‌లింక్ సేవలు అవసరమని పేర్కొన్నారు. రష్యా సేనలు ప్రయోగిస్తున్న షాహెద్ డ్రోన్లను అడ్డుకునేందుకు స్టార్‌షీల్డ్ దోహదపడుతోందని జెలెన్స్కీ వివరించారు. గత వారం స్టార్‌లింక్ సంస్థ ఉక్రెయిన్‌లో ఇంటర్నెట్ వేగంపై పరిమితులు విధించింది. స్టార్‌లింక్ చర్యలతో తమ డ్రోన్ మిషన్లకు తీవ్ర ఆటంకం ఏర్పడిందని ఉక్రెయిన్ ఆందోళన వ్యక్తంచేసింది. ఈ క్రమంలోనే ఇంటర్నెట్ వేగంపై పరిమితులను స్పేస్‌ఎక్స్ సంస్థ ఎత్తివేసింది.

ఘనంగా బండ్రు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అలయ్ బలయ్

హాజరైన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ చామల

ఆలేరు, వెలుతురు అక్టోబర్ 25 : మహిళా సహకార అభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి ఆధ్వర్యంలో ఆలేరులో బండ్రు ఫౌండేషన్ నిర్వహించిన అలయ్ బలయ్ వేడుకలు వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ కేంద్ర మంత్రి, మాజీ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు హాజరై ప్రసంగించారు. తెలంగాణ సమైక్యత, సోదరభావాన్ని చాటేలా అలయ్ బలయ్ వేడుకలు నిర్వహించడం అభినందనీయమని వారు కొనియాడారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో అలయ్ బలయ్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. కుల, మత, రాజకీయ విభేదాలకు అతీతంగా అందరినీ ఒక్కటి చేసే గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు. బండ్రు ఫౌండేషన్ ఆధ్వర్యంలో బండ్రు శోభారాణి సమాజంలో ఆత్మీయత, సోదరభావాన్ని పెంపొందించేలా కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, ఆర్టీఐ (టీటీఐ) చైర్మన్ బోరెడ్డి అయోధ్య రెడ్డి, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొని పరస్పరం అలయ్ బలయ్ చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జడ్చర్ల మార్చురీపై
ప్రచారం అవాస్తవం

- ఫ్రీజర్లు సక్రమంగానే పనిచేస్తున్నాయి
- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహమ్మద్ అర్షదుల్లా



జడ్చర్ల, వెలుతురు అక్టోబర్ 25 : జడ్చర్ల ఏరియా ఆస్పత్రి మార్చురీలో ఫ్రీజర్లు పనిచేయక మృతదేహాలు కుళ్లిపోయాయంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహమ్మద్ అర్షదుల్లా స్పష్టం చేశారు. ఈ నెల 23న ఆస్పత్రికి తీసుకువచ్చిన రెండు మృతదేహాలు అప్పటికే కుళ్లిపోయిన స్థితిలో ఉన్నాయని తెలిపారు. నాలుగైదు రోజుల క్రితం మృతి చెందిన మెట్ట లచ్చమ్మ (49), నీటిలో మునిగి చనిపోయిన శ్రీరాములు మృతదేహాలను మార్చురీకి తీసుకువచ్చినట్లు వివరించారు. వాటిని ఫ్రీజర్లలో భద్రపరిచామని పేర్కొన్నారు. మార్చురీ ఫ్రీజర్లకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, ఇతర విద్యుత్ లోపాల నుంచి రక్షణ కల్పించే ఎంసీబీ సౌకర్యం ఉందని, ఫ్రీజర్లు సక్రమంగానే పనిచేస్తున్నాయని చెప్పారు. విద్యుత్ వోల్టేజీలో హెచ్చుతగ్గుల వల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడినా, ఫ్రీజర్లు నాలుగు నుంచి ఆరు గంటలపాటు అవసరమైన ఉష్ణోగ్రతను నిర్వహించగలవని తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఫ్రీజర్ల కారణంగానే మృతదేహాలు కుళ్లిపోయాయని ప్రచారం చేయడం

డిండి ప్రాజెక్టు రద్దు చేయాలనడం డీకేకు తగదు

- డీకే అరుణ వ్యక్తిగత అభిప్రాయమా.. బీజేపీ విధానమా? : కాంగ్రెస్ నేత జక్కలి ఐలయ్య యాదవ్

సంస్థాన్ నారాయణపురం, వెలుతురు, అక్టోబర్ 25: డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడాన్ని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జక్కలి ఐలయ్య యాదవ్ తీవ్రంగా ఖండించారు. జాతీయ పార్టీలో ఎంపీగా, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా ఉన్న డీకే అరుణ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డిండి ప్రాజెక్టు రద్దు చేయాలనేది ఆమె వ్యక్తిగత అభిప్రాయమా? లేక బీజేపీ రాష్ట్ర పార్టీ విధానమా? అన్నది స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మునుగోడు, దేవరకొండ ప్రాంతాల ప్రజలకు సాగు, తాగునీరు అందించడంతో పాటు ఫ్లోరోసిస్ సమస్యతో బాధపడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించే డిండి ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయాలని కోరడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై బీజేపీ నాయకులు తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. అశాస్త్రీయమైన, అర్థరహితమైన వ్యాఖ్యలతో రెండు జిల్లాల ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేయడం సరైన పద్ధతి కాదని ఐలయ్య యాదవ్ అన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి నల్లగొండ జిల్లాకు నీటిని తరలించడం ఆయా ప్రాంతాల ప్రజల హక్కు అని పేర్కొన్నారు. ఒక ప్రాంతం వారు తమ ప్రాంతం నుంచే నీటిని తీసుకోవాలనే వాదన సరికాదని, అలాంటి విధానంతో తెలంగాణ రాష్ట్రానికి నీటిని ఎలా సాధించుకోగలమని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా డిండి ప్రాజెక్టుకు 0.50 టీఎంసీలు, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టుకు 2 టీఎంసీలు కేటాయిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర మంత్రివర్గం సరైన నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. దశాబ్దాలుగా ఫ్లోరోసిస్ సమస్యతో బాధపడుతున్న మునుగోడు, దేవరకొండ ప్రాంతాల ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకం కీలకమని చెప్పారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించడం ఈ ప్రాంతాల నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందని అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని ఎంపీ డీకే అరుణకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కారంటోతు బిక్షపతి నాయక్‌తో పాటు నాయకులు కుక్కల నరసింహ, కాట్రోతు సాగర్, కారంటోతు శ్రీరామ్ నాయక్, పగడాల లింగయ్య, గోపీ, వలిగొండ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వెలుతురు సండే స్పెషల్

పసిడి సెగ..
పెళ్లింట కన్నీటి వ్యథ!

ఆకాశాన్నంటిన బంగారం ధరలతో మధ్యతరగతి కుటుంబాల విలవిల



ఇంట్లో ఆడపిల్ల పెళ్లంటే ఒకప్పుడు సందడి.. సంబురం. ఇప్పుడు అదే పెళ్లి ప్రస్తావన వస్తే మధ్యతరగతి తల్లిదండ్రుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. పెళ్లి మండపం, విందు భోజనాలు, ఇతర ఖర్చుల కంటే ముందుగా బంగారం ధరలే వారిని బెంబేలెత్తిస్తున్నాయి. ఒకప్పుడు పైసా పైసా కూడబెట్టి కుమార్తె పెళ్లికి నాలుగైదు తులాల బంగారం కొనుగోలు చేసిన కుటుంబాలు.. ఇప్పుడు రెండు తులాలు కొనాలన్నా అప్పుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. రోజురోజుకూ పెరుగుతున్న పసిడి ధరలు సామాన్యుల కలలను కరిగిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణలోని గ్రామీణ, పట్టణ మధ్యతరగతి కుటుంబాలపై ఈ ప్రభావం తీవ్రంగా పడుతోంది. రాబోయే వారాల్లో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండటంతో ఆడపిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది. - వెలుతురు, హైదరాబాద్ స్పెషల్ అక్టోబర్ 25

- ఆడపిల్ల పెళ్లంటేనే తల్లిదండ్రుల గుండెల్లో గుబులు
- నాడు రూ.30 వేలున్న తులం.. నేడు అందనంత ఎత్తుకు!
- గతంలో పెట్టిన బంగారం తిరిగి పెట్టలేక బంధువుల మధ్య ఇబ్బందులు
- ముంచుకొస్తున్న పెళ్లిళ్ల సీజన్‌తో సామాన్యుల్లో ఆందోళన

నాడు వేల బంగారం.. నేడు లక్ష దాటిన భారం

కొన్నేళ్ల క్రితం తులం బంగారం రూ.30 వేల నుంచి రూ.40 వేల మధ్య ఉన్నప్పుడు పెళ్లిళు చేసిన కుటుంబాలకు ఇప్పుడు ధరల పెరుగుదల పెద్ద సమస్యగా మారింది. అప్పట్లో కొనుగోలు చేసిన బంగారానికి సమానమైన ఆభరణాలను ఇప్పుడు తిరిగి కొనాలంటే లక్షల రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నెలనెలా వచ్చే ఆదాయంలో ఇంటి అద్దె, పిల్లల చదువులు, నిత్యావసరాలు, వైద్య ఖర్చులు పోను మిగిలేది అంతంత మాత్రమే. ఇలాంటి పరిస్థితుల్లో పెళ్లి కోసం అదనంగా బంగారం కొనడం తలకు మించిన భారంగా మారుతోంది.

తిరిగి పెట్టలేక.. బంధుత్వాల్లో ఇరకాటం

తెలంగాణలోని పలు ప్రాంతాల్లో కుటుంబ శుభకార్యాల సందర్భంగా బంధువులు పరస్పరం బంగారం కానుకలుగా ఇచ్చిపుచ్చుకునే సంప్రదాయం ఉంది. గతంలో తమ ఇంట్లో జరిగిన పెళ్లిళ్లకు బంధువులు పెట్టిన బంగారాన్ని, వారి ఇళ్లలో శుభకార్యాలు జరిగినప్పుడు తిరిగి పెట్టడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇప్పుడీ సంప్రదాయమే మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారంగా మారుతోంది. గతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసిన బంగారాన్ని ఇప్పుడు అదే బరువుతో తిరిగి ఇవ్వాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. తక్కువ బంగారం పెడితే బంధువులు ఏమనుకుంటారోనన్న బెంగ.. సమానంగా పెట్టాలంటే అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలన్న ఆవేదన సామాన్యులను వేధిస్తోంది. ముఖ్యంగా ఆడపిల్లల పెళ్లిళ్లు, మేనకోడళ్ల వివాహాలు, దగ్గరి బంధువుల శుభకార్యాల సమయంలో ఈ సమస్య మరింత తీవ్రంగా మారుతోంది.

ఆడపిల్ల పెళ్లంటే అప్పుల భయమే..

చిన్నపాటి వ్యవసాయం చేసుకునే రైతులు, చిరుద్యోగులు, చిన్న వ్యాపారులు తమ కుమార్తెల వివాహాల కోసం ఏళ్ల తరబడి పొదుపు చేస్తుంటారు. అయితే బంగారం ధరలు పెరుగుతున్న వేగానికి వారి పొదుపు సరిపోవడం లేదు. పెళ్లి ఖర్చుల కోసం దాచుకున్న సొమ్ములో అధిక భాగం బంగారం కొనుగోలుకే వెచ్చించాల్సి వస్తోంది. దీంతో ఇతర ఏర్పాట్ల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మరోవైపు పెళ్లి సమయంలో అమ్మాయికి ఎంత బంగారం పెడతారన్న సామాజిక ఒత్తిళ్లు కొన్ని కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కుమార్తెకు బంగారం పెట్టలేకపోతే అత్తింటివారు ఏమనుకుంటారోనన్న ఆందోళన తల్లిదండ్రులను వేధిస్తోంది. ఉన్న ఆస్తులను అమ్ముకోవాలా.. అప్పులు చేయాలా.. లేక ఆడంబరాలకు దూరంగా పెళ్లి జరిపించాలా అన్న సందిగ్ధంలో పడుతున్నారు.

ముంచుకొస్తున్న పెళ్లిళ్ల సీజన్

రాబోయే వారాల్లో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండటంతో బంగారం కొనుగోలు చేయాల్సిన కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ధరలు తగ్గుతాయన్న ఆశతో కొందరు కొనుగోళ్లను వాయిదా వేస్తుంటే.. మరింత పెరిగితే పరిస్థితి ఏమిటన్న భయం మరికొందరిని వెంటాడుతోంది. బంగారం ధరకు అదనంగా ఆభరణాల తయారీ ఛార్జీలు, పన్నులు కలవడంతో అంచనా వేసుకున్న బడ్జెట్ మరింత పెరుగుతోంది. దీంతో భారీ ఆభరణాల స్థానంలో తక్కువ బరువున్న నగలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

బంగారం కంటే బిడ్డ భవిష్యత్తే ముఖ్యం!

పెళ్లి కోసం చేసిన అప్పులు తీర్చడానికి ఏళ్ల తరబడి కష్టపడాల్సి వస్తే ఆకుటుంబంలో మిగిలేది సంతోషం కాదు.. ఆర్థిక వేదనే. బంగారం ఎక్కువగా పెట్టడమే గొప్పతనమనే భావన మారాలని,ఎవరి ఆర్థిక స్థోమతకు అనుగుణంగా వారు శుభకార్యాలు నిర్వహించుకునే వాతావరణం రావాలని పలువురు కోరుతున్నారు. పెళ్లి అనేది రెండు కుటుంబాల కలయిక. అది అప్పుల భారంగా మారకూడదు. బంధుత్వాలను బంగారం తూకంతో కొలవకూడదు. బిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు తమ శక్తికి మించి అప్పులు చేయాల్సిన పరిస్థితి మారాలి. పసిడి ధరలు ఎంత పెరిగినా పెళ్లింట ఆనందం తగ్గకూడదు.. బంగారం కొనలేక తల్లిదండ్రుల కళ్లలో కన్నీళ్లు తిరగకూడదు.

విశ్వకర్మలు రాజకీయ శక్తిగా ఎదగాలి

బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

విశ్వకర్మలు ఒక శక్తిగా నిలిస్తే, అన్ని రాజకీయ పార్టీలు కదలివస్తాయి అని మాజీ శాసన సభాపతి, బీఆర్ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు.

రాజకీయంగా గుర్తింపు లేకపోతే ఏ కులం ముందుకు వెళ్లదన్నారు. సమాజంలో రాజ్యాధికారంలో ఉన్న కులాలు, రాజ్యాధికారంలో లేని కులాలు మాత్రమే ఉంటాయని జనాభా పరంగా గణనీయంగా ఉన్నప్పటికి, విశ్వకర్మలకు లభించాల్సిన రాజ్యాధికార వాటా దక్కలేదని తెలిపారు. ఆదివారం ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ప్రాంగణంలో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ చైతన్యంలో విశ్వకర్మలు ఎవ్వరికీ తీసిపోరని ధీమా వ్యక్తం చేశారు.

వచ్చే ఎన్నికల సమయానికి కనీసం 10 మంది విశ్వకర్మలు చట్టసభలకు ఎన్నికవ్వాలని ఆకాంక్షించారు. జనాభా పరంగా 15 లక్షలు ఉన్న విశ్వబ్రాహ్మణులు రాజ్యాధికారం దిశగా తమ హక్కులు, వాటాల కోసం పోరాడాలన్నారు. వార్డు మెంబరు స్థాయి నుండి ఎమ్మెల్యే వరకు విశ్వకర్మలు పోటీ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ దేవరకొండ కాళిదాస్, కో-కన్వీనర్ అడ్లూరి రవీంద్రాచారి, బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారి, కాంగ్రెస్ నాయకుడు తంగెళ్లపల్లి రవికుమార్, భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ వాణి, బీసీ జేఏసీ నేత కుందారం గణేశ్ చారి, సంఘం పెద్దలు లాల్ కోట వెంకట చారి, జేఏసీ నాయకులు బైరోజు శేఖర్ చారి, రాజమౌళి చారి తదితరులు హాజరయ్యారు.

విశ్వబ్రాహ్మణులు తమ నాయకత్వ లక్షణాలను చాటుకొని, అన్ని పార్టీలలో సముచిత పదవులను తీసుకోవాలని ఈ సమావేశంలో పలువురు ఆకాంక్షించారు. చట్టసభలలో పోటీకి సిద్ధం కావాలన్నారు. ముఖ్యంగా విశ్వకర్మ యువత, మహిళలను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. గత ప్రభుత్వం ఇద్దరు విశ్వకర్మలను శాసనమండలికి పంపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జనాభా పరంగా తాము బీసీ కులాలలో నాలుగైదు స్థానాల్లో ఉన్నామని, అన్ని పార్టీలు విశ్వకర్మలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిందేనని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

శివాజీ మహారాజ్ జీవితం, ఆదర్శాలు
తరతరాలకు స్ఫూర్తిదాయకం: గవర్నర్

ఘజియాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం, వీరత్వం, దూరదృష్టితో కూడిన నాయకత్వం తరతరాలకు స్ఫూర్తిదాయకమని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. దేశభక్తి, సుపరిపాలన, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం, చరిత్ర ఆధారంగా రూపొందించిన 'జనతా రాజా' నాటక ప్రదర్శనకు గవర్నర్ తన సతీమణి జానకి శుక్లాతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన దివ్య ప్రేమ సేవా మిషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు, ఆదర్శవంతమైన నాయకత్వం, సుపరిపాలన, ప్రజల రక్షణ పట్ల అంకితభావం నేటికీ స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. శివాజీ మహారాజ్ వారసత్వం యువతలో దేశభక్తి, నిజాయతీ, ఆత్మగౌరవం, దేశం పట్ల బాధ్యతాభావాన్ని పెంపొందిస్తోందని అన్నారు. భారతదేశ గొప్ప సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని పరిరక్షించి, దాని విలువలను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కిచెప్పారు. నాటక రూపంలో గొప్ప మరాఠా పాలకుడి జీవితం, విజయాలను ప్రజలకు చేరువ చేస్తూ, ఆయన స్ఫూర్తిదాయక వారసత్వంపై అవగాహన కల్పిస్తున్న దివ్య ప్రేమ సేవా మిషన్ కృషిని గవర్నర్ అభినందించారు.

చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ పద్మవ్యూహం!

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో వాహనదారుల ఇక్కట్లు.. పోలీసుల తీరుపై అసహనం

షాద్‌నగర్, వెలుతురు అక్టోబర్ 25:

పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యలకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు తోడవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే గేటు తరచూ పడటంతో ఇప్పటికే వాహనాలు బారులు తీరుతుండగా, నాలుగు వైపులా ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహించడం రాకపోకలకు ఆటంకంగా మారుతోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సాయంత్రం వేళ వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతంలో ట్రాఫిక్ నిర్వహణపై దృష్టి పెట్టకుండా, గేటు సమీపంలోనే వాహనాలను నిలిపి తనిఖీలు చేయడం వల్ల ఇబ్బందులు పెరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. తనిఖీలను రద్దీకి దూరంగా నిర్వహించి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

తనిఖీలపై ప్రశ్నించిన వాహనదారులకు కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడపడాన్ని నియంత్రించడం అవసరమే అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు తగిన ప్రణాళికతో వ్యవహరించాలని, చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు.

రెండో పంట వేయొద్దు!

- సూపర్ ఎల్‌నినోతో నీటి కొరత ముప్పు
- తొలి పంటను కాపాడేందుకు ఎంత ఖర్చుకైనా సిద్ధం
- సంక్షోభ నివారణకు కేంద్రం సహకరించాలి: మంత్రి పొంగులేటి

ఖమ్మం, వెలుతురు అక్టోబర్ 25:

రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ పరిస్థితులు తెలంగాణకే పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఎదుర్కొంటున్నాయన్నారు. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని సూచించారు.

ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.38 కోట్ల వ్యయంతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం రోడ్డు వరకు నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి పనులతో పాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అదేవిధంగా రూ.కోటి వ్యయంతో చేపట్టిన జంక్షన్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

వానాకాలంలో రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చుకైనా వెనుకాడదని చెప్పారు. పంటలకు అవసరమైన నీరు, విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రానున్న కాలంలో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేశారు. కరువు పరిస్థితులను గతంలో ఎదుర్కొన్న అనుభవం రైతులకు ఉందని, ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా తెలంగాణకు వివక్ష లేకుండా సహాయ సహకారాలు అందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అవసరమైన మద్దతు లభించేలా బీజేపీ ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 25:

బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న 8,000 మంది తాత్కాలిక టీచర్లను వెంటనే పర్మినెంట్ చేయాలని రాజ్యసభ సభ్యులు, బిసి సంక్షేమ సంఘం అధ్యకులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం బీసీ భవన్‌లో జరిగిన రాష్ట్ర తాత్కాలిక ఉద్యోగుల సంఘం సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ 10, 20 సంవత్సరాల నుండి పనిచేస్తున్న వీరిని రెగ్యులరైజ్ చేయాలని సుప్రీంకోర్టు తీర్పులు, హైకోర్టు తీర్పులు ఉన్న విషయాన్నీ ఆ సందర్భంగా కృష్ణయ్య గుర్తు చేశారు.

అనేక రాష్ట్రాలలో ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, పంజాబ్ తదితర రాష్ట్రాలలో లక్షలాది మంది తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేశారు. మన రాష్ట్రంలో గతంలో కాంట్రాక్ట్ డేలివేజ్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారు. కానీ ఇంకా అవుట్సోర్సింగ్, పార్ట్ టైం, గెస్ట్ టీచర్, గెస్ట్ లెక్చరర్లు వేల సంఖ్యలో ఉన్నారు. వీరికి అన్యాయం జరుగుతుంది, శ్రమ దోపిడీ జరుగుతుంది. మన రాష్ట్రంలో కూడా ఇదే పద్ధతిలో పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాలు గడుస్తున్న జీతాలు పెరగడం లేదు. కుటుంబ పోషణ భారం పెరిగింది. పిల్లల ఫీజులు, ఇంటి అద్దె చెల్లించలేక ఉద్యోగులు ఇబ్బందులకు గురువుతున్నారు. వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకోవాలని ఒక విధాన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రయాణికులకు ఆర్టీసీ ధమాకా ఆఫర్

- సరికొత్త పథకానికి టీజీఎస్ ఆర్టీసీ శ్రీకారం
- హైదరాబాద్‌లో ఇక మరింత ఈజీ
- రూ.600కే వారం రోజుల పాటు క్యూర్ పరిధిలో ఏసి బసుల్లో సహా అన్ని బసుల్లో అపరిమిత బస్ ప్రయాణం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25 :

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిత్యం ప్రయాణించే ప్రయాణికులు, పర్యాటకులు, వ్యాపార పనుల నిమిత్తం నగరానికి వచ్చే వారి సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఒక సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రయాణికులకు ఆర్థిక భార తగ్గించడంతో పాటు సులభతరమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో రూ. 600 ధర కలిగిన 'వీక్లీ బస్ పాస్'ను ప్రారంభించింది. ఈ పాస్ కొనుగోలు చేసిన రోజు నుండి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. ఈ కొత్త వీక్లీ పాస్ ద్వారా ప్రయాణికులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఏసీ బస్సులతో సహా అన్ని రకాల సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించవచ్చు. అయితే, కేవలం 'పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్' సర్వీసులకు మాత్రం ఈ పాస్ వర్తించదని సంస్థ స్పష్టం చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రోజువారీ పాస్, నెలవారీ పాస్ సౌకర్యాలకు అదనంగా, ప్రయాణికులకు మరొక చవకైన, అనుకూలమైన ప్రయాణ ఎంపికను అందించడానికి టీజీఎస్ ఆర్టీసీ ఈ సరికొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో స్వల్పకాలిక బస కోసం వచ్చే పర్యాటకులకు, వ్యాపారవేత్తలకు మరియు వారం రోజుల పాటు నిరంతరం క్యూర్ పరిధిలో ప్రయాణించాల్సిన వారికి ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ వీక్లీ పాస్ వల్ల ప్రయాణికులు ఏడు రోజుల వ్యవధిలో చేసే ప్రతి ప్రయాణానికి వేర్వేరుగా టికెట్లు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. ఒక్కసారి పాస్ తీసుకుంటే ఏడు రోజుల పాటు నగరంలో ఏ సిటీ బస్సులోనైనా (పుష్పక్ బస్సు మినహా) నిరభ్యంతరంగా, వేగంగా ప్రయాణించవచ్చు. ఈ వీక్లీ పాసులు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయి. అవసరమైన వారు తమ సమీపంలోని బస్ పాస్ కౌంటర్లలో కొనుగోలు చేయవచ్చని యాజమాన్యం వెల్లడించింది. ప్రజా రవాణా వ్యవస్థ వినియోగాన్ని మరింత ప్రోత్సహించడమే కాకుండా, నగర ప్రయాణికులకు అందుబాటు ధరలలో మెరుగైన ప్రయాణ సేవలు అందించే దిశగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ వీసీ, ఎండీ వై.నాగిరెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో వారం రోజుల పాటు ప్రయాణించే వారందరూ ఈ రూ. 600 వీక్లీ బస్ పాస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఎండీ నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక వ్యవస్థలపై దాడులే ఆధునిక యుద్ధాలు

- బ్యాంకింగ్ రంగానికి సైబర్ ముప్పు: ప్రధాని మోదీ
- భువనేశ్వర్‌లో ఆర్‌బీఐ రూ.169 కోట్ల డేటా సెంటర్, సైబర్ భద్రత శిక్షణ సంస్థ ప్రారంభం

భువనేశ్వర్, వెలుతురు అక్టోబర్ 25:

ప్రస్తుత యుద్ధాలు సంప్రదాయ ఆయుధాలతోనే కాకుండా ఆర్థిక వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని కూడా జరుగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ ఉగ్రవాదుల నుంచి భారత బ్యాంకింగ్ వ్యవస్థను రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఒడిశాలో 169కోట్లతో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌బీఐ డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ శిక్షణా సంస్థను.. మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని తమ దృష్టిలో అభివృద్ధి అంటే దేశ సమగ్రాభివృద్ధితో పాటు గ్రామాలు, చిన్న పట్టణాలకు అవకాశాలు కల్పించడమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం భారత బ్యాంకింగ్ రంగం ప్రపంచంలోనే అత్యంత సమర్థంగా పనిచేస్తూ ప్రజలకు 24 గంటలూ సేవలు అందిస్తోందన్నారు. కాంగ్రెస్ హయాంలో కేవలం కొందరు ధనవంతులు, పలుకుబడి ఉన్నవారికి మాత్రమే బ్యాంకింగ్ సేవలు అందేవని, పేదలు, మధ్యతరగతి వారు, మహిళలకు రుణాలు దక్కేవికావని మోదీ విమర్శించారు. 2014తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ఒకప్పుడు లగ్జరీగా భావించిన డెబిట్, క్రెడిట్ కార్డులు ఇప్పుడు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. 'నేడు యుద్ధాలు కేవలం ఆయుధాలతో మాత్రమే జరగవని మనందరికీ తెలుసు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థపై దాడులు చేయడం ద్వారా కూడా ఆ దేశాన్ని బలహీనపరచవచ్చు. భారత్ ఆర్థికంగా బలపడుతున్న తరుణంలో, మన బ్యాంకింగ్ వ్యవస్థను సైబర్ నేరస్థులు, సైబర్ ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవడం కూడా అంతే ముఖ్యం. పాతబడిన వ్యవస్థలు, పాత శిక్షణా పద్ధతులు లేదా కాలం చెల్లిన సాధనాలతో ఈ కొత్త సవాళ్లను మనం ఎదుర్కోలేం. మనకు ఆధునిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు అవసరం. ఇక్కడే ఈ కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థ కీలక పాత్ర పోషించనుంది' అని ప్రధాని మోదీ అన్నారు.

ఇఎస్ఐ కాంట్రాక్టుల్లో భారీ కుంభకోణం

- హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

రాష్ట్రంలోని నాలుగు ప్రధాన ఇఎస్ఐ ఆస్పత్రుల క్లీనింగ్ కాంట్రాక్టుల పేరుతో కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని సీపీఐ (ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆరోపించింది. ఈ వ్యవ హారంపై కేవలం విజిలెన్స్ విచారణతో సరిపెట్ట కుండా,హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యులైన అధికారులతో పాటు సంబంధిత ఏజెన్సీపై క్రిమి నల్ కేసులు నమోదు చేసి, కుంభకోణంలో దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని కోరారు.

ఉపాధి కల్పనా కమిటీ నివేదిక, అధికారుల సిఫార్సులను పక్కనపెట్టి క్లీనింగ్ ఛార్జీలను చదరపు అడుగుకు రూ.10 నుంచి రూ.49.50కు పెంచారని జాన్ వెస్లీ ఆరోపించారు.దీంతో గతంలో నెలకు రూ.61.71లక్షలుగా ఉన్న ఖర్చు ప్రస్తుతం రూ.3.05కోట్లకు చేరిందని పేర్కొన్నారు. ఛార్జీలను 260శాతం పెంచినా,కార్మికుల వేతనాలు పెంచకుండా నిధులను దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు.

గతంలో ఇఎస్ఐ మందుల కొనుగోళ్లలోనూ కుంభకోణం జరిగిందని గుర్తుచే శారు. కార్మికుల ఆరోగ్యం, రక్షణ కోసం కేటా యించిన నిధులను స్వలాభం కోసం దుర్వినియోగం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకో వడంతో పాటు, అక్రమ కాంట్రాక్టును తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిద్రిస్తున్న బిడ్డతో 21 కి.మీ. పరిగెత్తిన మహిళ

మారథాన్‌లో అందరి ఫోకస్ 'ఆమె'వైపే...

కశ్మీర్, వెలుతురు అక్టోబర్ 25:

ఆదివారం ఉదయం చల్లటి వాతావరణంలో దాల్ సరస్సు తీరాన జరిగిన కశ్మీర్ మారథాన్ (3వ ఎడిషన్) 2026లో ఒక అద్భుత దృశ్యం ప్రేక్షకుల్ని ఆశ్చర్యానికి గురిచేయడమే కాకుండా, అందరి మనసుల్ని గెలుచుకుంది. శ్రీనగర్‌లో జరిగిన ఈ కశ్మీర్ మారథాన్‌లో కుల్సుమ్ బాను అనే మహిళ అందరి దృష్టిని ఆకర్షించారు. నిద్రపోతున్న తన ఏడాది వయసున్న కుమారుడు మహ్మద్‌ను బేబీ క్యారియర్‌లో ఎత్తుకొని ఆమె ఏకంగా 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో పాల్గొనడం విశేషం. సాధారణంగా మారథాన్‌లో పాల్గొనడమే సవాలుతో కూడుకున్న పని. అలాంటిది చిన్నారిని ఎత్తుకొని పరుగు తీసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తల్లిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఫిట్‌నెస్‌పై ఆసక్తిని చాటుకున్న ఆమె ప్రయత్నం పలువురు మనసుల్ని గెలుచుకుంది.

గుజరాత్‌కు చెందిన కుల్సుమ్ బాను తొలిసారిగా హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నారు. హాఫ్ మారథాన్ అంటే సుమారు 21 కిలోమీటర్ల దూరం ఉండే ఒక రోడ్ రన్నింగ్ ఈవెంట్ అని చెప్పొచ్చు. మారథాన్ అంటే 42 కిలోమీటర్లు కాగా అందులో సగమే ఈ హాఫ్ మారథాన్. ఇక్కడ బాను తన బిడ్డ క్యారియర్‌లో నిద్రిస్తుండగా, 27071 నంబర్ బిబ్ ధరించి ఆమె హాఫ్ మారథాన్ రన్ ప్రారంభించారు. తన ఈ రన్‌ను ఫిట్‌నెస్ శిక్షణ పొందుతున్న చిన్నారులందరికీ అంకితం ఇస్తున్నట్లు కుల్సుమ్ బాను తెలిపారు. 'నా పేరు కుల్సుమ్ బాను. మాది గుజరాత్. నా చిన్న కుమారుడు మహ్మద్‌ను మోస్తూ ఈ హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నాను. నా ఈ రన్‌ను క్రీడల్లో, ఫిట్‌నెస్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు అందరికీ అంకితం చేస్తున్నాను' అని హాఫ్ మారథాన్ రన్నర్ కుల్సుమ్ బాను తెలిపారు.

ఆర్టీసీ కండక్టర్‌పై దాడి

అమానుషం

- గాయపడిన కండక్టర్ ప్రవళికకు మెరుగైన వైద్యం అందించాలి
- దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, వెలుతురు, అక్టోబర్ 23:

మణుగూరు డిపోకు చెందిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) కండక్టర్ ప్రవళిక విధి నిర్వహణలో ఉండగా ఆమెపై జరిగిన దాడిని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడటం సహించరాని విషయమని ఆయన స్పష్టం చేశారు.

ఈ ఘటనకు సంబంధించిన వివరాలను టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి మంత్రి తెలుసుకున్నారు. దాడిలో గాయపడిన కండక్టర్ ప్రవళికకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఘటనకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు రవాణా సేవలు అందించే సిబ్బందితో ప్రయాణికులు సహృదయంతో వ్యవహరించాలని సూచించారు. ప్రయాణ సమయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలే తప్ప, దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.

ఆర్టీసీ కార్మికుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు నిరంతరం సేవలందించే ఆర్టీసీ సిబ్బందికి రక్షణ కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

సింగరేణి ప్రగతిపై భట్టి సమీక్ష

- ప్రజాభవన్‌లో 66 మంది జనరల్ మేనేజర్లతో కీలక సమావేశం
- బొగ్గు ఉత్పత్తి, రవాణా, లక్ష్యాల సాధనపై ఆరా
- కొత్త గనుల అభివృద్ధి, భవిష్యత్ విస్తరణపై చర్చ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 25:

సింగరేణి సంస్థ పనితీరు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక సమీక్ష చేపట్టారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సింగరేణికి చెందిన మొత్తం 66 మంది జనరల్ మేనేజర్లతో ఆదివారం ప్రత్యక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంస్థ సాధించిన ప్రగతిని అధికారులు వివరించారు. జనరల్ మేనేజర్ల విధులు, బాధ్యతలు, క్షేత్రస్థాయి పనితీరుపై ఉప ముఖ్యమంత్రి ఆరా తీశారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ఉత్పత్తి, రవాణా పరిస్థితులు, రైల్వే రేకుల లభ్యత, బొగ్గు తరలింపు వివరాలపై సమీక్షించారు. ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనుల్లో ఉత్పత్తి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉత్పత్తి పెంపు, రవాణా వేగవంతం, నిర్దేశిత లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. సింగరేణి భవిష్యత్ విస్తరణ, కొత్త గనుల అభివృద్ధి ప్రణాళికలు, సంస్థ ఉత్పాదకత, సామర్థ్యం పెంపుపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. సంస్థను మరింత బలోపేతం చేసే అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సింగరేణి చరిత్రలో కీలకంగా భావిస్తున్న ఈ సమావేశం కొనసాగుతోంది.

కన్నడిగులకు ఐటీ ఉద్యోగాలు ఇవ్వకపోతే కఠిన చర్యలు

బెంగళూరు, వెలుతురు అక్టోబర్ 25:

బెంగళూరులోని కొన్ని విద్యాసంస్థలు, ప్రైవేటు ఐటీ కంపెనీలు కన్నడిగులకు ఉద్యోగావకాశాలు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా పక్కన పెడుతున్నాయనే ఆరోపణలపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. 'కర్ణాటకలో కన్నడిగుడే సార్వభౌముడు' అని ఆయన స్పష్టం చేస్తూ, కన్నడ భాష మాట్లాడే వారికి ఉద్దేశపూర్వకంగా ఉద్యోగాలు నిరాకరిస్తే ప్రైవేటు సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.

బెంగళూరులోని ఐటీ కంపెనీల్లో నియామకాల సమయంలో భాషా ప్రాతిపదికన వివక్ష చూపుతున్నారని ఒక యువతి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో సంచలనం సృష్టించింది. ఇంటర్వ్యూలు లేదా షార్ట్‌లిస్టింగ్ సమయంలో తమ మాతృభాష 'కన్నడ' అని చెప్పిన అభ్యర్థులను తిరస్కరిస్తున్నారని ఆ యువతి ఆరోపించింది. కంపెనీలు తక్కువ జీతాలకు పనిచేయించుకోవడానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చే తెలుగు, తమిళ భాషా అభ్యర్థులకే ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొంది. అంతేకాదు, బెంగళూరులోని స్థానిక కళాశాలల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదని, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆమె ప్రభుత్వానికి విన్నవించుకుంది. కన్నడ ఉద్యమకారుడు రూకేష్ రాజన్న కూడా ఈ అంశంపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

డికే శివకుమార్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రైవేట్ సంస్థలు కన్నడిగులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టినట్లు తేలితే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 'ఎట్టిపరిస్థితుల్లో కన్నడిగుల హక్కులు, గౌరవం, అవకాశాలను తక్కువ చేయడానికి ప్రభుత్వం అంగీకరించదు' అని స్పష్టం చేశారు. బెంగళూరును ప్రపంచం భారతదేశపు ఐటీ రాజధానిగా చూస్తోందని, తమ కన్నడిగుల నైపుణ్యాలు, సామర్థ్యాలపై ప్రభుత్వానికి ఎంతో గర్వంగా ఉందని చెప్పారు. ఈ అంశంపై బీజేపీ అధికార ప్రతినిధి అశోక్ గౌడ స్పందిస్తూ, ప్రభుత్వం ఉపాధి అవకాశాలను పెంచడానికి ఎటువంటి చర్యలు తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రైవేటు రంగంలో కన్నడిగులను ప్రోత్సహించేలా, కొత్త ఉద్యోగాల సృష్టిపై శివకుమార్ నిర్దిష్టమైన ప్రణాళికను వివరించాలని ఆయన కోరారు.

బెర్న్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి

తెలంగాణ-స్విట్జర్లాండ్ మధ్య పర్యాటక, పెట్టుబడుల రంగాల్లో అపార అవకాశాలు

బెర్న్, వెలుతురు అక్టోబర్ 25:

బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, మహిళల ఐక్యతకు, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్విట్జర్లాండ్‌లోని బెర్న్‌లో స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. బెర్న్‌కు చేరుకున్న మంత్రికి విమానాశ్రయంలో ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారు.

విదేశీ గడ్డపై తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భావితరాలకు అందిస్తున్న ప్రవాస తెలంగాణ ప్రజలను మంత్రి అభినందించారు. తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వైభవం, ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలను అంతర్జాతీయ స్థాయిలో పరిచయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పర్యాటకం, ఫిల్మ్ టూరిజం, ఆతిథ్య రంగాల్లో తెలంగాణ-స్విట్జర్లాండ్ మధ్య పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

తెలంగాణలో పెట్టుబడులకు స్విస్ కంపెనీలకు ఆహ్వానం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను పెట్టుబడులు, పరిశ్రమలు, ఆవిష్కరణలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని జూపల్లి కృష్ణారావు తెలిపారు. లైఫ్ సైన్సెస్, కృత్రిమ మేధస్సు, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో స్విట్జర్లాండ్‌తో భాగస్వామ్యాలకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. స్విస్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని, రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా భాగస్వామ్యాలను అభివృద్ధి చేయాలని ఆహ్వానించారు.

బెర్న్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించిన స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులకు, వేడుకల్లో పాల్గొన్న తెలుగు కుటుంబాలకు మంత్రి అభినందనలు,శుభాకాంక్షలు తెలిపారు. విదేశాల్లోనూ తెలంగాణ పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com